# బైబిలు మిషను

# సంఘారాధనలు

గ్రంథకర్త

యం. దేవదాసు అయ్యగారు

గుంటూరు - 2012 వెల : 40.00

Bible Mission HQ Guntur

# పరిచయము

ప్రియులారా!

ఈ పుస్తకమునందు ముద్రించబడిన ఆరాధనలు దేవుడు బైబిలు మిషనును బైలుపరచిన యం. దేవదాసు అయ్యగారు చాలాకాలము క్రిందట వ్రాసి ఇచ్చిరి. వాటిని అందరికిని అందించుటకు ప్రభువు సహాయపడినందుకు ఆయనకనేక స్తోత్రములు చెల్లించుచున్నాము.

ఇవి చాలా అమూల్యమైన ఆరాధనలు. సామాన్యులెవరును వ్రాయలేని దైవస్తుతులు. బహు వివరముగానున్న పాపపుటొప్పుదల, అనేక అంశములుగల ప్రార్థనలు బహువిలువైనవి గనుక వీటిని చదువుటవలన, చదువరులు నూతన విషయములు తెలుసుకొనగలరు. ***అలాగే చదివినవాటిని ధ్యానించుటవలన ఆత్మీయ అనుభవమును సంపాదించగలరు.*** పరిశుద్ధాత్మ- సంఘమును నడిపించుటయు, విశ్వాసిని సంపూర్ణ స్థితికి తయారుచేయుటయును వీటిలో గ్రహింపగలము. ప్రభువుయొక్క మహిమగల రాకడకు తయారగువారు ఈ ఆరాధనలు వారికి గొప్ప సహాయకరముగా నున్నట్లు కనుగొనగలరు. ఈ పుస్తకములో చేర్చబడిన ఆరాధనలు, ప్రార్థనలు, స్తుతులు, చదువువారి జ్ఞానమును వెలిగించి, నూతన విషయములు ఎరుకపరచును. వీటిని ఉపయోగించుటవలన అనేకమంది విశ్వాసులు, సంఘములు బలపరచబడునని విశ్వసించుచున్నాము. దేవుడు తన మహిమకొరకును, అనేకుల ఉపయోగముకొరకును ఈ చిన్న పుస్తకమును దీవించునుగాక!

ఇట్లు

త్వరగా వచ్చుచున్న ప్రభువునందలి,

**రెవ. డా॥ యన్. సత్యానందం**

ప్రసిడెంట్, బైబిలుమిషను.

Bible Mission HQ Guntur

# విషయసూచిక


| క్రమసంఖ్య | | | పేజి నం. |
|---|---|---|---|
| 1. | ఆదివారపు ఆరాధన | - | 1 |
| 2. | సంఘారాధన | - | 14 |
| 3. | ప్రభు భోజన సంస్కార ఆరాధన | - | 22 |
| 4. | బాప్తిస్మ ఆరాధన క్రమము | - | 28 |
| 5. | అభిషేకారాధన క్రమము | - | 34 |
| 6. | పెద్దలను ఏర్పరచుక్రమము | - | 42 |
| 7. | పనివారిని ఏర్పరచుట | - | 43 |
| 8. | చిన్నబిడ్డల ప్రతిష్ఠారాధన క్రమము | - | 45 |
| 9. | ఆలయ ప్రతిష్టారాధన | - | 47 |
| 10. | వివాహ ఆరాధన | - | 54 |
| 11. | గృహప్రవేశారాధన | - | 67 |
| 12. | మృతుల భూస్థాపన క్రమము | - | 72 |
| 13. | వార బోధిని (30 సంఘ, జీవితాంశములు) | - | 79 |
| 14. | కాలోచిత ప్రార్థనలు | - | 94 |
| 15. | క్రీస్తు జన్మ ప్రవచన సంవత్సరములు | - | 95 |
| 16. | నూతన సంవత్సర ప్రార్థన | - | 99 |
| 17. | బైబిలుమిషను ఆనవర్సరీ స్తుతులు, ప్రార్థనలు | - | 101 |
| 18. | అయ్యగారి జ్ఞాపకార్థ ప్రార్థన | - | 106 |
| 19. | కానుకల పండుగ స్తుతి | - | 111 |
| 20. | పుష్పావతి అయినప్పుడు చేయవలసిన స్తుతి ప్రార్థనలు | - | 152 |
| 21. | ఉపకారముల స్తుతి | - | 155 |
| 22. | విజ్ఞాపనాంశములు | - | 160 |
| 23. | ప్రార్థనాధికము | - | 162 |
| 24. | దీవెనలు | - | 164 |


**షరా:- 95వ పేజినుండి 151వ పేజివరకు సంవత్సర ప్రారంభము నుండి, సంవత్సరాంతము వరకుగల ప్రాముఖ్యమైన ప్రార్థనలు, స్తుతులు కలవు.**

Bible Mission HQ Guntur

# ఆదివారపు ఆరాధన క్రమము

## కనిపెట్టుట

(ఆరాధన ప్రారంభించు సమయము వరకు నిశ్శబ్దముగా కనిపెట్టవలెను. సభ నిలువబడియుండగా, బోధకుడు ఆల్టరు వైపునకు తిరిగి మోకరించి ప్రార్థించవలెను)

## ప్రార్థన

**బో:** మహాపరిశుద్ధుడవగు దేవా! మహా గౌరవపాత్రుడవగు దేవా! తండ్రీ, కుమార, పరిశుద్ధాత్మయను త్రైక దేవా! మా ప్రియుడవైన తండ్రీ! నీవు దివ్య లక్షణములుగల దేవుడవు గనుక నీకనేక నమస్కారములు. నిన్ను ఆరాధించు స్థలమునకు నన్ను రానిచ్చినందుకు నీకనేక స్తోత్రములు. నిన్ను ఆరాధించు భాగ్యమనుగ్రహింతువని ముందుగనే నమ్మి నీకు స్తుతి చేయుచున్నాను. తండ్రీ! నిన్నారాధించు ఘడియయందు నా తలంపులను ఆరాధనలోని ప్రతి సంగతి తట్టు త్రిప్పి నిలుపుము. ఇతర సంగతులెంత మంచివైనను ఆ మంచి సంగతులు గాని, చెడ్డ సంగతులుగాని నా హృదయమును ఆకర్షింపనీయకుము. నేను నిన్నారాధించు పనిమీదనే యుండి, కృతజ్ఞతతో నా హృదయమును నింపుకొన-గలుగు ఆనందస్థితి నాలో కలిగించుము. ఆరాధనలోని ఒప్పుదలలు, సమర్పణలు, స్తుతులు, ప్రార్థనలు, నీ వాక్యములు, ఉపదేశ వాక్యములు ఈ మొదలగునవి నా ఉపయోగార్థమై వాడుకొనగల నేర్పు దయచేయుము. నాతో ఆరాధనలోనున్న వారికిని ఇట్టి కృపయే చూపుము. ఆరాధన జరుపువారికి గౌరవబుద్ధి, జాగరూకత, వార్తనందుకొని అందింపగల జ్ఞానమిమ్ము. ఆరాధనలో క్రమము తప్పుటయు, ఆటంకములు కలుగుటయు, ముఖ్యముగా నామకార్థమైన ఆరాధన జరుగుటయు, నీకు అనిష్టములైయున్నవి. గనుక యట్టివేవియు

Bible Mission HQ Guntur

చేరనీయకుము. **ఆరాధన పొడుగున నీవుందువు.** గనుక నీయెదుట మేమెంతో మర్యాదగాను, వినయముగాను కూర్చుండగల కుదురుబాటు కలుగచేయుము. ఆరాధనయంతటి మూలముగా, నీ పరిశుద్ధాత్మ వలన ఉద్రేకము కలిగించి నీవు ఘనత, కీర్తి పొందుము. పెండ్లి కుమారుడుగా రానైయున్న నీ కుమారుని బట్టి యంగీకరించుము. నీకు నిత్యారాధన స్తోత్రములను చేయుచున్నాము. ఆమేన్.

**కీర్తన :** ఆంధ్రక్రైస్తవ కీర్తనలలో 26. 'రండి యుత్సాహించి పాడుదము'

**బో :** తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు, యుగయుగములందుండునట్లు మహిమ కలుగునుగాక! ఆమేన్.

## పాపపు ఒప్పుదల

**బో :** ప్రియులారా! ప్రభువునందలి ప్రియులారా! మనము అతి పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి వచ్చునప్పుడు పూర్తిగా సర్వారాధనలో ప్రవేశింపక పూర్వము మన పాపస్థితిని ఒప్పుకొని క్షమాపణ పొందుట మనకెంతో మేలు. మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనినయెడల ఆయన నమ్మదగినవాడును, నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనినయెడల, ఆయనను అబద్ధికునిగా చేయువార మౌదుము. మరియు ఆయన వాక్యము మనలోనుండదు. తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు, తన పాపములకు ప్రాయశ్చిత్తము పొందినవాడు ధన్యుడు. యెహోవా చేత నిర్దోషి అని ఎంచబడినవాడు, ఆత్మలో కపటము లేనివాడు ధన్యుడు.

3

## పాపములు ఒప్పుకొందము

సర్వజ్ఞుడవగు దేవా! మా పాపములు ఒప్పుకొనుటకును, మా అయోగ్యత ఒప్పుకొనుటకును, క్షమాపణ దయచేయుమని వేడుకొనుటకును నీ సన్నిధిని సమీపించుచున్నాము. నీవు మహా పరిశుద్ధుడవు, మేము గొప్ప పాపులము. గనుక నీ సన్నిధికి వచ్చుటకు ఏ మాత్రమును యోగ్యులము కాము. అయినను నీయొద్దకు వచ్చుటకు నీ కుమారునిబట్టి నీవే చనువిచ్చుచున్నావు గనుక వచ్చియున్నాము. మేము మానవ జన్మమునుబట్టి పాపులము, తలంపులను బట్టి పాపులము, మాటలనుబట్టి పాపులము, చెడ్డవార్తలు ఆలకింపగోరు వినువాలునుబట్టి పాపులము, చూపునుబట్టి పాపులము, ఆటలనుబట్టి పాపులము, ప్రయత్నములనుబట్టి పాపులము, క్రియలనుబట్టి పాపులము, నీవు క్షమించిన తరువాత మరల పాపములు జ్ఞప్తికి తెచ్చుకొనుటనుబట్టి పాపులము. నీవు సమస్తము ఇచ్చువాడవని తెలిసియు అదిలేదు, ఇదిలేదని చింతించుటను బట్టి పాపులము. నీవు నీ చిత్త ప్రకారము ప్రార్థనలు ఆలకించువాడవని తెలిసియు, యొకానొక సమయమున మా ప్రార్థనలో ఒక మనవిగాని సిద్ధింపనియెడల, నీమీద విసుగుకొనుటనుబట్టి పాపులమైయున్నాము. నీవు ఆపత్కాలమందు అడ్డుపడువాడవని తెలిసియు, అపాయము వచ్చునప్పుడు భయపడుటనుబట్టి పాపులము. దుర్వార్తలు వినునప్పుడు దిగులుపడుటనుబట్టి పాపులము. నీవు వాక్యములో సమయోచితముగా మాకు చెప్పుచున్న సంగతులు త్వరలో గ్రహింపలేని మందస్థితినిబట్టి పాపులము. నీ వాక్యమునకు వ్యతిరేకమైనదేదో అది తెలిసినను, దానిని విసర్జింపక పోవుటనుబట్టి పాపులము. నీ వాక్యమునకు అనుకూలమైనదేదో యది తెలిసినను దానిననుసరించి నడువకపోవుటనుబట్టి పాపులము. నీవు పరిశుద్ధుడవును, ప్రేమా రూపుడవును

అగుటచేత ఏ కీడును చేయవని తెలిసియు, కష్టములు నీవే పంపినావని యనుమానపడుటనుబట్టి పాపులము.

కష్టసుఖములలో నిన్ను హృదయానందముతో స్తుతింపలేకపోవుటనుబట్టి పాపులము. నీవు ఇచ్చునవి పుచ్చుకొనలేక పోవుటనుబట్టి పాపులము. మా మనస్సాక్షిమాట వినకపోవుటనుబట్టి పాపులము. మానవులకు ఆయాసము కలిగించు పనులు చేయుటనుబట్టి పాపులము. అనుమానము పుట్టించు పనులు చేయుటనుబట్టి పాపులము. జీవరాసులయెడల నిర్దయగా నుండుటనుబట్టియు, సృష్టిలోని వస్తువులను సరిగా వాడకపోవుటనుబట్టియు పాపులము. ***ఏ విధముగా చూచుకొన్ననూ మేము పాపులమైయుండి అపవాది మీదను, వారిమీదను, వీరిమీదను పెట్టుటనుబట్టి పాపులము.*** శోధనలు వచ్చినప్పుడు మాకు సహాయము దొరకలేదు. గాని దొరికిన యెడల పడకపోదుమని చెప్పుకొనుటనుబట్టి పాపులము. మ్రొక్కుకొన్న మ్రొక్కు తీర్చిన యెడల మా దేవుడు సంతుష్టిపడి క్షమించునని ఊహించుటనుబట్టి పాపులము. మా సమస్తపాపములు సిలువ మ్రానుమీదనే తీరినవని వెంటనే నమ్మి, సంతోషపడక పోవుటనుబట్టి పాపులము. ప్రధానదూతలో దేవుడెందుకు దుర్బుద్ధి కలుగనిచ్చెను? అతనినప్పుడే హతముచేసి యుండినయెడల ఇంత ముప్పు రాకపోవునుగదా! మొదటి నరులు పడిపోవుదురని తెలిసి, దేవుడేల ఆ చెట్టువేసెను? అని ఇట్టి ప్రశ్నలు ఆలోచించుకొనుచు నీవు నీ వాక్య గ్రంథములోను, సంఘ చరిత్రలోను, లోక వృత్తాంతములోను, మా అనుభవములోను చేసిన కార్యములను గురించి యభ్యంతర పడుటనుబట్టి పాపులము. నీవు చేయునదంతయు సరియేయనియు, నీవొక సంగతి జరుగనిచ్చుట న్యాయమేయనియు, తలంపకుండుటనుబట్టి పాపులము.

నీ కుమారుని మూలముగా మమ్ములను రక్షించుటకు నీవు ఇంతచేసియుండగా, ఇంత పాపులమైన మాకు రక్షణ యుండునా? యని తర్కించుటనుబట్టి పాపులము. మాకు తెలియక హృదయ రహస్యముల నెరిగియున్న నీకు మాత్రమే తెలిసిన నేరములు కలిగియుండుటనుబట్టి పాపులము. నీ కుమారుని రాకడ సమీపమని నీ వాక్యము చెప్పిన గుర్తులలో కనబడుచున్నను, ఇంకను రాలేదేమి? యని నిరుత్సాహపడుటనుబట్టి పాపులము.

ఈ మా పాపముల ఒప్పుదలలను అంగీకరించుము. మా పక్షము వహించిన నీ పరిశుద్ధ కుమారుని ముఖమును చూచి, మా పాపములను క్షమించుమని నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

## క్షమాపణ ప్రకటన

**బో :** పాపము లొప్పుకొన్న ప్రియులారా! సరియైన మనస్సుతో పాపము లొప్పుకొని, పశ్చాత్తాపపడి, ఇకమీదట పాపముచేయకుండ నడువ ప్రయత్నింతునని ప్రమాణముచేసి, క్షమాపణ నిమిత్తమై తండ్రి నాశ్రయించువారి పాపములాయన క్షమించునని దైవవాక్యమునుబట్టి మీకు ప్రకటించుచున్నాను. *మీ పాపములు రక్తమువలె ఎర్రనివైనను, హిమమువలె తెల్లబడునని దేవుడు యెషయాద్వారా వ్రాయించెను. దేవుని కృపా మహదైశ్వర్యమునుబట్టి, ఆ ప్రియుని యందు, ఆయన రక్తమువలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగియున్నది.*

**బో :** క్షమించిన తండ్రిని స్తుతించుదము.

**సం :** ఓ జాలిగల తండ్రీ! నీవు క్షమించుటకు సిద్ధముగా నున్నావనియు, మా పాపములను ఎప్పటికిని జ్ఞాపకము చేసికొనవనియు, నీ వాక్యమువల్ల తెలిసికొని నమ్మి నీకు స్తోత్రము చేయుచున్నాము. ఆమేన్.

కీర్తన:- దేవసంస్తుతి - పల్లవి. 1,5,6,7,8 చరణములు.

**వాక్య పఠన :**

1) తండ్రియైన దేవుని తలంచుకొనుచు పాతనిబంధన పాఠమును

2) కుమారుడైన యేసును తలంచుకొనుచు సువార్తలలో పాఠమును

3) పరిశుద్ధాత్మ దేవునిని తలంచుకొనుచు పత్రిక పాఠమును చదువవలెను.

## స్తుతిపాట (ఉత్తర ప్రత్యుత్తరములు)

**బో:** ఓ దేవా! నీ వాక్యములోనుండి మాతో మాట్లాడుచున్నావు గనుక స్తోత్రము.

**సంఘము:** నీ వాక్యములో నీ చిత్తమును బయలు పరచినావు గనుక స్తోత్రము.

**బో:** నీ కట్టడలనుబట్టి నేను హర్షించెదను

**సం:** నీ వాక్యమును నేను మరువక యుందును

**బో:** నీ ఉపదేశములు నాకు అధిక ప్రియములు

**సం:** నీ నీతినిబట్టి నన్ను బ్రతికింపుము

**బో:** నీ యాజ్ఞలనుబట్టి నేను హర్షించెదను

**సం:** అవి నాకు ప్రియములై యున్నవి

**బో:** నీ యాజ్ఞలన్నియు నమ్మదగినవి

**సం:** మాకు సహాయము చేయుము

**బో:** యెహోవా! నీ మాట చొప్పున,

**సం:** నీ సేవకునికి నీవు మేలు చేసియున్నావు.

**బో:** ఆహారము వలననేకాక నీవు సెలవిచ్చిన,

**సం:** ప్రతిమాటవలన నరులు బ్రతుకుదురు.

## రెండవ స్తుతి పాట

**బో:** ఆకాశమును, భూమియు గతించునుగాని,

**సం:** నీ మాటలు ఏ మాత్రమును గతింపవు.

**బో:** ప్రభువా! ఎవనియొద్దకు వెళ్ళుదుము?

**సం:** నీవే నిత్యజీవపు మాటలు గలవాడవు.

**బో:** నీ వాక్యము సజీవమై బలముగలదై,

**సం:** రెండంచులుగల ఎటువంటి ఖడ్గముకంటెను వాడిగానుండి,

**బో:** ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను,

**సం:** విభజించునంతమట్టుకు దూరుచు,

**బో:** హృదయముయొక్క తలంపులను, ఆలోచనలను

**సం:** శోధించుచున్నది

**బో:** నీవు సృజించిన వాటిలో

**సం:** మేము ప్రథమ ఫలముగా నుండునట్లు,

**బో:** సత్యవాక్యమువలన మమ్మును,

**సం:** నీ సంకల్ప ప్రకారము కంటివి.

**బో:** తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును,

**సం:** ఆదియందు ఇప్పుడును, ఎల్లప్పుడును, యుగయుగముల యందుండునట్లు మహిమ కలుగునుగాక! ఆమేన్.

# 8
## విశ్వాస ప్రమాణము

దేవుడు ఆది యంతములేని దేవుడని నమ్ముచున్నాను. ఆయన ప్రేమ, న్యాయము, పరిశుద్ధత, శక్తి, జ్ఞానము, విశ్వాస్యత ఈ మొదలైన శుభలక్షణములతో నిత్యము మహా తేజోమయముగా ప్రకాశించుచున్నాడని నమ్ముచున్నాను. లోకములు పుట్టకముందే ఆయన నన్ను తలంచుకొని యున్నాడనియు, భూమి, ఆకాశముల సృష్టిలో నాకు కావలసిన సదుపాయములను, నా శరీరాత్మల రక్షణను, అనాదిలోనే ఆలోచించుకొనుచు నన్ను ప్రేమించెననియు; దేవదూతలను, సర్వలోకములను, మానవులను ఆయన పరిశుద్ధముగానే సృజించెననియు నమ్ముచున్నాను. మంచినేగాని చెడుగును ఆయన కలుగజేయలేదని అనగా సాతానును, పిశాచములను, వ్యాధులను, ముళ్ళను, నష్టములను కష్టములను, మరణములను, నరకమును ఆయన కలుగజేయలేదని నమ్ముచున్నాను. దేవుడును, దూతలును ఎల్లప్పుడు నాయొద్ద నున్నారనియు, ఆది తల్లిదండ్రులు పాపములో పడగానే ఆయన రక్షకుని పంపెదనని ప్రకటించినాడని నమ్ముచున్నాను.

నరులను రక్షించు పనిమీద ఆయన కాలక్రమమున తండ్రిగాను, కుమారునిగాను. పరిశుద్ధాత్మగాను బయలుపడినాడనియు; ముగ్గురుగాక ఒక్కడుగానే యున్నాడనియు, ఇది నా గ్రహింపునకు అందకపోయినను నమ్ముచున్నాను.

ఆయన, రక్షకుని రాకడవార్త చాలకాలమువరకు విశ్వాసుల ద్వారా ప్రకటన చేయించినాడనియు, తుదకు యేసుక్రీస్తు ప్రభువుగా నరరూపమున ఈలోకమందు ప్రత్యక్షమైనాడనియు నమ్ముచున్నాను.

సర్వలోక రక్షకుడు జన్మింపగలందులకు దేవుడొక జనాంగమును సర్వజనాంగములోనుండి విడదీసి, వారి నిమిత్తమై ఒకరిని ఎన్నుకొని, ఆ జనాంగమగు యూదులకు దైవవిషయములను బోధించి, సిద్ధపరచి, వారి

మూలముగా సర్వమతముల వారికిని రక్షణవార్త నందించుచున్నాడని నమ్ముచున్నాను.

ఇంత మాత్రమున అన్ని మతముల వారిని ఆ సర్వదయాళుడు విడిచిపెట్టక, వారిలోని మనస్సాక్షిమూలముగా వారికిని ధర్మములు ఉపదేశించుచు వచ్చుచున్నాడనియు, సర్వలోక సృష్టిలోని మహత్కార్యములనుబట్టి తన శక్తిని, ప్రేమను, జ్ఞానమును, పరశుద్ధతను, న్యాయమును, ప్రదర్శించుచు వచ్చుచున్నాడనియు నమ్ముచున్నాను.

అయినను ఆయన ఎంతగా పాపులను ప్రేమించువాడైనను, వారి పాపములను మాత్రము ప్రేమించలేడనియు, మానవులు పాపములు విసర్జించు నిమిత్తమై, పాపముల విషయములో భయంకరుడై, గుణవంతులను జేయుటకు శిక్షలు రానిచ్చు మంచి యుద్దేశములు గల వాడనియు నమ్ముచున్నాను.

శ్రీ యేసుక్రీస్తు ప్రభువు రూపమునకు మనుష్యుడుగాను, అనాది స్థితినిబట్టి దేవుడుగాను సంచరించుచు, దివ్యబోధల మూలముగాను, అద్భుతములగు ఉపకారముల మూలముగాను, నా పాపములు, నా వ్యాధులు, నా శిక్షలు తన సిలువ మ్రానుపై వేసికొని, మరణమౌట మూలముగాను; తన నిజదైవస్థితిని, ప్రేమను వెల్లడించినాడని నమ్ముచున్నాను.

ఆయన రెండవరాకడకు ముందుగా కొన్ని గుర్తులు జరుగనిచ్చి, రాకడలో పాల్గొను వీలుండుటకై సర్వత్రా విశ్వాసులమీద పరిశుద్ధాత్మను కుమ్మరించుననియు తరువాత మృతులైయుండిన విశ్వాసులను లేపి, సజీవులైన విశ్వాసులకు మరణము లేకుండజేసి, మహిమ శరీరము ధరింపజేసి, వారిని వీరిని పెండ్లికుమార్తెగా కొనిపోవుటకై పెండ్లికుమారుడుగా మిక్కిలి త్వరలో వచ్చుచున్నాడని నమ్ముచున్నాను.

పిమ్మట భూమిమీద మిగిలిపోయినవారికి ఏడేండ్లు మహా(శ్రమలు విస్తరించుననియు, ఆ (శ్రమకాలములో ననేకమంది విశ్వాసులగుదురనియు, అటుపిమ్మట ఆయన భూమిమీదికివచ్చి ఏడేండ్లు రాజ్యాధికారియగు అంత్యక్రీస్తును అనగా క్రీస్తు విరోధిని, అబద్ధ ప్రవక్తను అగ్నిగుండములోవేసి, సాతానును వెయ్యేండ్లు చెరసాలలో బంధించుననియు నమ్ముచున్నాను.

ఆ శ్రమలలో అనేకులు రక్షణ పొందుదురని నమ్ముచున్నాను. ఆ పిమ్మట ఆయన క్రొత్తరూపము దాల్చి, సర్వలోకమునకు రాజై వెయ్యేండ్లు నీతిపరిపాలన చేయును. అప్పుడే పరిశుద్ధులచేత సత్యసువార్త ప్రకటింప జేయుననియు, అందుచేత చాలమంది భక్తులగుదురనియు నమ్ముచున్నాను.

తరువాత వెయ్యేండ్లు సువార్త విన్న సజీవులలో నెందరు సువార్త నంగీకరింతురో, నెందరు అంగీకరింపరో, ఆ వివక్షత కనబరచుటకై గొఱ్ఱెలు, మేకలను పోలిన సజీవుల తీర్పొకటి ఏర్పరచుననియు నమ్ముచున్నాను.

మరియు వెయ్యేండ్ల చివర సాతానును విడుదలచేసి, ఆ విడుదల కాలములో సహితము అతడు అగుపరచిన తిరుగుబాటునుబట్టి అతనిని నిత్యనరకాగ్నిలో పడవేయుననియు నమ్ముచున్నాను.

ఆదామునుండి అప్పటివరకు సమాధులలో నున్న అవిశ్వాసులను లేపి, నిత్యమగు తీర్పు వినిపించుననియు నమ్ముచున్నాను.

నేను పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. ఈయన తండ్రితోను, కుమారునితోను, ఏకదేవుడుగానే యుండి పనిచేయుచున్నాడనియు, ఈయన ఆవేశము వలననే దైవగ్రంథము వ్రాతలోనికి వచ్చినదనియు, ఈయన వెలిగింపునుబట్టియే ఆ గ్రంథము అర్ధమగుననియు, తండ్రి యుద్దేశించిన రక్షణ అనగా కుమారుడు తన అమూల్యమైన రక్తము వలన గడించి పెట్టిన

రక్షణ పరిశుద్ధాత్మయే విశ్వాసికందించుననియు, క్రైస్తవ జీవితము వృద్ధిపొందునట్లు పరిశుద్ధాత్మయే; పరిశుద్ధాత్మ బాప్తిస్మముగా లభించుననియు తండ్రి కుమారులతోపాటు ఈయనకూడ సమానముగా ఆరాధన నొందదగు దేవుడనియు నమ్ముచున్నాను.

తండ్రి తండ్రి, కుమారుడు తండ్రి, పరిశుద్ధాత్మ తండ్రి. అయినను తండ్రులు ముగ్గురు కారనియు, ఒక్కడేననియు; తండ్రి దేవుడు, కుమారుడు దేవుడు, పరిశుద్ధాత్మ దేవుడైనను, దేవుడు ముగ్గురుకారనియు; మానవుల రక్షణార్ధమై దేవుడట్లు బయలు పడినాడనియు; ఆయన నా తండ్రియు, నా దేవుడును, నా సర్వమునై యున్నాడనియు నమ్ముచున్నాను.

నరులకు కలుగు కష్టనష్టములకు దేవుడు కారకుడు కాకపోయినను వారిని తనతట్టు త్రిప్పుకొనుటకు అట్టి సమయమును ఆయన వాడుకొనుననియు నమ్ముచున్నాను.

సర్వజనులును దైవజనులగు నిమిత్తమై దైవవార్త ప్రకటన యగుచున్ననూ, ఇంకనూ అనేకమందికి అవి యందకపోవుచుండుటను బట్టియు, దేవుడు వారి మరణాంతరమున హేడెస్సులో వారికి బోధ చేయించుచు అక్కడ నమ్మువారిని రక్షించుచున్నాడనియు నమ్ముచున్నాను.

యేసుక్రీస్తుగా వచ్చిన దేవుడుగాక మరెవరును లోకరక్షకులు కారనియు, ఏ మతస్తులైనను ఎక్కడో చోట, ఎప్పుడో యొకప్పుడాయనను గురించి విందురనియు, దేవునితట్టు తిరుగుటకు కావలసినంత గడువు అందరకు దొరుకుననియు, అంతవరకు ఎవరికిని మోక్ష నరకముల నిర్ణయము కలుగదనియు నమ్ముచున్నాను.

ఈ సంగతులన్నియు ఇమిడియుండి, దేవుని మనస్సును చూపించుచున్న బైబిలను గ్రంథము దేవుడు మానవులకు దయచేసిన గ్రంథమని నమ్ముచున్నాను.

ఈ గ్రంథము ననుసరించి, సర్వజన రక్షణార్ధమై ఏర్పడిన మతము క్రైస్తవ మతమనియు, గ్రంథమును బట్టికాక అభిప్రాయ భేదమునుబట్టి అది ఎన్నో మిషనులుగా చీలిపోయినను, ఏక దేవుని, ఏక రక్షకుని, ఏక మోక్షమును ఏక గ్రంథమును సూచించుచున్నదనియు నమ్ముచున్నాను.

దేవుని చర్యలు నా జ్ఞానమునకు తెలియనప్పుడు తర్కములో పడిపోక, దేవుడు చేయు సమస్తమును ధర్మయుక్తమైనదని నిశ్శబ్ధముగా యూరకుండుట నాకు క్షేమమని నమ్ముచున్నాను. ఆమేన్.

*కూర్చుని సంఘమంతయు కీర్తన పాడవలెను*

## ప్రసంగము

## ప్రార్థన

ఓ తండ్రీ! ప్రార్థనాలకించు తండ్రీ, నీకనేక స్తోత్రములు. ఎందుకనిన నీవు మా ప్రార్థనలు వినువాడవని మేము నమ్మగల వాగ్ధానములనేకములు వ్రాయించి ఇచ్చినావు. నీవే స్తోత్రమునకు పాత్రుడవు. మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నీవు లోకమునకు తెచ్చిన వెలుగు అన్ని మతముల వారికి తెలియకపోయినను, వారికి అగత్యమైన వెలుతురు వారికనుగ్రహించుచున్నావు గనుక నీకు స్తోత్రములు. నిజమైన వెలుగుండెననియు, అది లోకములోనికి వచ్చుచు ప్రతి మనుష్యుని వెలిగించుచున్నదని నీవు వ్రాయించిన వాక్యమును బట్టి, అందరకును నీ వెలుగు దయచేయువాడవని గ్రహించి నీకు వందనము లాచరించుచున్నాము.

ఇతర మతస్థులకు మనస్సాక్షి ద్వారాను, సృష్టిద్వారాను, నిన్ను గురించి తెలియపరచుచున్నందుకు నీకనేక వందనములు. ***నీవు బయలుపరచిన రక్షణ వృత్తాంతము పాపులకు పూర్తిగా తెలిసినయెడల, నీయందు భక్తి కుదుర్చుకొనుట ఎంతో సులువు. గనుక అది ప్రతివారికి వినిపింపజేయుము.*** రక్షణ పొందుటకు అందరికి గడువు దయచేయుమని విశ్వాసులెన్నో ఏండ్లనుండి చేయుచున్న మనవి, నీవు తప్పక నెరవేర్తువని నమ్ముచు నిన్ను స్తుతించుచున్నాను. విననివారు, విన్నవారు, వినియును గ్రహింపనివారు, గ్రహించినను నమ్మనివారు, నమ్మియు తుదవరకు స్థిరముగా నుండనివారు కలరు. వారిలో ఎవరెవరికి ఎట్టి సహాయమవసరమో వారికట్టి సహాయము దయచేయువాడవని తెలిసి నిన్ను స్తుతించుచున్నాను. ఇది రెండవమారు రానైయున్న మా యేసుప్రభువు ద్వారా ఆలకించుమని వేడుకొనుచున్నాను. ఆమేన్.

*కీర్తన పాడుచుండగా చందా ఎత్తబడును.*

**చందా కొరకైన ప్రార్థన**

**సంఘ ప్రకటనలు**

**ముగింపు ప్రార్థన**

**దీవెన.**

# సంఘారాధన

(దేవాలయములోనికి వచ్చినవారు నిశ్శబ్ధముగా మనోనిదానము కలిగియుండ వలెను. సంఘములేచి చివరి చరణము పాడుచుండగా బోధకుడు వేదిక యొద్దకు రావలెను.)

**బో :** తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున!

**సం :** ఆమేన్

## స్తుతి ప్రార్ధన

**బో :** ఓ దేవా! తండ్రివిగాను, కుమారుడవుగాను, పరిశుద్ధాత్ముడవుగాను ప్రత్యక్షమైన తండ్రీ! నీ ప్రత్యక్షత నిమిత్తమై నీకనేక స్తోత్రములు. ఇప్పుడు నిన్నారాధించు కృపాసమయము దయచేసినందుకు వందనములు. దూతలు, పరలోక పరిశుద్ధులు నిన్ను స్తుతించుచున్నప్పటికిని, మా స్తుతులనుకూడ కోరుకొనుచున్న నీకనేక స్తుతులు. నీవు కలుగజేసిన సమస్త సృష్టినిబట్టి నీకు ఘనత కలుగుచున్నది. సృష్టి అంతటితోబాటు మేము నీకు నమస్కరించు చున్నాము. ఆరాధన పొడుగున నీకు కీర్తి కలుగునట్లు, ఇక్కడి విషయములన్నిటిని దీవించుమని ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

**బో:** ప్రియులారా! ప్రభువునందు ప్రియులారా! మనము అతి పరిశుద్ధుడైన దేవుని సన్నిధికి వచ్చునప్పుడు పూర్తిగా సర్వారాధనలో ప్రవేశింపక పూర్వము, మన పాపస్థితిని ఒప్పుకొని క్షమాపణపొందుట మనకెంతో మేలు. మనము పాపము లేనివారమని చెప్పుకొనిన యెడల మనలో సత్యముండదు. మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల ఆయన నమ్మతగినవాడును, నీతిమంతుడును గనుక మన పాపములను క్షమించి, సమస్త దుర్నీతినుండి

మనలను పవిత్రులనుగా చేయును. మనము పాపము చేయలేదని చెప్పుకొనినయెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమౌదుము. ఆయన వాక్యము మనలోనుండదు. తన అతిక్రమములకు పరిహారము నొందినవాడు తన పాపములకు ప్రాయశ్చిత్తము నొందినవాడు, ధన్యుడు. యెహోవాచేత నిర్దోషియని ఎంచబడినవాడు ఆత్మలో కపటము లేనివాడు ధన్యుడు.

**బో : మన పాపములను ఒప్పుకొందము.**

(సంఘము బోధకునితో కలిసి చెప్పవలెను)

పరిశుద్ధుడవైన ఓ దేవా! మేము మా జన్మమునుబట్టియు, నైజమునుబట్టియు, పాపులమైయున్నాము. తలంపునుబట్టియు, చూపును బట్టియు, పాపులమై యున్నాము. వినుటనుబట్టియు, మాటనుబట్టియు, పాపులమైయున్నాము. ప్రవర్తననుబట్టియు, క్రియలనుబట్టియు, పాపులమైయున్నాము. నీ కృపను పొందుటకు మేము అయోగ్యులము! మమ్మును క్షమింపుమని నీ కుమారుని పరిముఖముగా వేడుకొనుచున్నాము. ఆమేన్.

**బో** : ప్రియులారా! తండ్రి తన అపరిమితమైన ప్రేమనుబట్టి విశ్వాసులందరి **అన్ని పాపములు** క్షమించుచున్నాడు. శిక్షించుటకు ఇష్టపడడు. మన పాపములను జ్ఞాపకము చేసికొనడు. అట్టి తండ్రిని నిత్యము స్తుతించుదము.

బో : ఓ తండ్రీ! నీవు పరిశుద్ధుడవై యున్నందున పాపులను అసహ్యించు కొనవలసినది గాని అట్లు చేయక చేరదీసి క్షమించుచున్నావు గనుక నీకు అనేక వందనములు ఆమేన్.

(సంఘము కూర్చుండవచ్చును)

(తండ్రి మన పాపములను క్షమించెనను విశ్వాసముతో)

('దేవసంస్తుతి' అను కీర్తనలోని పల్లవి, 6,7,8 చరణములు పాడవలెను)

(దేవుని వాక్యమును గౌరవించు నిమిత్తము సంఘము లేచి నిలువవలెను)

**బో :** (తండ్రియైన దేవుని తలంచుకొనుచు పాతనిబంధన పాఠము చదువును; కుమారుడైన తండ్రిని తలంచుకొనుచు సువార్తలలోని పాఠము చదువును; పరిశుద్ధాత్మ తండ్రిని తలంచుకొనుచు పత్రికలలోని పాఠమును చదువును. )

## వాక్యమిచ్చిన తండ్రికి స్తుతి ప్రార్థన

**బో :** త్రియేకుడవైన దేవా! భూమి ఆకాశములకంటెను, వెండి బంగారముల కంటెను, గొప్పదానమగు నీ గ్రంథమును మాకు దయచేసినావు. కాబట్టి నీ కనేక స్తోత్రములు. నీవు స్వయముగా మాకు చెప్పవలసిన మాటలన్నియు, ఈ పుస్తకములో ఇమిడ్చినావు గనుక నీకు మా వందనములు. ఆమేన్.

(చాయ: పరములోన–పరములోన–పాపమేమి లేదుగా)

పల్లవి : దేవాతి దేవరాజునకు । దివ్యమైన సంస్తుతి
పావన గ్రంథంబు బైలు । పరచెగాన సన్నుతి

**బో : మన విశ్వాసమును ఒప్పుకొందము.**

దేవుడు ఆది అంతములేని దేవుడని నేను నమ్ముచున్నాను. ఆయన ప్రేమ, న్యాయము, పరిశుద్ధత, శక్తి, జ్ఞానము, జీవము, స్వతంత్రత, సర్వవ్యాపకత్వము ఈ మొదలైన శుభలక్షణములతో నిత్యము మహా తేజోమయముగా ప్రకాశించుచున్నాడని నమ్ముచున్నాను.

యేసుక్రీస్తు ప్రభువు రూపమునకు మనుష్యుడుగాను, అనాది స్థితినిబట్టి దేవుడుగాను సంచరించుచు, దివ్యబోధల మూలముగాను, అద్భుతములగు ఉపకారముల మూలముగాను, నా పాపములు, నా వ్యాధులు, నా శిక్షలు తన సిలువ మ్రానుపై వేసికొని మరణమౌట మూలముగాను, ఆయన సమాధిలోనుండి మూడవనాడు వెలుపలికి వచ్చి పరలోకమునకు వెళ్ళుట మూలముగాను; తన నిజ దేవస్థితిని, ప్రేమను వెల్లడించినాడని నమ్ముచున్నాను. ఇప్పుడు అందరి నిమిత్తమై విజ్ఞాపనప్రార్థన చేయుచున్నాడనియు, ఆయన రెండవమారు సంఘమును కొనిపోవుటకై మేఘాసీనుడై వచ్చుననియు, మిగిలిన వారికి ఏడేండ్ల శ్రమ కలుగుననియు; తరువాత అంతెక్రీస్తునకును, క్రీస్తునకును జరుగు యుద్ధములో అంతెక్రీస్తు, అబద్ధ ప్రవక్త నరకములో వేయబడుదురనియు; సాతాను పాతాళములో వెయ్యేండ్లు బంధింప- బడుననియు; ఆ తరువాత ప్రభువు భూమిమీద వెయ్యేండ్లు పరిపాలన చేయుననియు; తరువాత ఆయన సజీవులకును, మృతులకును తీర్పు తీర్చుననియు నమ్ముచున్నాను.

క్రీస్తు ప్రభువు పాతాళములోని సాతానును విడిపింపగా, అతడు భూమిమీదకి వచ్చి గోగు, మాగోగు అను పేరులుగల సైన్యములను ఏర్పర్చుకొనుననియు, అతడు దేవునితో యుద్ధముచేసి ఓడిపోవుననియు, క్రీస్తు అతనిని నరకములో పడవేయుననియు నమ్ముచున్నాను. అటుతరువాత ఆయన అందరకును తీర్పు విధించుననియు, అవిశ్వాసులను నరకములోనికి పంపివేయుననియు నమ్ముచున్నాను. తుదకు భూమిమీద నున్న పరిశుద్ధులందరు ఏకసంఘముగా ఉండుటవలన భూమి పరలోకములో ఒక భాగమగుననియు, క్రీస్తు ప్రభువు పరలోకములోను, భూలోకములోను ఉండుననియు నమ్ముచున్నాను.

నేను పరిశుద్ధాత్మను నమ్ముచున్నాను. ఈయన తండ్రితోను, కుమారునితోను, ఏక దేవుడుగానేయుండి పనిచేయుచున్నాడనియు, ఈయన ఆవేశమువలననే దైవగ్రంథము వ్రాతలోనికి వచ్చినదనియు, ఈయన వెలిగింపును బట్టియే ఆ గ్రంథము అర్ధమగుననియు, తండ్రి ఉద్దేశించిన రక్షణ అనగా కుమారుడు తన అమూల్యమైన రక్తమువలన గడించిపెట్టిన రక్షణ, పరిశుద్ధాత్మయే విశ్వాసికి అందించుననియు నమ్ముచున్నాను. తండ్రి, కుమారులతోపాటు ఈయనకూడ సమానముగా ఆరాధననొందదగు దేవుడనియు నమ్ముచున్నాను. పరిశుద్ధుల సహవాసమును, పునరుత్థానమును, నిత్యజీవమును గలవని నమ్ముచున్నాను. ఆమేన్.

## కీర్తన

## ప్రసంగ ప్రార్ధన

వాక్యము అనుగ్రహించిన దేవా! మేము నీ వాక్యమును ఇప్పుడు వివరించుకొనబోవుచున్నాము. ప్రతివారికి కావలసిన వర్తమానము నందించుము. మా జ్ఞానము వెలుగునట్లు నీయాత్మ సహాయమునిమ్మని విన్నవించుకొనుచున్నాము. ఆమేన్.

## ప్రసంగము

## ప్రసంగాంత ప్రార్ధన

*ఓ ప్రభువా! నీ వాక్యము మాలో నీ మహిమార్ధమై ఫలించునట్లు చేయుమని* వేడుకొనుచున్నాము. ఆమేన్

కీర్తన

(ఈ సమయములో చందా పట్టుట; అందరు నిలువబడియుండగా బోధకుడు చందానుగూర్చి ప్రార్థించుట)

## చందా ప్రార్థన

ఓ తండ్రీ! నీవే మాకు అన్నియు ఇచ్చుచుండగా మేము నీకు ఏమి ఇయ్యగలము? నీవు ఇచ్చినవే మేము నీకు చందాగా ఇచ్చుచున్నాము. ఇవి నీ సేవలో వాడుకొనుము. ఆమేన్.

## ప్రకటనలు

## ముగింపు ప్రార్థన

సర్వవ్యాపివైన ఓ దేవా! సర్వలోకమునకు నీ సువార్త అందించుము. సర్వమతముల వారికి నీ శుభవార్త నందించుము. నీ సంఘము తాను నేర్చుకొనుచున్న విశ్వాసములో మాదిరిగా, లోకము ఎదుట నిలువబడగలశక్తి దయచేయుము. మత తర్కములు, మిషను వివాదములు, తప్పుడు బోధలు, పాప శోధనలు, పాపము వలన కలుగు నష్టములు వీటన్నిటినుండి మమ్మును తప్పించుము. కరువు కాలములో, వ్యాధికాలములో, అజ్ఞానకాలములో వాటి మూలముగా మానవులను నీ తట్టు త్రిప్పుము. లోకమునకు ఉపకారములుగా నేర్పడుచున్న పనులన్నిటి మీద నీ దీవెన క్రుమ్మరించుము. విశ్వాసులను పరిశుద్ధాత్మతో నింపి ప్రభు యేసుయొక్క రెండవ రాకకు సిద్ధపరచుము.

ప్రతి కుటుంబములోని వారిని, పేదలను, పాఠశాలలను, వైద్యశాలలను, అనాథ శాలలను, బైబిలు సొసైటీని, అన్ని వృత్తులను; నీటిమీదను, మెట్టమీదను, నిర్జన ప్రదేశములోను, గాలిలోను ప్రయాణము చేయు ప్రయాణీకులను, ప్రభుత్వమువారి ఏర్పాటులను, కాపుదల గల నీ స్వాధీనమందు వర్ధిల్లజేయుము. జ్యోతులమీదను, పక్షులమీదను, పశ్వాదులమీదను, వృక్షాదులమీదను, పంటల మీదను అనగా నీ యావత్తు సృష్టిమీదను నిత్యము

నీ కరుణాదృష్టిని ప్రకాశింపజేయుచుండుము. ఆ వస్తువును, ఈ జీవిని 'దేవుడు దీవింపలేదు' అను నేరము నీ మీదికి రానీయకుము.

అన్యాయము, అవమానము, దోపిడీలు, హత్యలు, నిరాశలు, దుర్మరణములు, భూకంపములు, యుద్ధములు, ఆకస్మికముగా రానైయున్న అపాయములు మొదలగు గండములనుండి ప్రజలను విమోచింపుము. యంత్రములలోను, గనులలోను, సొరంగములలోను, నీటియడుగునను పనిచేయు వారిని కాపాడుము. విషపురుగులనుండియు, క్రూరమృగములనుండియు, దుర్జనులనుండియు మమ్ములను తప్పించుము. ఏ అంశ ప్రార్థన మేము మరచిపోతిమో అది నీకు సమర్పించుచున్నాము.

మేము అడుగువాటికంటెను, ఊహించువాటికంటెను, అత్యధికముగా చేయజూచుచున్న ఓ తండ్రీ! మా అంతరంగ ప్రార్థనలు, మా బహిరంగ ప్రార్థనలు, యుక్తకాలమందు నెరవేరునట్లు; మా ప్రార్థనా స్తుతులను త్వరగా రానైయున్న యేసుప్రభువు ద్వారా ఆలకించుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

## ప్రభువు ప్రార్థన

పరలోకమందున్న మా తండ్రీ! నీ నామము పరిశుద్ధ పరచబడునుగాక! నీ రాజ్యము వచ్చునుగాక! నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక! మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము. మమ్మును శోధనలోనికి తేక, కీడునుండి తప్పించుము. రాజ్యము, శక్తి, మహిమయు నిరంతరము నీవియైయున్నవి. ఆమేన్.

## దీవెన

1. యెహోవా నిన్ను ఆశీర్వదించి నిన్ను కాపాడును గాక! యెహోవా నీకు తన సన్నిధిని ప్రకాశింపజేసి నిన్ను కరుణించును గాక! యెహోవా నీమీద తన సన్నిధికాంతి ఉదయింపజేసి నీకు సమాధానము కలుగజేయును గాక!

2. ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండును గాక! ఆమేన్.

సంఖ్యా. 6:23-26; ద్వితీ 5:7; 6:13; మత్తయి 4:10; యోహాను 4:20-24; II కొరింథి. 13:14; ప్రకటన 19:10; 22:8.

Bible Mission HQ Guntur

# ప్రభు భోజన సంస్కార ఆరాధన

(బాప్తిస్మము పొందినవారికి ప్రభువు రాత్రి భోజనమునకు ముందు పాదశుద్ధి చేయవలెను)

## వాక్యపఠన

దా.కీ. 23వ అధ్యా॥; మార్కు 14:22-25; I కొరింథీ. 11:23-33.

**బో :** తండ్రియొక్కయు, కుమారునియొక్కయు పరిశుద్ధాత్మని యొక్కయు నామమున ఆమేన్.

## పాపపు టొప్పదల క్రమము

**బో :** ప్రియులారా! 'నేను పాపములేని వాడనని' అనుకొనువాడు మోసములో పడిపోవును. మన పాపములను మనము ఒప్పుకొనినయెడల దేవుడు క్షమించివేయును. ఒప్పుకొననివాడు మరింత గొప్పపాపియై దేవునికి దూరస్తుడగును. నేనిప్పుడు అడుగు ప్రశ్నలకు హృదయ పూర్వకముగా ఉత్తరమీయుడి.

**1. ప్రశ్న :** మీరు మానవ జన్మమునుబట్టియు, మీ తలంపులనుబట్టియు, మాటలనుబట్టియు, క్రియలనుబట్టియు, పరలోకపు తండ్రియొక్క మనస్సును ఆయాస పెట్టియున్నారని ఒప్పుకొనుచున్నారా?

**జ :** ఔను. ఒప్పుకొనుచున్నాము.

**2.** ప్ర : మీ పాపములన్నిటిని మన ప్రభువైన యేసు నామమునుబట్టి **తండ్రి క్షమించినాడని** నమ్ముచున్నారా?

**జ :** నమ్ముచున్నాము.

**3.** ప్ర : మీరు ఏ పాపమునకు లోబడక, సమస్త శోధనలను దైవ వాగ్దానములను బట్టి జయించుటకు నిశ్చయించుకొనుచున్నారా?

**జ :** ఔను, నిశ్చయించుకొనుచున్నాము.

## పాప క్షమాపణ ప్రకటన

నిజముగా పాపములను గురించి దుఃఖించి, వాటిని ఒప్పుకొని, ఇకమీదట జాగ్రత్తగా నుందుమని ప్రమాణము చేసిన యెడల, అట్టి వారికి వాక్య సేవకుడనైన నేను; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మని యొక్కయు నామమున పాప క్షమాపణ ప్రకటించుచున్నాను. మరియు పాపము నొప్పుకొనక, పాపస్థితి యందుండు వారికి, నిలువ పాపముల సంగతి ప్రకటించుచున్నాను.

*ప్రభువు ప్రార్థన అందరు చెప్పవలెను.*

## పాదశుద్ధి క్రమము

**బో :** ప్రియులారా! యేసుప్రభువు భోజన సమయమందు ఒక తువాలు తీసికొని నడుమునకు కట్టుకొనెను. గనుక నేనును అట్లు చేయుచున్నాను. ఇది పరిచర్య చేయుటకు ఉండవలసిన మనస్సునకు గురుతైయున్నది. అంతట ప్రభువు పళ్ళెములో నీళ్ళు పోసెను. గనుక నేనును అట్లు చేయుచున్నాను. పిమ్మట ప్రభువు శిష్యుల పాదములు కడుగుచు, ఆ తువాలుతో తుడిచెను. గనుక నేనును అట్లు చేయుచున్నాను. "నేను నిన్ను కడుగని యెడల నాతో నీకు పాలులేదని ప్రభువు పేతురుతో చెప్పెను". ('ప్రభువుతో నీకు పాలు కలుగును గాక' అని చెప్పుచు భోజనార్థుల పాదములు కడుగవలయును) యోహాను 13:12-17.

# భోజనాచారము

**స్తుతి పాఠము :**

**బో :** ప్రభువుల ప్రభువునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతరముండును. దా. కీర్తన 136:3.

**సం :** ఆయన ఒక్కడే మహాశ్చర్యకార్యములు చేయువాడు. ఆయన కృప నిరంతరముండును. కీర్తన 136:4.

**బో :** యెహోవా దయాళుడు, యెహోవాను స్తుతించుడి. కీర్తన 135:3;

**సం :** ఆయన నామమును కీర్తించుడి. అది మనోహరము. కీర్తన 135:3.

**బో :** మన దేవుడైన యెహోవా తాను ఏర్పరచుకొనిన వారిని ఉత్సాహ ధ్వనితో వెలుపలికి రప్పించెను. కీర్తన 105:43;

**సం :** ఆకాశములోనుండి ఆహారమునిచ్చి వారిని తృప్తిపరచెను. దేవదూతల ఆహారము నరులు భుజించిరి. కీర్తన 78:24,25.

**బో :** దేవా! మేము నీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. కీర్తన 75:1;

**సం :** నీవు సమీపముగా నున్నావని కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము. దా.కీర్తన 75:1.

## స్తుతి ప్రార్థన

ప్రేమవైయున్న తండ్రీ! నీ కుమారునిలో నిన్ను బయలుపరచుకొన్న నీకు; మహిమ, మహిమ, మహిమ యని స్తుతించుచున్నాము. ఈ ప్రత్యక్షతను మేము గౌరవింపగల జ్ఞాన విధేయత ననుగ్రహింపుము. ఆమేన్.

ఓ దేవా! అరణ్యములో నీ ఎన్నికజనమైన ఇశ్రాయేలీయులకు భోజనపు బల్ల సిద్ధపరచిన నీవు, మాకు నీ కుమారునిద్వారా మా ఆత్మీయ జీవనపోషణార్థమై, సంస్కారపు భోజనబల్ల వేసినందుకు నీకు స్తోత్రములు

ఆచరించుచున్నాము. **ఇది తగిన రీతిని అనుభవించుటకై మమ్ములను నీ ఆత్మచేత అక్కడికి నడిపింపుము.** ఆమేన్.

## స్తుతి వచనము

సింహాసనము ఎదుట దూతలు పాడిన స్తుతిపాట: (యెషయా 6:3) సైన్యములకు అధిపతియగు యెహోవా! పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు; సర్వలోకము ఆయన మహిమతో నిండియున్నది. (7మార్లు చేయవలెను)

## ప్రసంగము

**బో :** ప్రియులారా! మీరు ఇప్పుడు ప్రభువు బల్లయొద్దకు రాగోరుచున్నారు. ఇది మంచిదే. ప్రభువు పిలుచుచున్నందున మీరు వచ్చినయెడల మీ రాక ఎంతో మంచిది. ***మీకు చాలా ఆకలిగానుండి వచ్చుచున్నయెడల, మీ రాక ఎంతో మంచిది.*** మీరు మీ కంటికి కనబడుచున్న రొట్టెయును, ద్రాక్షారసమును కూడ పుచ్చుకొనుచుండగా ప్రభువుయొక్క శరీర రక్తములను మీ ఎదుటనుండి చెదరనీయకుడి. మీ హృదయములను కృతజ్ఞతా స్తుతులతో నింపుకొనుడి. నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు, వారు తృప్తిపరచబడుదురు.

## వాక్యము

లోకపాపమును మోసికొనిపోవు దేవుని గొర్రెపిల్లవైన ఓ క్రీస్తూ! నీ సమాధానము మాకు దయచేయుము. ఆమేన్.

### ప్రతిష్ఠించుట మరియు, సమభాక్త్వమును ఆచరించుట.

వాక్యము : మత్తయి 26:26-29.

యేసుప్రభువు రొట్టె పట్టుకొనెను గనుక నేనును అట్లు చేయుచున్నాను. యేసుప్రభువు కృతజ్ఞతాస్తుతులు చెల్లించెను గనుక నేనును అట్లు చేయుచున్నాను.

ప్రభువా! ఇది దయచేసినందుకు నీకు స్తోత్రము. పిమ్మట ప్రభువు రొట్టె విరిచెను. గనుక నేనును అట్లు చేయుచున్నాను. అటుపిమ్మట ప్రభువు దానిని వారికిచ్చెను. నేనును అట్లు చేయుచున్నాను. ***'పుచ్చుకొని తినుడి, ఇది మీ కొరకియ్యబడిన క్రీస్తు శరీరము.'***

ప్రభువు గిన్నె పట్టుకొనెను. నేనును అట్లు చేయుచున్నాను. ప్రభువు కృతజ్ఞతా స్తుతులు చెల్లించెను. గనుక నేనును అట్లు చేయుచున్నాను. తండ్రీ! ఇది దయచేసినందుకు నీకు స్తోత్రములు. పిమ్మట ప్రభువు దానిని వారికిచ్చెను. నేనును అట్లు చేయుచున్నాను. దీనిలోనిది మీరందరు త్రాగుడి. ఇది క్రీస్తు రక్తము. అనగా పాపక్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న క్రొత్త నిబంధన రక్తము.

***మన ప్రభువైన యేసుక్రీస్తుయొక్క పరిశుద్ధ శరీరమును, ఆయన అమూల్య రక్తమును మీ ఆత్మీయ జీవమును పోషించుచు, బలపరచుచు, పెండ్లికుమారుని రాకకును, అనంత జీవమునకును మిమ్మును సిద్ధపరచును గాక! ఆమేన్.***

***ప్రార్థన చేయుదము :*** **బోధకుడు :** ఓ మా ప్రభువా! పెండ్లికుమారుడుగా రానైయున్న మా ప్రియుడవగు ప్రభువా! నీ శరీర రక్తములతో నీవు మమ్మును పోషించినందున నీకు కృతజ్ఞులమై యున్నాము. ఈ సంస్కార భోజనములోనున్న అద్భుతమైన క్రియను మేము గ్రహించలేకపోవుచున్నను; ఆ క్రియను, ఆ క్రియయొక్క ఫలితమును మేము నమ్ముచు వందనములు చేయుచున్నాము. పరలోకపు తండ్రీ! నీ కుమారునిద్వారా నీ సంఘమునకు నీవనుగ్రహించిన ఈ పరిశుద్ధ భోజనము యొక్క ఉద్దేశములన్నిటి విషయమై నీకు స్తుతులు సమర్పణ చేయుచూ, నీ ఉద్దేశము నెరవేరుటకై నీ ఆత్మయొక్క ప్రేరేపణ దయచేయుమని ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము ఆమేన్.

(పాట పాడుచుండగా చందా ఎత్తబడును)

## ప్రభువు ప్రార్థన - దీవెన

ఆది 14:18; నిర్గమ 12:21-28; 2సమూ. 9:13; కీర్తనలు 23వ అధ్యాయము.

మత్తయి 26:27-29; 5:6; 22:4-22; మార్కు 14:22-25.

లూకా 14:15-24; 15:22-23; 22:15-20; యోహాను 6:47-59.

యోహాను 13:4-15; 1కొరింథీ. 10:21; 11:23-29; ప్రకటన 19:9.

Bible Mission HQ Guntur

# బాప్తిస్మ ఆరాధన క్రమము

## వాక్యపఠనము

మత్తయి 28:19; మార్కు 16:16-17; రోమా 6:3; 4:6; 1కొరింథీ 12:13.

కీర్తన. 'ఘనపర్చుడీ దేవుని'

## బోధకుడు

తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున ఆమేన్.

ప్రియులారా! మనుష్యులందరు పాపజన్మము, పాపజీవితము గలవారు గనుక వాక్య ప్రకారము మారుమనస్సుపొంది, ప్రభువునొద్దకు నిత్యరక్షణార్ధమై రావలసియున్నది. రక్షణ కావలయునని కోరు విశ్వాసికి రక్షణ అనుగ్రహింప-బడినదని తెలియగలందులకును; విశ్వాసిని భూలోక సంఘములో బాహాటముగా ప్రభువు చేర్చుకొనుచున్నాడను సంగతి నిశ్చయముగా తెలియ-గలందులకును, బాప్తిస్మ క్రమమును మనము గైకొనుచున్నాము. బాప్తిస్మము కొరకు మీరిక్కడికి వచ్చియున్నారు. కాబట్టి బైబిలు మిషను బోధకుడనైన నేనిప్పుడు మిమ్మును అడుగు ప్రశ్నలకు మీరు త్రిత్వ దేవుని యెదుటను, ఆయన పరిశుద్ధులందరి ఎదుటను ప్రమాణము చేయవలెను.

**1. ప్రశ్న :** నీవు సాతానును వాని సర్వకార్యములను విడిచిపెట్టుచున్నావా?

**జ :** ఔను, విడిచి పెట్టుచున్నాను.

**2. ప్రశ్న :** బైబిలను గ్రంథమునందు వ్రాయబడిన సంగతులన్నియు నిజమని నీవు నమ్ముచున్నావా?

**జ :** ఔను, నిజమని నమ్ముచున్నాను.

**3. ప్రశ్న :** బైబిలు బోధించునట్టి ధర్మములన్నిటి ప్రకారము నడుచుకొందువా?

**జ :** ఔను, నడుచుకొందును.

**4. ప్రశ్న :** బైబిలు మిషను ఒప్పుకొనునట్టియు, నీవు నేర్చుకొన్నట్టియునైన ఒప్పుదలలను ఒప్పుకొనుచున్నావా?

**జ :** ఔను, ఒప్పుకొనుచున్నాను.

**5. ప్రశ్న :** రక్షణకు నీళ్ళ బాప్తిస్మమెంత అవసరమో, ***ఆత్మీయ జీవనముయొక్క వృద్ధికి పరిశుద్ధాత్మ బాప్తిస్మమంత అవసరమని నమ్ముచున్నావా?***

**జ :** ఔను, నమ్ముచున్నాను.

**6. ప్రశ్న :** విశ్వాసులకు బైబిలు గ్రంథకర్తయైన దేవుడు కాలమును, అవసరమును బట్టి క్రొత్త సంగతులను తెలియపరచునని నమ్ముచున్నావా?

**జ :** ఔను, నమ్ముచున్నాను.

**7. ప్రశ్న :** లోకములోనున్న అన్ని మిషనులవారును భేదాభేదములైన సిద్ధాంతములు కలిగినవారైనప్పటికిని, ప్రభుయేసు యెడల గల భక్తిమార్గమును ఉపదేశించుచున్నారని నమ్ముచున్నావా?

**జ :** ఔను, నమ్ముచున్నాను.

**8. ప్రశ్న :** కష్టస్థితులలోను, నిరాశ సమయములలోను, దేవుని వాగ్దానములు చదువుకొని, ప్రార్థించి, స్తుతించి, కనిపెట్టుటవల్ల నూతనమైన ఆదరణ పొంద ప్రయత్నించెదవా?

**జ :** ఔను, ప్రయత్నించెదను.

Bible Mission HQ Guntur

**9. ప్రశ్న :** పెండ్లికుమార్తె ఎత్తబడు రెండవరాకడ, మిక్కిలి సమీపమైయున్నదని నిరభ్యంతరముగా నమ్మి అందు విషయమై సిద్ధపడుదువా?

**జ :** ఔను, సిద్ధపడుదును.

**10. ప్రశ్న :** ***ఏ విశ్వాసములోనికి బాప్తిస్మము పొందవలెనో,*** ఆ విశ్వాస ప్రమాణము చెప్పుము.

**జ :** (విశ్వాస ప్రమాణము చెప్పవలెను లేక చెప్పించవలెను)

## విశ్వాస ప్రమాణము

దేవుడు తండ్రిగాను, కుమారుడుగాను, పరిశుద్ధాత్ముడుగాను మానవ రక్షణార్ధమై బైలుపడినాడనియు, పనులనుబట్టి వారు ముగ్గురుగా కనబడినను ఒక్కరై యున్నారనియు (త్రియేకత్వము) ఆయన సమస్త మానవులకు తండ్రియు, దేవుడును, సర్వమునై యున్నాడని నమ్ముచున్నాను.

దేవుడే నరావతారధారియై యేసుక్రీస్తను పేరున భూలోకమునకు వచ్చి మానవులకు అవసరమైన సంగతులు ఉపదేశించి, అద్భుతములగు ఉపకారముల మూలముగా మానవుల నాదరించి చివరగా సిలువ వేయబడి, చనిపోయి, తిరిగిలేచి, పరలోకమునకు వెళ్ళి త్వరగా రానైయున్నాడనియు, తన రాకడలో ఎత్తబడక మిగిలినవారికి ఏడు సంవత్సరములు శ్రమలు వచ్చుననియు, ఆ మీదట ఆయనే భూమిమీదికి వచ్చి వెయ్యి సంవత్సరములు నీతి పరిపాలన చేయుననియు, ఆ మీదట అంత్యతీర్పునియు నమ్ముచున్నాను. నీళ్లతో ఇచ్చిన పరిశుద్ధ బాప్తిస్మము దేవుని రాజ్యములో ప్రవేశించుటకు ద్వారమని నమ్ముచున్నాను. భూలోక క్రైస్తవ సంఘములో ప్రవేశింపగోరువారు, ఈ బాప్తిస్మములేనిదే సభ్యులుగా నుండనేరరని నమ్ముచున్నాను. ప్రభుభోజన

సంస్కారము నందు విశ్వాసికి అంతరంగముగా క్రీస్తుయొక్క శరీర రక్తములు అందునని నమ్ముచున్నాను. ప్రభుభోజనము పుచ్చుకొన్న కొందరు రోగులు బాగుపడుదురని నమ్ముచున్నాను.

క్రైస్తవులందరు యేసుప్రభువు ఇచ్చు పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొంది, ఆ ఆత్మ ఇచ్చు కృపావరములను ఆయన చిత్తానుసారముగా వాడుకొనుటకు, పరిశుద్ధాత్మ బాప్తిస్మము పరలోక సభ్యత్వమునకు గుర్తని నమ్ముచున్నాను. యేసుక్రీస్తుగా వచ్చిన దేవుడుగాక మరెవ్వరు లోక రక్షకులు కారనియు, ఏ మతస్థులైనను ఎక్కడో యొకప్పుడాయనను గూర్చి విందురనియు, దేవునితట్టు తిరుగుటకు కావలసినంత గడువు అందరకు దొరుకుననియు, అంతవరకు ఎవరికిని మోక్ష నరకముల నిర్ణయము కలుగదనియు నమ్ముచున్నాను. సర్వజనరక్షణార్థమై ఏర్పడిన మతము, క్రైస్తవ మతమనియు; గ్రంథమునుబట్టి కాక, అభిప్రాయ భేదములనుబట్టి అవి ఎన్నో మిషనులుగా చీలిపోయినను; ఏకదేవుని, ఏకరక్షకుని, ఏక మోక్షమును, ఏక గ్రంథమును సూచించుచున్నవని నమ్ముచున్నాను.

*దేవుని చర్యలు మానవజ్ఞానమునకు గ్రాహ్యముకానప్పుడు తర్కములోనికి వెళ్ళక, ఆయనచేయు సమస్తమును, ధర్మయుక్తమైనదని నిశ్శబ్దముగా ఊరకుండుటయే క్షేమమని నమ్ముచున్నాను. ఆమేన్.*

## బాప్తిస్మము

**బోధకుడు :** బాప్తిస్మము పొందువారిని పేరుతో................................ పిలిచి ప్రభువైన యేసుక్రీస్తును నీ స్వకీయ రక్షకునిగా యంగీకరించుచున్నావా?

**జవాబు :** అవును, అంగీకరించుచున్నాను.

బాప్తిస్మము పొందవచ్చినవారు మోకరించియుండగా గురువు ముమ్మారు నీళ్ళు పోయుచు (లేక నీళ్ళలో ముంచుచు) ఈలాగున చెప్పవలెను.

**బో :** నీ వాయనను నీ స్వకీయ రక్షకునిగా అంగీకరింతువని వాగ్ధానము చేసియున్నావు. కాబట్టి వాక్యసేవకుడనైన నేను; నిన్ను కలుగజేసిన తండ్రియొక్కయు, నిన్ను రక్షించిన కుమారుడైన తండ్రియొక్కయు, నిన్ను ప్రోత్సాహపరచిన పరిశుద్ధాత్మ తండ్రియొక్కయు మహా పరిశుద్ధ నామమున నీకు బాప్తిస్మమిచ్చుచున్నాను.

***(బోధకుడు బాప్తిస్మము పొందినవారి నొసటమీద సిలువ గురుతు వేయవలెను)***

## బాప్తిస్మపు - దీవెన

నీకు బాప్తిస్మమువల్ల కలుగవలసిన మేళ్ళన్నియు కలుగునుగాక!

## ప్రార్థనలు

1) ఓ ప్రభువా! వీరిని నీవు ఏ పనిమీద పిలిచినావో, ఆ పని యావత్తు పూర్తి యగువరకు వారికి తోడ్పడుమని నిన్ను వేడుకొనుచున్నాను.

2) తప్పిపోయిన కుమారులను చేర్చుకొను తండ్రీ! ప్రయాసపడి భారము మోసికొనుచున్న సమస్తమైన వారలారా! నాయొద్దకు రండని పిలుచుచున్న తండ్రీ! ***సువార్త వర్తమానముద్వారా ఈ నీ బిడ్డలను తీసికొని వచ్చిన తండ్రీ!*** ఈ నీ పనుల నిమిత్తము ఈయనను నీ సన్నిధిలో కాపాడుచు, నడిపించుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

నీకు సమాధానము కలుగును గాక!.

Bible Mission HQ Guntur

## చందా

అందరు ప్రభువు నేర్పిన ప్రార్థన చెప్పవలెను.

## ముగింపు ప్రార్థన : దీవెన

మత్తయి 3:11; మార్కు 1:5,8; లూకా 3:16; యోహాను 1:31,33; లూకా 7:29–30. మత్తయి 28:19; మార్కు 16:15,16; అపో.కార్య. 1:5. అపో.కార్య. 8:16; 10:48; 19:5; 22:16; 2:38; 1కొరింథీ 12:13; ఎఫెసీ 4:15. యోహాను 3:1–8; రోమా 6:3; 1కొరింథీ 10:2; గలతీ. 3:27; కొలస్స. 2:12; తీతు 3:5,6; 1పేతురు 3:21.

# అభిషేకారాధన క్రమము

ఆంధ్ర క్రైస్తవ కీర్తన (20) : 'పరిశుద్ధ, పరిశుద్ధ, పరిశుద్ధ ప్రభువా'

## ప్రవేశ వాక్యములు

**బో :** దేవుని ప్రియులారా! క్రీస్తు ప్రభుని సంఘాభివృద్ధి నిమిత్తమై, ఒక వాక్యబోధకుని బాహాటముగా దైవసన్నిధిలో నియమించునట్టి యొక గొప్పపనిమీద మనమిచ్చట సమావేశమైనందున త్రియేకదేవుడగు తండ్రియును, పరలోక పరిశుద్ధులును, దేవదూతలును మన మధ్యకు వచ్చియున్నారను విశ్వాసముతో నీయభిషేకారాధనలో ఏకీభవించుదము. దీనిలోని ప్రతి అంశమును, నమ్రతతోను, గౌరవముతోను, శాంతికరమైన విధానముతోను జరుపుదము. **ఇది స్వేచ్ఛాపూర్వకమైన మహానంద విధి.** బలవంతమైన నామకార్థ విధికాదు. దైవారాధనకు పవిత్రమైన అలంకార స్థానమగును గాక! ఆమేన్.

## దావీదు కీర్తన

95వ అధ్యాయము. (ఉత్తర ప్రత్యుత్తర రీతిని చదువుట)

## త్రైక దేవుని స్తుతి

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును; ఆదియందు, ఇప్పుడును, ఎల్లప్పుడును యుగయుగములయందు మహిమ కలుగునుగాక!

## బైబిలు పాఠములు

1కొరింథీ 4:1-4; లూకా 4:17-21; నిర్గమ 28:29; 40:12-16.

## ప్రార్థన

ప్రేమాస్వరూపుడవును, పరిశుద్ధుడవును, మహోఘనుడవునగు దేవా! తండ్రివిగాను, కుమారుడవుగాను, పరిశుద్ధాత్ముడవుగాను ప్రత్యక్షమైన తండ్రీ! భూమిమీదనున్న దృశ్య సంఘమునకు పరిశుద్ధ నైజముగల దేవదూతల నేర్పరచుకొనక, బలహీనులైన మానవుల నేర్పర్చుకొన్న నీ విజ్ఞాన ప్రేమాతిశయమున కనేక స్తోత్రములు. నీవు పిలిచిన ఈయనకు నీవు పిలిచిన ఉద్దేశము నెరవేరువరకు, పవిత్ర ప్రవర్తనాశక్తియు, విశ్వాసశక్తియు, బోధనాశక్తియు ననుగ్రహించుచు, సహకారివైయుండుమని నీతోను, పరిశుద్ధాత్మతోను, సదా ఏకదేవుడుగా యుగయుగములు జీవించుచు, పరిపాలించుచుండు నీ ప్రియ కుమారుడును, మా ప్రభువైన యేసుక్రీస్తుద్వారా నిన్ను వేడుకొనుచున్నాము. ఆమేన్.

**కీర్తన :** *దేవ సంస్తుతి చేయవే మనసా– 3 చరణములు*

## బైబిలు వాక్యముల ప్రసంగములు

**బో :** ప్రభువును, సైన్యములకు అధిపతియునైన యెహోవా చెప్పునదేమనగా– నా సేవకుడవైన ఇశ్రాయేలూ! నీవు నా దాసుడవనియు, నేను నిన్ను ఉపేక్షింపక ఏర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను. నీకు తోడైయున్నాను. భయపడకుము, నేను నీ దేవుడనైయున్నాను. దిగులుపడకుము, నేను నిన్ను బలపరతును. నీకు సహాయము చేయువాడను నేనే. నీతియను నా దక్షిణహస్తముతో నిన్ను ఆదుకొందును. నీ మీద కోపపడిన వారందరు సిగ్గుపడి విస్మయ మొందెదరు. నీతో వాదించువారు మాయమై నశించి పోవుదురు. నీతో కలహించువారిని నీవు వెదకుదువు గాని వారిని

కనుగొనలేక పోవుదువు. నీతో యుద్ధము చేయువారు మాయమై పోవుదురు, అభావులగుదురు. నీ దేవుడనైన యెహోవానగు నేను- భయపడకుము, నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడిచేతిని పట్టుకొనుచున్నాను. (యెషయా 41:8-13)

రక్షకుడైన యేసుప్రభువు చెప్పినదేమనగా, మీకు సమాధానము కలుగునుగాక! తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నాను. పరిశుద్ధాత్మను పంపుచున్నాను గనుక పరిశుద్ధాత్మను పొందుడి. మీరు ఎవరిపాపములు క్షమింతురో, అవి వారికి క్షమింపబడును. ఎవరి పాపములు మీరు నిలిచియుండ నిత్తురో అవి నిలిచియుండును (యోహాను 20:21-33).

'పరలోకమందును, భూమిమీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి-యున్నది. కాబట్టి మీరు వెళ్ళి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి. తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామము-లోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏ సంగతులను ఆజ్ఞాపించితినో, వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి. ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నాను' (మత్తయి 28:18-20).

భూమిమీద మీరు వేటిని బంధింతురో, అవి పరలోకమందును బంధింపబడును. భూమిమీద మీరు వేటిని విప్పుదురో, అవి పరలోకమందును విప్పబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను ఏ సంగతినిగూర్చియైనను భూమిమీద ఏకీభవించిన యెడల, అది పరలోకమందు ఉన్న నా తండ్రివలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను. ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యన ఉందును (మత్తయి 18:18-20).

ఇదిగో పాములను, తేళ్ళను త్రొక్కుటకును, శత్రువు బలమంతటిమీదను మీకు అధికారము అనుగ్రహించియున్నాను. ఏదియు మీకెంతమాత్రమును హానిచేయదు. అయినను దయ్యములు మీకు లోబడుచున్నవని సంతోషింపక, మీ పేరులు పరలోకమందు వ్రాయబడియున్నవని సంతోషించుడి (లూకా 10:19-20). 'నమ్మినవారివలన ఈ సూచక క్రియలు కనబడును. ఏవనగా నా నామమున దయ్యములను వెళ్ళగొట్టుదురు. క్రొత్త భాషలు మాట్లాడుదురు. పాములను ఎత్తిపట్టుకొందురు. మరణకరమైనది త్రాగినను, అది వారికి హానిచేయదు, రోగులమీద చేతులుంచినప్పుడు వారు స్వస్థత నొందుదురు.' (మార్కు 16:17-18).

నేను తండ్రియొద్దకు వెళ్ళుచున్నాను. గనుక నేను చేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును. వాటికంటె మరి గొప్పవియు అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. నా నామమున మీరు నన్నేమి అడిగినను నేను చేతును. (యోహాను 14:12-14).

అపోస్తలుడైన పౌలు చెప్పినదేమనగా- ఎవడైనను అధ్యక్ష పదవిని ఆశించిన యెడల, అట్టివాడు దొడ్డపనిని అపేక్షించుచున్నాడను మాట నమ్మదగినది. అధ్యక్షుడగువాడు నిందారహితుడును, ఏకపత్నీపురుషుడును, మితానుభవుడును, స్వస్థబుద్ధిగలవాడును, మర్యాదస్తుడును, అతిథిప్రియుడును, బోధింపతగినవాడునై యుండి; మద్యపానియు కొట్టు వాడునుకాక సాత్వికుడును, జగడమాడనివాడును, ధనాపేక్షలేనివాడునై, సంపూర్ణ మాన్యత కలిగి, తన పిల్లలను స్వాధీనపరచుకొనుచు, తన ఇంటివారిని బాగుగా ఏలువాడునై యుండవలెను. ఎవడైనను తన ఇంటివారిని ఏలనేరక పోయినయెడల, అతడు దేవుని సంఘమును ఏలాగు పాలించును? అతడు గర్వాంధుడై అపవాదికి కలిగిన శిక్షావిధికి లోబడకుండునట్లు, క్రొత్తగా చేరినవాడై యుండకూడదు.

సంఘమునకు వెలుపటివారిచేత మంచిసాక్ష్యము పొందినవాడై యుండవలెను. (1తిమోతి 3:1-7).

వాక్యమును ప్రకటించుము; సమయమందును, అసమయమందును ప్రయాసపడుము; సంపూర్ణమైన దీర్ఘశాంతముతో ఉపదేశించుచు; ఖండించుము, గద్దించుము, బుద్ధిచెప్పుము. (2తిమోతి 4:2).

## అభిషేకము పొందవలసిన బోధకుని అడుగవలసిన ప్రశ్నలు

దేవుని పిలుపు నంగీకరించిన ........................................అను నిన్ను, బైబిలు మిషను సంఘము ఎదుట ఈ ప్రశ్నలు అడుగుచున్నాను.

**1. ప్రశ్న :** నీ బోధలమూలముగాను, నీ ప్రార్థనల మూలముగాను, నీ ప్రవర్తన మూలముగాను, నీ వరములు వాడుకొనుట మూలముగాను నీ ఉద్యోగము నిలువబెట్టుకొనుచు, క్రీస్తు ప్రభువునకు మహిమ తెచ్చుటకై నీ సమయమును, నీ శక్తిని, నీ సమస్తమును సద్వినియోగపరుప యత్నింతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే ప్రయత్నించెదను.

**2. ప్రశ్న :** మనుష్యులు మీ సత్క్రియలనుచూచి పరలోకమందున్న మీ తండ్రిని మహిమపరచునట్లు, వారియెదుట నీ వెలుగు ప్రకాశింపనిత్తువా? మత్తయి 5:16.

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే ప్రకాశింపనిత్తును.

**3. ప్రశ్న :** దేవుని వాక్యమును సరిగా బోధించుచు, దీర్ఘాలోచనచేసి బాప్తిస్మము లిచ్చుచు, దైవభయముతో ప్రభువు భోజనము పంచిపెట్టుచు, మత సంబంధమైన కార్యములన్నియు దేవుని ముఖముచూచి సక్రమముగా నడుపుదువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే నడిపించెదను.

**4. ప్రశ్న :** బైబిలుమిషను అనుభవప్రకారము దేవుడు బయలుపరచునట్టి బైబిలు వాక్యమును, బైబిలుయొక్క అనుభవమైయున్న సంగతులను నిర్భయముగా బోధింతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే బోధింతును.

**5. ప్రశ్న :** ప్రస్తుతము బయలుపడిన పరిశుద్ధాత్మ బాప్తిస్మముయొక్క అవసరము; వరముల అవసరము; ప్రభువు రాకడయొక్క సామీప్యము అనునట్టి సంగతులు బోధింతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే బోధింతును.

**6. ప్రశ్న :** దేవుని వాక్య ప్రకారముగాను, ఆత్మ నడిపింపు ప్రకారముగాను, పెద్దల సలహా ప్రకారముగాను నీ ఉద్యోగ ధర్మములు నిర్వహింతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే నిర్వహించెదను.

## ఇతర మిషనులలో గురువులుగానుండి, బైబిలుమిషనులోనికి గురువులుగా వచ్చి చేరువారిని అడుగు ప్రశ్నలు

**1. ప్రశ్న :** దేవుడు బైబిలుమిషనును యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచి నారనియు, బైబిలుమిషను సిద్ధాంతములన్నియు ప్రభువే బైలుపరచినారనియు నమ్ముచున్నావా? వాటిని బోధింతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే చేయుదును.

**2. ప్రశ్న :** బైబిలుమిషనులోని కార్యక్రమములను జరిగించుటకును, కుటుంబ జీవిత పోషణ కొరకును, ఇతరులపై ఆధారపడక; ప్రభువుమీదనే ఆధారపడి బైబిలు మిషను విశ్వాసపద్ధతినే అనుసరింతువా?

**జ :** ప్రభువు సహాయమువలననే అలాగుననే జరిగింతును.

**3. ప్రశ్న :** *నేడును ప్రభువు కనబడి మాట్లాడునను సంగతిని బోధింతువా?*

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే బోధింతును.

**4. ప్రశ్న :** దైవసన్నిధి అనుభవము కలిగి, సంఘమును అట్టి అనుభవములోనికి నడిపింతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగున చేయుదును.

**5. ప్రశ్న :** ప్రభువుయొక్క రెండవరాకడ మిక్కిలి సమీపముగానున్నదని నమ్మి, అందుకొరకు సిద్ధపడిసంఘమును సిద్ధపరతువా?

**జ :** ప్రభువు సహాయమువలన అట్లే చేయుదును.

## ప్రమాణము

(అభిషేకము పొందవలసిన బోధకుడు స్వయముగా చెప్పవలసిన మాటలు)

ప్రజల మేలుకొరకును, ప్రభువైన యేసుక్రీస్తు రాజ్యాభివృద్ధికొరకును, పెండ్లికుమార్తె సిద్ధపడవలసిన ప్రయత్నముకొరకును; త్రియేక దేవుని సెలవు ప్రకారము యం. దేవదాసు అయ్యగారు బైబిలుమిషను పేరుతో యొక మిషనును స్థాపించినారు. ఈ మిషను వృద్ధి కొరకు వాక్యప్రకారముగాను, ఆత్మనడిపింపు ప్రకారముగాను చేయుదునని నిశ్చయించుకొన్నాను. ***ఈ నా హృదయ నిశ్చయత మీకు బయలుపరచుచున్నాను.***

## అభిషేకము

**బో :** సర్వవ్యాపియగు త్రియేకదేవుడును, పరలోక పరిశుద్ధులును, పరిశుద్ధ దేవదూతలును, ఈ నిమిషమందు ఈ స్థలమును చూడవచ్చి, ఈ సంతోషములో పాలివారగుచున్నారని ఎవరు నమ్ముచున్నారో వారందరును, గౌరవబుద్ధి వెల్లడించుటకై లేచి నిలువబడుడి.

## ప్రతిష్ఠించుట

(అందరు నిలువబడియుండగా, అభిషేకము పొందవలసిన బోధకుడు మోకరింపవలెను)

**(పాస్టరుగా)** సృష్టికర్తయగు తండ్రియొక్కయు, రక్షణ కార్యకారియగు కుమారుని యొక్కయు, సంఘ మార్గదర్శియగు పరిశుద్ధాత్మ యొక్కయు నామమున; పరిశుద్ధ వాక్య సంస్కారముల ఉద్యోగమును నీకప్పగించి, నిన్ను క్రైస్తవ సంఘకాపరిగా అభిషేకించుచూ దైవసేవకై ప్రతిష్ఠించుచున్నాను.

**(రెవరెండుగా)** దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బయలుపరచిన బైబిలు మిషనునందుగల సంఘకార్యములను జరిగించుటకును, వధువుసంఘ సిద్ధబాటు కొరకైన అనుభవ అంతస్తులను నేర్పించి సిద్ధపరచుటకై, నిన్ను క్రైస్తవ సంఘ గురువుగా అభిషేకించుచు, ప్రతిష్ఠించుచున్నాను.

## స్తోత్ర ప్రార్థన

ఆకాశమును, భూమిని సమస్తమును కలుగజేసిన ప్రియుడవగు మా తండ్రీ! మీ కుమారుని మూలమున మాకు తండ్రిగానున్న మా తండ్రీ! **భిన్నాభిప్రాయమునెదుట బైబిలుమిషను పేరుతో నొక మిషను స్థాపించుకొనుటకు నీవిచ్చిన ఉపదేశము నిమిత్తమై నిన్ను స్తుతించుచున్నాము.** మరియు ఈ నీ సేవకుని పిలిచి, నేడు అభిషేకారాధన దినముగా నియమించిన నీ సామర్థ్యమును కొనియాడుచున్నాము. ఈ మిషను పనిని సర్వలోక రాష్ట్రముల పరిశీలనాదృష్టి ఎదుటను, అన్ని మిషనుల విభేదముల దృష్టి పథము ఎదుటను, అంధకార రాజ్యముయొక్క ద్వేషభావనేత్రముల ఎదుటను, సంఘముయొక్క ఆమోద ముఖబింబము నెదుటను, నీ వాగ్దాన సిద్ధి కనుపరచుచు, సాగింతువని ముందుగానే నమ్మి నీకు వందనము లాచరించుచున్నాము. ఆమేన్.

## దీవెన

యెషయా 61:1; లూకా 4:18; అపో.కార్య. 10:38; 2కొరింథీ 1:21; 1యోహాను 2:20,27.

# పెద్దలను ఏర్పరచుకొనుట

## సంఘ పెద్దలను ఏర్పరచినపుడు చేయవలసిన ప్రార్థన

**బో :** ప్రియులారా! సంఘముయొక్క క్షేమాభివృద్ధి నిమిత్తమై ప్రభువు ఒక్కొక్కరిని, ఒక్కొక్క పనిమీద పెద్దలుగా నుండుటకై, నేడాయన మిమ్మును పిలుచుచున్నాడు. ఆయన ఎవరిని పిలుచునో, వారికి తమ విధులను నెరవేర్చుకొను సామర్థ్యముకూడ అనుగ్రహించును. ***మీరట్టి సామర్థ్యమును విశ్వాసమూలముగా సంపాదించుకొనగలరు.*** దైవాత్మయే మిమ్మును ఏపనులయొద్దకు నడిపించునో, ఆయా పనులను దేవుని ముఖముచూచి మహాశ్రద్ధతోను, నిరీక్షణతోను, నమ్మకముగా చేయుడని మిమ్మును హెచ్చరించుచున్నాను. ఈ పనికి వాక్యసేవకుడైన నేను మీకు దైవాశీర్వాదమును ప్రకటించుచున్నాను.

మీరు దీవెన పొందినవారై బయలుదేరుడి. మీ సత్ప్రవర్తన మూలముగా ప్రభువునకు మహిమ కలుగునట్లు, సమస్త మానవుల ఎదుట మీ వెలుగు ప్రకాశింపనీయుడి. సృష్టికర్తయైన దేవుడు మీలో నెప్పటికప్పుడే, అగత్యమైన ఆలోచనను సృష్టి చేయునుగాక! రక్షకుడైన యేసుప్రభువు తాను తెచ్చిన రక్షణను మీకు జ్ఞాపకము చేయునుగాక! పరిశుద్ధాత్మ- ప్రభువు, తండ్రి మీకు ఇచ్చువాటిని పుచ్చుకొనుచు, వాడుకొనునట్లు మిమ్మును దీవించునుగాక! ఆమేన్.

అపో.కార్య. 6:5-6; 14:23; 15:6; 21:18; 1తిమోతి 5:17; తీతు 1:5-6; యాకోబు 5:14; 1పేతురు 5:1.

# పనివారిని ఏర్పరచుట

**బో :** ప్రియులారా! దేవదూతలు చేయవలసిన సువార్తపనిని, మానవులమైన మనకు ప్రభువు అప్పగించుటవల్ల మానవ సంతతిని సన్మానించుచున్నారు. మరియు సువార్త ప్రకటింపవలసిన గొప్పభారము మనమీద పెట్టియున్నారు. అన్ని ఉద్యోగములకంటెను ఈ ఉద్యోగము గొప్ప ఉద్యోగమని మీరు గ్రహించుకొనుడి. 'జీతము లేకుండా ఉచితముగా సువార్త ప్రకటించుటయే జీతమని' పౌలు చెప్పిన మాటలలో గొప్ప విలువయున్నది. మీరు నేర్చుకొన్న సువార్త సంగతులు, ఇతరులకు బోధించుచున్నప్పుడు సమయోచితమైన వాక్కు మీకనుగ్రహింప బడునుగాక. ***ఈ పని మిక్కిలి భారమైన పనియైనప్పటికిని*** దేవునివల్ల అనుగ్రహింపబడిన పని గనుక ఎక్కువ పూచీగల పనియని మీరు యోచించుకొనుడి. దేవుడే మీ యధికారియు, మీ పనికి మంచి ఫలమిచ్చువాడునైయుండి; మిమ్మును పోషించుచు, ఆదరించుచు, ఆత్మలను తన యొద్దకు పోగుచేసికొని వచ్చు పనిలో ఆయనే మీకు సహకారిగానుండును. వాక్య సేవకుడనైన నేను, మీకు రావలసిన దీవెనను సంఘము ఎదుట ప్రకటించుచున్నాను.

*తండ్రియైన దేవుడు మీ మనస్సులో నూతనమైన ఆలోచనలు కలుగచేయును గాక! కుమారుడైన తండ్రి మానవుల నిమిత్తమై అవతారధారియైయున్న కాలములో చేసియున్న పని మీకు జ్ఞాపకము చేయునుగాక! పరిశుద్ధాత్మ తండ్రి మీకు ఉజ్జీవము కలిగించుచుండును గాక! త్రియేక దేవుని దీవెన మీకు లభించును గాక!*

## ప్రమాణము

బైబిలుమిషను అప్పగించు ఈ పనిని, ప్రభువే అప్పగించుచున్నాడని నేను నమ్ముచు, సంతోషముతో ఈ పనిని తీసికొని నా జ్ఞానమును, విశ్వాసమును, సామర్ధ్యమును వాడుకొనుచు, పనులన్నియు ప్రభువు సహాయమునుబట్టి చక్కబెట్టుకొందునని ప్రమాణము చేయుచున్నాను. ***నేను వాక్యప్రకారముగాను, ప్రభువిచ్చు ప్రత్యక్షత ప్రకారముగాను, ఆత్మ నడుపుదల ప్రకారముగాను ఈ పని చేయ నిశ్చయించు కొనుచున్నాను.***

## ఆశీర్వాదము

అపో.కార్య. 13:1; 21:8; రోమా 12:8; 1కొరింథీ 9:7-14; ఎఫెసీ 4:11-12; గలతీ 6:6; కొలస్స. 1:28; 3:15-16; 2తిమోతి 4:5; హెబ్రీ 13:16-17.

Bible Mission HQ Guntur

# చిన్నబిడ్డల ప్రతిష్ఠారాధన క్రమము

## వాక్య పఠనము

లూకా 2:21-32,52; మత్తయి 18:3-6; 19:13-15; మార్కు 10:13-16; లూకా 18:17; కీర్తన 8:2; 22:9.

**బో :** తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మునియొక్కయు నామమున కృపా సమాధానములు మీకు కలుగును గాక! ఆమేన్.

ప్రియులారా! మన ప్రభువైన యేసు దేవాలయమునకు కొనిపోబడి సుమెయోనుచేత ప్రతిష్ఠింపబడెను. ఆ విధముగానే మన బిడ్డలను దేవాలయములో దేవునికి ప్రతిష్టించుట క్షేమమును, దీవెనయునైయుండును. ప్రభువునకు నామకరణము చేసినట్లు మన బిడ్డలకును నామకరణము చేయుదము. (బోధకుడు ఈ క్రింది ప్రశ్నలు అడుగవలెను).

**1. ప్రశ్న :** సైతాను కార్యములనన్నిటిని విసర్జించునట్లు మీ బిడ్డను పెంచుదురా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే పెంచుదుము.

**3. ప్రశ్న**. బో : దేవుని వాక్యము నేర్పుచు వానిని ప్రభువు మార్గమున పెంచుదురా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే పెంచుదుము.

**3. ప్రశ్న**. బో : బైబిలు మిషనువారు బోధించుచున్న బోధలు వారికి నేర్పుదురా?

**జ :** ప్రభువు సహాయమువలన అలాగుననే నేర్పుదుము.

***(బోధకుడు బిడ్డను ఎత్తుకొని ప్రభువుకు ప్రతిష్టించి పేరు పెట్టవలెను.)***

# ప్రార్థన

పరలోకపు తండ్రీ! ఈ నీ బిడ్డను జ్ఞానమందును, వయస్సునందును, దేవుని దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లునట్లు దీవించుము. తల్లిదండ్రులు ఈ బిడ్డను నీ వాక్యమందును, దైవ సహవాసానుభవము నందును పెంచు కృప అనుగ్రహించుము. ***బైబిలు మిషనును నీవే బైలుపరచిన సంగతి ఈ బిడ్డద్వారా వెల్లడిలోనికి వచ్చునట్లు కాపాడి నడిపించుము.*** మరియు సైతానుయొక్క సకల దుస్థితి నుండి విడిపింపబడి, ప్రభువైన క్రీస్తు మహిమ రాకడకు ఆయత్త పడునట్లు నీ పావనాత్మ యొక్క నింపుదల దయచేయుమని త్వరగా రానైయున్న యేసునామమున వేడుకొను చున్నాము. ఆమేన్.

**దీవెన**

ప్రభువు ఈ బిడ్డను జ్ఞానమందును, ఆరోగ్యాయుష్కాలమందును, విద్యయందును, దైవభక్తియందును, సకలైశ్వర్యములయందును వర్ధిల్లజేసి, తన చిత్తానుసారముగా వాడుకొనును గాక! ఆమేన్.

పరలోకపు ప్రార్థన

దీవెన

# ఆలయ ప్రతిష్టారాధన

ఆంధ్రక్రైస్తవ కీర్తనలలో 26 : 'రండి యుత్సాహించి పాడుదము'.

(అందరు గుడిద్వారము దగ్గర ఒక ప్రక్కన వరుసగా నిలువబడి, గుడి చుట్టు ముమ్మారు తిరుగుచు ద్వారమునొద్ద ఆగవలెను)

## దేవాలయము తెరచుట

**బో :** తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును మహిమ కలుగునుగాక!

*(గుడి నాయకుడు బోధకునికి గుడితాళపు చెవిని ఇవ్వవలెను)*

**బో :** వాక్యసేవకుడనైన నేను ఆరాధనకు వాడుకొనుటకై, బైబిలు మిషను యొక్క.......................... అను పేరుగల ఈ నూతన గుడి ద్వారమును తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున తీయుచున్నాను.

*"యెహోవా మందిరమునకు వెళ్ళుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని".*

**సం:** నీవు దేవుని మందిరమునకు పోవుచున్నపుడు నీ ప్రవర్తన జాగ్రత్తగా చూచుకొనుము. ప్రసంగి 5:1. (కీర్తన పాడుచు అందరు గుడిలోనికి వెళ్ళి కూర్చుండవలెను. కాని బోధకుడు మాత్రమే ఆల్టరుయొద్దకు వెళ్ళవలెను. ఆయన బైబిలు, కీర్తన పుస్తకము, సంస్కార భోజనపాత్రలు, చందాపళ్ళెము, ఇంకా ఏమైన ఉన్నయెడల అవియును జాగ్రత్తగా ఆల్టరుమీద పెట్టవలయును.)

**బో :** ఆయన ఆలయములో నున్నవన్నియు ఆయనకే ప్రభావము అనుచున్నవి. కీర్తన 29:9.

**సం :** యెహోవా ప్రసన్నతను చూచుటకును, ఆయన ఆలయములో ధ్యానించుటకును, నా జీవిత కాలమంతయు యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను. దా.కీర్తన. 27:4.

**బో :** స్తుతిప్రార్థన : ఓ దేవా! మేము నిన్ను ఆత్మతోను, సత్యముతోను, ఆరాధించుటకు ఈ ఆలయమును దయచేసినందుకు నీ కనేక వందనములు. ఇవి నీ కుమారుడును, మా ప్రభువునుబట్టి అందుకొనుము.

**సం :** ఘనతా, ప్రభావములు ఆయన సన్నిధిని ఉన్నవి. బల సౌందర్యములు ఆయన పరిశుద్ధ స్థలములో ఉన్నవి. జనముల కుటుంబము-లారా! యెహోవాకు చెల్లించుడి. మహిమ బలములు యెహోవాకు చెల్లించుడి. యెహోవా నామమునకు తగిన మహిమ ఆయనకు చెల్లించుడి. దా.కీర్తనలు 96:6-8.

## వేద పఠనము

**ప్రసంగ ప్రార్థన :** తండ్రీ! ఆయా సమయములకు తగిన మాటలు నీ వాక్యములో వ్రాయించిన నీ కృపకు స్తోత్రములు. నేటి దేవాలయ ప్రతిష్టకు మేము జ్ఞాపకము చేసికొనవలసిన యొక వాక్యమును ధ్యానింప గోరుచున్నాము. ఈ వాక్య వివరము నీ వాక్యమునకు అనుగుణముగా నుండునట్లు వర్తమానము దయచేయుము. ఆమేన్.

## ఆలయమును, ఉపకరణములను ప్రతిష్టించుట

**బో :** ఈ ప్రతిష్టకు త్రియేకదేవుడును, ఆయన పనివారును వచ్చినట్లు, విశ్వాసము వలన గ్రహించుకొనుచున్నాను. మహాత్యమును, పరాక్రమమును, ప్రభావమును, తేజస్సును, మహామహిమయును ఆయనకే చెల్లును. (1దిన. 29:11)

*(గౌరవార్ధమై సంఘములేచి నిలువవలెను)*

**ప్రతిష్టిత :** నేను ఈ దైవ గృహ ప్రతిష్ట మహోత్సవ సమయమందు బైబిలు మిషనుయొక్క నూతన దేవాలయమును తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున దైవమందిరముగ ప్రకటించుచు, దైవారాధన నిమిత్తమై ప్రతిష్టించుచున్నాను. ఈ ఆలయమును ప్రతిష్టించుటలో దీనియందలి ఆరాధనకొరకు ఉపయోగించు ఉపకరణముల–నన్నిటిని ప్రతిష్టించుచున్నాను.

*(సంఘము 7 మార్లు ఆమేన్ అని చెప్పవలెను)*

## ఆలయమును, ఉపకరణములను అప్పగించుట

**బో :** ఆదివార ఆరాధనకును, ఇతర సమయములందు జరుగు మత సంబంధమైన కూటములకును, ఒక్కొక్కరు చేసికొనగల ప్రార్థనలకును, ధ్యానములకును; ఈ దైవస్థానమును సరిగా ఉపయోగింతువని నమ్ముచూ ఈ బాధ్యతను అప్పగించుచున్నాను. దేవుడు అన్నిటిలో మహిమ నొందునుగాక!

**సం :** ఆమేన్, ఆమేన్, ఆమేన్.

## స్తుతి కీర్తన పాడవలెను

**ప్రార్థన :** మహాప్రభావముగల తండ్రీ! మందిరమును కట్టవలసినదని సొలొమోనుకు సెలవిచ్చిన తండ్రీ! ఆకాశ మహాకాశములు పట్టజాలని నీవు, మానవ నిర్మితమగు మందిరమున నివాసముచేయుట మాకెంతో ఆశ్చర్యముగా నున్నది. నీ నివాస వాగ్దానము నిమిత్తము నీకనేక వందనములు. నీ ప్రజలు ఇచ్చుట ఒప్పుకొను పాపములను క్షమించుమనియు; అవి మాత్రమేకాక

నరస్వభావము చొప్పున చేయు ఆరాధనలోని లోపములను కూడ మన్నించుమనియు; మిగుల ఉపయోగకరమగు బోధలు వారికి వినిపించు-మనియు; వారు తెచ్చు కానుకలు పుచ్చుకొనుమనియు నిన్ను వేడుకొనుచున్నాను. పాపశోధన కాలమందును, శత్రు భీతి కాలమందును, కరువు కాలమందును, వ్యాధికాలమందును, మందస్థితికాలమందును, వర్షలోభకాలమందును, **దుర్భోద కాలమందును,** ఇంకను ఇతర కాలములయందును; ప్రజలు ఇచ్చట చేయు ప్రార్థనలు నీ కుమారుని ముఖబింబము చూచి ఆలకించుము. సొలొమోను మందిరము యాజకులు ప్రవేశింపలేని కాంతితో నిండియుండినట్లు, ఈ మందిరము నీ సిలువకాంతితో నిండియుండునట్లు ఏర్పాటు చేయుము.

యేసుక్రీస్తు ప్రభువా! మా రక్షకుడా! మా దేవా! మా మనుష్యులలో ఒకప్పుడు మనుష్యుడవుగా నివసించిన మనుష్యకుమారుడా! మావలె ఒకప్పుడు మనుష్యులతో గుడిలో కూర్చున్న తండ్రీ! నీకు స్తోత్రము. మా నిమిత్తమై ఇప్పుడు పరలోక సింహాసనమునొద్ద విజ్ఞాపన చేయుచున్న మా ప్రధాన యాజకుడా! మా భారమంతయు ఎత్తుకొనుటవలన మా ప్రార్థనలన్నిటికి నెరవేర్పు కలిగించు కారకుడవైయున్న సమాధానకర్తా! నీవు మాకు ఇటువంటివాడవై యున్నందున నీకనేక స్తోత్రములు. సదాకాలము మీతోనున్నానని సెలవిచ్చిన ప్రభువా! ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడనే వారిమధ్యనే యుందునని వాగ్ధానము చేసిన దేవకుమారుడా! నీ మాటలకు అనేక స్తోత్రములు. ***ఆ నీ మాటల ప్రకారముగా నేడు ఇచ్చట నున్నావని విశ్వాసమువల్ల మేము ఎరుగుదుము.*** నీకు అనేక స్తోత్రములు. మాకున్న శరీరమువంటి శరీరమును దాల్చుటవల్ల, మా నరులలో ఆనాడు బహిరంగముగా మసలిన

నీవు, నేడు మహిమ శరీరముతో మా యందరియొద్ద మసలుచున్నావని యానందించుచు, హృదయములో మనస్కరించుచు, నమస్కరించుచున్నాము స్తోత్రము. మా మానవులలో నొకరు దేవాలయ ఆరాధన జరుపుట మేము చూచినపుడు, మా ప్రధాన యాజకత్వ కార్యమహిమను మా విశ్వాస నేత్రములకు కనబరచుము.

ఓ పరిశుద్ధాత్మవై యున్న తండ్రీ! సృష్టిలోని జల ఉపరిభాగమున నివాసమగుపరచిన దేవా! మా కెన్నెన్ని మంచి ఆచారములు, సత్క్రియలు ఉన్నప్పటికిని; ***నీవు లేని యెడల ఆ యాచారములలోను, సత్క్రియలలోను, వాటికి జీవముగాని, పెంపుగాని యుండదు.*** గనుక నీ యంతరంగ కార్యము నిమిత్తమే, మహా తేజోమయమైన ఈ పనులన్నిటి విషయమై నీకనేక స్తోత్రములు. అన్నిటిలోను నీవు ఉండుమని వేడుకొనుచున్నాము. నీవు మాతో నివసింతు-వనియు, మాలో ఉందువనియు నీ వాక్యమువల్ల నేర్చుకొని ఉత్సహించు చున్నాము, ఉద్రేక పడుచున్నాము. నీకు స్తోత్రము. పరిశుద్ధాత్మ పావురమా! నీవు మా మందిరములోను, మా హృదయములోను నిత్యనివాసిగా నుండి, మమ్మును వెలగించుచు, వృద్ధిలోనికి తెచ్చుచు, కాపాడుచుండుమని వేడుకొను చున్నాము. ఇట్లు చేయుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము. ***నీ పని లేనిదే, ఒక పనియైనను కాజాలదు.*** కనుక నీ పనిముట్టగు వాక్యముతోను, బాప్తిస్మ సంస్కారములతోను, ప్రభు భోజన సంస్కారములతోను, సంఘము పనిచేయుచు; సంఘమును మందిరములో నివసింపజేయుమని నీకు మనవి చేయుచున్నాము. నీ కుమ్మరింపు నిమిత్తమై అనేకులు ఈ కాలమందు ఆనందించుచు, ప్రార్థించుచు, ఎదురుచూచుచు; ఇట్లు చేయుటవలన అనేకమైన నిందలు

సహించుచు నుండుట; నీ సహాయ కార్యమని తలంచుకొని హర్షించుచు, నిన్ను కొనియాడుచున్నాము. ఓ ఆత్మనివాసివైన ఆత్మా! ఆత్మలో పరిశుద్ధాత్మ బాప్తిస్మమని కలువరించుచుండగా ఈ కార్యము బహువేగముగా నెరవేర్చుము. యేసు ప్రభువుయొక్క రెండవరాకడ అతి సమీపమగుచున్న ఈ కాలములో, నీ బాప్తిస్మకాలమును సంపూర్తిగా జరుగనిమ్ము. అప్పుడు మీ రాకకు పెండ్లికుమార్తెగా సిద్ధపడగలము. ఈ కృప నీ విశ్వాస జనసంఘమునకు లభించునని నమ్ముచు స్తుతించుచున్నాము.

ఓ త్రియేకదేవా! తండ్రీ! నీ నివాసము కొరకు నీ ప్రేరేపణనుబట్టి కట్టిన **(.............................ఆలయ నామము చెప్పవలెను...............)** ఈ స్తోత్రాలయములో మిగుల తరచుగాను, ఎక్కువగాను నీకు మా ఆత్మచేయు స్తోత్రములు కలుగునట్లు దీవించుము. ***బాప్తిస్మకాలమందు చేయు నిబంధనలు, ప్రార్థనలు కడవరకు నిలుపుకొనగలుగు శక్తి స్థానికులకనుగ్రహింపుము.*** బాప్తిస్మము ద్వారా నీకును, మాకును, తండ్రి బిడ్డల వరుస ఏర్పడినదనియు, బాహ్య సంఘ ప్రవేశము కలిగినదనియు నీ రాజ్య ప్రవేశము ప్రాప్తించినదనియు, ***మొదటిసారి కుతూహలపడినట్టి మహిమగల అంతస్తు దయచేయుము.*** మరియు సంస్కార భోజన కాలమందున శ్రేష్టాచారములు, పాటలు, బోధలు, మా ఆత్మీయ జీవనవృద్ధికిని, నీ ఘనతకును అనుకూలపడునట్లు ఆశీర్వదించుము. ఓ దేవా! మేము ఈ మందిరము విడిచి, 'చిరకాలము యెహోవా మందిరములో నివాసము చేసెదనను' వాక్యార్థము యెక్కడ పూర్తిగా చూడగలమో, ఆ పరలోక మందిరములోనికి చేరువరకును, ***ఆ మందిరము కళ ఈ మందిరమునకును ముందు అనుభవమునకును అందించుము.*** ఈ మా ప్రార్థనలు, స్తుతులు,

స్తోత్రములు అన్నియు ఫలించునట్లు నీ ప్రియకుమారుడును, పెండ్లికుమారుడుగా వచ్చుచున్న మా రక్షకుడైన యేసుక్రీస్తు ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

**కీర్తన :** కానుకల సేకరణ, సంఘ పెద్దలు జరిగించుదురు.

కానుకల కొరకైన ప్రార్థన : స్థానిక సంఘ గురువు

నివేదికను సమర్పించుట : కార్య నిర్వాహకులు

వందన సమర్పణ :

ముగింపు ప్రార్థన : ప్రభువు ప్రార్థన, దీవెన.

# వివాహ ఆరాధన

(వివాహ దినమునకు పూర్వము మూడు ప్రకటనలు ఆలయములో చేయవలయును.)

(గ్రామము పేరు) ..........ఉన్న, (వరుని పేరు) ..........యొక్కయు; ............ఉన్న, (వధువు పేరు) ..........యొక్కయు, వివాహ ప్రకటన చేయుచున్నాను. వీరిద్దరును వివాహము చేసికొనకూడదని ఏ హేతువైనను, న్యాయమైన ఆటంకమైనను, మీలో ఎవరైనను తెలిసికొని ఉన్నయెడల దానిని తెలుపవలెను.

1) వివాహ మాడగోరువారి దాంపత్యము పరిశుద్ధ లేఖనమునకు అనుగుణ్యముగా నుండుట, 2) రాజ్య, సంఘ, చట్టములకు అనుకూలించుట; 3) వధూవరులు యుక్త వయస్సుగలవారై యుండవలెను. 4) వివాహ కార్యక్రమము ఆలయములో జరుపవలెను. (అవసరమైనయెడల ఇతర స్థలములలోను జరిపించవచ్చును.)

## వివాహ కార్యక్రమము

(వరుడు ముందుగా ఆలయమునకు వెళ్ళి, నియమిత స్థలములో కూర్చుండవలెను. ఆ తరువాత వధువు ప్రవేశించునప్పుడు కీర్తన పాడవలెను. మరియు సంఘములేచి నిలువబడవలెను.)

## గురువు ఈ క్రింది దీవెన చెప్పవలెను.

తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమున కృపా సమాధానములు కలుగునుగాక! ఆమేన్.

సంఘము నిలువబడియుండగా, ఏదైన ఒక వాక్యము చదువవలెను (దా.కీర్తనలు 37:3-7; 67వ అధ్యా॥ లేక 128వ అధ్యా॥)

## స్తుతి ప్రార్థన

త్రియేక దేవుడవైన తండ్రీ! నీ పావన లక్షణముల నిమిత్తము వందనములు. మానవుని నిమిత్తమై సమస్తమైన దానములుగల సర్వసృష్టిని సృజించిన నీకు స్తుతులు. మానవుని నీ స్వరూపమునందు, నీ పోలిక చొప్పున చేసిన తండ్రీ! నీకే స్తుతులు. ఆది మానవునికి సాటియైన సహాయమును సమకూర్చిన తండ్రీ! వినుతులు. కానా వివాహమునకు పిలువబడి నీళ్లను ద్రాక్షరసముగా చేసిన కుమారుడవైన తండ్రీ! ప్రణుతులు. పెండ్లి కుమారుడుగా రానైయున్న క్రీస్తు ప్రభువునకు భూలోకములో సంఘ వధువును సిద్ధపరచి, మహిమ మేఘములోనికి కొనిపోయి ప్రభువునకు జతచేయు పరిశుద్ధాత్మ తండ్రీ! సంస్తుతులు. మీరును, పరలోకపు దూతలును, పరిశుద్ధులును, ఈ వివాహములోనికి వచ్చి, నూతనముగా జతపరచబడు ***ఈ వధూవరుల*** నాశీర్వదింప గలందులకు ప్రార్థించుచున్నాము. ఆమేన్.

తెలుగు క్రైస్తవ కీర్తనలలో 92; (మంగళ ప్రమోదము వివాహము ......)

బైబిలు పఠనము :

1) పాత నిబంధన పాఠము : ఆది 2:18-24

2) క్రొత్త నిబంధన పాఠము : యోహాను 2:1-11

3) పత్రిక పాఠము : ప్రకటన 19:6-9.

## ప్రార్థన

త్రియేకుడవైన తండ్రీ! నీయాశీర్వాదము భూమిమీద జరుగుచున్న వివాహముల మీద నున్నది. గనుక వందనములు. నీవు వివాహము

ఏర్పరచినప్పుడు అదివరకు చరిత్రగాని, వృత్తాంతముగాని లేదు. **నీ తీక్షణమైన ప్రేమనుబట్టి ఇద్దరు ఒక్కరు గాను, ఒక్కరు ఇద్దరుగాను జీవించుచు, ఒకరిలో నొకరిని చూచుకొనుచు, వారిలో నీ స్వరూపమును సృష్టికి కనబరచుచు ఏలికలై పరిపాలించవలెనని నీవు ఏర్పరచినందున** వివాహము అన్నిటిలోను ఘనమైనది గాన వందనములు. లోకమంతటిలో జరుగు వివాహములయొద్ద నీవు ఉన్నావు. **ఎందుకనగా అందరు నీకు ప్రియమైనవారు. మనుష్యులు నీ నుండి వేరైనారుగాని నీవు ఎప్పుడును వేరుగాలేవు. నీవు దయగలవాడవు. అందుచేత మానవులను నడిపించేవాడవు. మనిషిలో లోపమున్నను, నీ ప్రేమలో లోపములేదు** గాన వందనములు. ఆది దంపతులను ఎట్టి ఘనమైన ఏలికలనుగా చేయ-నుద్దేశించినావో ఆ ఘనమైన కార్యమును క్రీస్తు స్వరూపముగల వధువు సంఘముతో క్రీస్తుప్రభువు వచ్చి, వెయ్యేండ్ల పాలన కాలమప్పుడు దానిని ప్రత్యక్షపరచును. గాన వందనములు. ఈ వివాహ కార్యక్రమము నీ మహిమకొరకును, ఈ వధూవరుల కృపాక్షేమము కొరకును ఇక్కడ నున్న అందరి దీవెనకొరకును, జరిగించుమని త్వరగా రానైయున్న క్రీస్తు ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

## ప్రసంగము

(పురుషుని ఎడమవైపున స్త్రీ నిలువబడియుండగా గురువు ఇట్లు చెప్పవలెను.)

**బో :** మిక్కిలి ప్రియులారా! ఈ స్త్రీ పురుషులకు పరిశుద్ధ వివాహము చేయుటకు దేవుని సముఖమందును, ఈ సభ ఎదుటను మనము కూడియున్నాము. వివాహమనునది దేవుడు తానే నియమించిన ఘనమైన స్థితియై యున్నదని; దేవుడే ఆదామును నిర్మించి ప్రక్క టెముకను తీసి

హవ్వనుచేసి భార్యగా ఇచ్చుటవలనను, ఆది దంపతుల పతన సమయమున స్త్రీ సంతానమునందు లోకమునకు రక్షకుడుగా జన్మించునను వాగ్ధానము చేయబడిన క్రీస్తుప్రభువు వచ్చి, కానా వివాహములో నీళ్లను ద్రాక్షారసముగా చేసిన మొదటి అద్భుత క్రియవలనను; క్రైస్తవ సంఘమును పరిశుద్ధాత్మ్మడు వధువుగా సిద్ధపరచి వరుడైన క్రీస్తు ప్రభువుతో ఐక్యపరచుటకై మధ్యాకాశము లోనికి కొనిపోనైయున్నందువలనను క్రీస్తునకును, ఆయన సంఘమునకును గల మర్మమైన ఐక్యమును ఈ వివాహము సూచించుచున్నది. గనుక ఈ వివాహము ఆ పరిశుద్ధమైన స్థితిని అలంకరించినది. మరియు 'ఇది ఘనముగా ఎంచదగినది' అని పరిశుద్ధ లేఖనము మెచ్చుకొనుచున్నది. గనుక దీనిని ఎవరును అనాలోచనగాను, చులకనగాను, పూనుకొనకూడదు. వివాహమేర్పడిన ఉద్దేశములకు తగినట్లుగా యోచించి ***భక్తి వినయములతోను, వివేకముతోను, సుబుద్ధితోను, దైవ భయముతోను దీనిని పూనుకొనవలెను.***

## వివాహ ఉద్దేశము లేవనగా

1. దేవుడు– మీరు ఫలించి అభివృద్ధినొంది, విస్తరించి భూమిని నింపుడని, దానిని లోబరచుకొనుడని ఆశీర్వదించుట వలన కుటుంబములుగా నేర్పరచబడి పిల్లలను కలిగి వారిని దేవుని మహిమార్థమును మన ప్రభువైన యేసుక్రీస్తు నందలి ప్రేమ, జ్ఞానములయందును, పెంచబడునట్లు వివాహము ఏర్పర్చబడినది.

2. వివాహమును గురించిన తలంపు నరజాతిలో సహజమైన తలంపుగా కనబడుచున్నది. ఇది బైబిలులోని వాక్యమునకనుగుణ్యముగా నున్నది. పాపమువలన వివాహమునకు కొంతవరకు భంగము కలిగినను, గౌరవబుద్ధి తొలుగలేదు. ఇట్టి గౌరవ బుద్ధి కలిగియుండుటను బట్టి ఇది ఏర్పడియున్నది.

3. ఒకరికన్న ఇద్దరుండుటమేలును, బలమునైయున్నది. దేహాత్మల విషయముల యందు ఏకమై, ఒకరికొకరు తోడై, ఒకే ఆరాధన, ఒకే విశ్వాసము, ఒకే నిరీక్షణ కలిగి సంతోషముగా జీవించుటకై, దేవుడు తన కృప చొప్పున నియమించుటను బట్టి ఇది ఏర్పడియున్నది.

4. ఆరాధన అనంతరము పుస్తకములో తమ పేర్లను వ్రాయుటను బట్టి, భూమిమీదనున్న భక్తుల కుటుంబములో వీరి కుటుంబముకూడ ఒకటిగా నియమించుటకు ఇది ఏర్పడియున్నది.

## వివాహము

బో : దేవుని సన్నిధియందు నిలిచియున్న వీరిద్దరు పరిశుద్ధ స్థితిలో జతపరచబడుటకు వచ్చియున్నారు. కాబట్టి ఇక్కడ నున్నవారిలో ఎవరికైనా వీరు వివాహమాడరాదని న్యాయసమ్మతమైన హేతువేదైన తెలిసియున్న పక్షమున దానిని ఇప్పుడు వెల్లడి చేయవలెను. ***లేని యెడల ఇకమీదట ఎప్పటికిని ఊరకుండవలెను.***

*(అభ్యంతరము లేకున్న, గురువు వివాహమాడనైయున్న వారితోఇట్లు చెప్పును)*

**బో :** దైవ నిర్ణయమునుబట్టి, సంఘధర్మము ననుసరించి, వివాహము చేసికొనుటకు వచ్చియున్న మీరు ఈ వివాహమువలన జత పరచబడకూడదని హేతువేదైన మీలో ఎవరికైన తెలిసియున్న పక్షమున, దానిని ఇప్పుడు ఒప్పుకొనవలయునని హృదయ రహస్యముల నెరిగిన సర్వశక్తిగల దేవుని సన్నిధానమున మీకు గట్టిగా ఆజ్ఞాపించు చున్నాను. ఎందుకనగా దేవుని వాక్య ప్రకారముగాక వేరు విధముగా ఎవరైనను జతపరచబడిన యెడల, అట్టి వివాహము దైవాశీర్వాదము పొందనేరదని మీరు బాగుగా గ్రహించవలసి యున్నది.

# ప్రార్థన

సర్వశక్తిమంతుడవును, నిరంతర మహిమాన్వితుడవైన దేవా! సమస్త ఆశీర్వాదములకు దాతా! సకలకాలములయందు సమస్త మానవులచేత స్తుతి, స్తోత్రములు పొందగలిగిన దేవా! ఈ వివాహ సమయమున నీ ప్రసన్నతను మాకనుగ్రహించి, **వివాహము చేసికొనుచున్న వీరిద్దరిపై నీ కృపావరములను కుమ్మరించుము.** ఈ నిర్ణయము చొప్పున వీరిద్దరును పరిశుద్ధ వివాహములో ప్రవేశించుచుండగా, ఒక నూతన కుటుంబముగా వీరిద్దరిని నీ యాత్మతో ప్రతిష్ఠించి, నీ మహిమార్థము శోభాయమానమగు క్రైస్తవ జీవితమునందు పెంపారజేయుము. నీవనుగ్రహించు సకల సుఖ సౌఖ్యములను కృతజ్ఞతతో అనుభవించుటకును, తమ విధికృత్యములను చక్కగా నిర్వహించుకొనుటకును, శ్రమలయందు ఓర్పుగలిగి సంసారిక జీవితమును క్రమముగా జరిగించు-కొనుటకును; నీ నడిపింపును, నీ ఆదరణను అనుగ్రహించుమని త్వరగా వచ్చుచున్న క్రీస్తు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

*(గురువు పురుషుని ఇట్లు అడుగవలెను)*

**బో** : (వరుని పేరు)............దేవుని నిర్ణయము చొప్పున ***పరిశుద్ధ వివాహస్థితిలో కూడియుండుటకు*** ఈ స్త్రీని స్వీకరింతువా? ఈమెను ప్రేమించి, ఆదరించి, సుఖ దుఃఖములయందు కాపాడి బ్రతుకు కాలమంతయు ఈమెనే హత్తుకొని యుందువా?

**పురుషుడు :** ఉందును.

*(గురువు స్త్రీని ఇట్లు అడుగవలెను)*

**బో :** (వధువు పేరు)............దేవుని నిర్ణయము చొప్పున **పరిశుద్ధ వివాహస్థితిలో కూడియుండుటకు** ఈ పురుషుని స్వీకరింతువా? ఈయనకు లోబడి, ప్రేమించి, ఆదరించి, ఘనపరచి, సుఖదుఃఖములయందు కాపాడి, బ్రతుకు కాలమంతయు ఈయననే హత్తుకొని యుందువా?

**స్త్రీ :** ఉందును.

(గురువు ఇట్లు చెప్పవలెను)

వివాహము చేసికొనుటకు ఈ స్త్రీని, ఈ పురుషునకు ఇచ్చువారెవరు?

(ఆ స్త్రీని వివాహార్థమై ఇచ్చెడి తండ్రి, లేక పోషకుడు ఆమె కుడిచేతిని, పెండ్లికుమారుని కుడిచేతికి ఒప్పగించవలెను.)

**పురుషుడు :** (పురుషుడు గురువు వెంబడి చెప్పవలసినది) .........అను నేను,................అను నిన్ను నా జీవితకాలమంతయు, దేవుని పరిశుద్ధ నిర్ణయము చొప్పున మేలుకైనను, కీడుకైనను; కలిమియందును, లేమియందును, ఆరోగ్యమందును, అనారోగ్యమందును; నిన్ను ప్రేమించి సంరక్షించుటకై, నా భార్యనుగా పెండ్లి చేసికొనుచున్నాను. ఈ చొప్పున జరిగింతునని ప్రమాణము చేయుచున్నాను.

(వారు తమ చేతులు విడిచిపెట్టిన తరువాత, స్త్రీ తనకుడిచేతితో పురుషుని కుడిచేతిని పట్టుకొని గురువువెంట చెప్పవలెను.)

**స్త్రీ :** ...........అను నేను,............అను నిన్ను నా జీవితకాలమంతయు, దేవుని పరిశుద్ధ నిర్ణయముచొప్పున మేలుకైనను, కీడుకైనను; కలిమియందును, లేమియందును, ఆరోగ్యమందును, అనారోగ్యమందును, నిన్ను ప్రేమించి సంరక్షించుటకై, నా భర్తనుగా పెండ్లి చేసికొనుచున్నాను. ఈ చొప్పున జరిగింతునని ప్రమాణము చేయుచున్నాను.

(అందరు నిలువబడి కీర్తన పాడవలెను)

*(గురువు మంగళసూత్రమును, లేక ఉంగరమును తీసికొని ప్రార్ధింపవలెను.)*

## ప్రార్ధన

**బో :** పరిశుద్ధుడవైన తండ్రీ! పై అలంకారముగానున్న ఈ మంగళ సూత్రము, (ఉంగరము) క్రీస్తువలన కలుగు నీతి ప్రవర్తనాలంకారము కలిగి, **తమ జీవితము అలంకరింపబడి,** తాము చేసిన ఒడంబడికలను, నీ యాజ్ఞలను నెరవేర్చుటకై, **ఎప్పుడును జ్ఞాపకము చేయు సాధనముగా నుండునట్లు ఆశీర్వదించుమని,** పరిపాలించుటకై అలంకరింపబడిన వధువు సంఘముతో రానైయున్న క్రీస్తు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

(పురుషుడు మంగళ సూత్రమును స్త్రీ మెడలో కట్టుచు ఇట్లు చెప్పవలెను). (లేక ఉంగరము)

**పురుషుడు :** నా ఆస్తి యంతటిలో నిన్ను పాలి భాగస్తురాలినిగా చేసికొని, ఎల్లప్పుడు ప్రేమించి, నమ్మకమైన భర్తగా నుందునను వాగ్ధానమునకు సూచనగా, ఈ మంగళసూత్రమును, తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు పేరట కట్టుచున్నాను. **అంగీకరించుము.**

**స్త్రీ :** 'అంగీకరించుచున్నాను' అని చెప్పవలెను.

(పురుషుడు స్త్రీ కైనను, స్త్రీ పురుషునికైనను ఉంగరమును ధరింప-జేయునప్పుడు ఇట్లు చెప్పవలెను)

వివాహ సంబంధమైన ప్రేమకును, నమ్మకమునకును సూచనగా, ఈ ఉంగరమును అంగీకరించుము.

(వధూవరులు మోకాళ్ళూనుదురు. సభ నిలిచియుండును. గురువు ఇట్లు ప్రార్ధించును.)

**బో:** ప్రేమా స్వరూపుడవును, కృపాభరితుడవునైన ఓ దేవా! పర, *భూలోకమందలి సకల కుటుంబములను ఏకకుటుంబముగా పిలిచి, పోషించి, పరిపాలించుచున్న ప్రభువా!* వీరిపై నీ నిండైన దీవెనలను కుమ్మరించుము. వీరిద్దరికి అవసరమైన సకల కృపావరముల ననుగ్రహించి, వీరిరువురు చేసికొనిన ప్రమాణములను మీరకుండు- నట్లును, కావలసిన నిష్కళంకమైన ప్రేమతో వర్ధిల్లునట్లును కటాక్షించుము. మరియు వీరు నీతి సమాధానములను అనుసరించి జీవిత కాలమంతయు, కృతజ్ఞతతో నిన్ను సేవించుచు **సకల విధముల అభివృద్ధి పొందునట్లు** వీరిని దీవించుమని మహిమా స్వరూపివైన యేసుప్రభువు పేరట వేడుకొనుచున్నాము. ఆమేన్.

*(గురువు వారి కుడిచేతులను కలిపి ఇట్లు చెప్పవలెను)*

**బో :** .............ను...........ను పరిశుద్ధ వివాహమునకు సమ్మతించి, ఆ సంగతి దేవుని సముఖమందును, ఈ సభ ఎదుటను ప్రచురణపరచి ఒకరికొకరు తమ ప్రమాణములను చేసియున్నారు. గనుక ***దేవుని నిర్ణయమును బట్టియు,*** సంఘమువలనను, ప్రభుత్వమువలనను, నా కియ్యబడిన అధికారమును బట్టియు, వీరిరువురును భార్యభర్తలని తండ్రియొక్కయు, కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామమందు ప్రకటించుచున్నాను.

**బో :** *కాబట్టి దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుచేయకూడదు.*

## ప్రార్థన

మహిమ రూపుడవైన తండ్రీ! మహిమ మేఘముమీద వచ్చుచున్న మా ప్రియ ప్రభువు రాకకొరకు సిద్ధపడి, మేఘములో ఆయనను కలిసికొనుటకు ***ఈ వధూవరులు నిత్యము నీ సన్నిధిని ఉండునట్లుగా ఆశీర్వదింపుము.*** ప్రభువా! వీరు ఒకరికొకరు చేసికొనిన ఒడంబడికలను నెరవేర్చి, ఒకరినొకరు

ప్రేమించుకొనుచు, నీ పరిశుద్ధ ప్రేమలో పరిపూర్ణులగునట్లు నీ యాత్మతో నింపి, నీ యాజ్ఞల ప్రకారము నమ్మకముగా నడుచుకొనునట్లు, నీ మహిమైశ్వర్యములో పాలుపొందునట్లును కృప ననుగ్రహింపుమని, పెండ్లికుమారుడుగా రానైయున్న క్రీస్తు యేసు ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

*(వధూవరులు మోకరించియుండగా గురువులందరు వారిపై తమ చేతులనుంచి దీవించవలెను.)*

దీవెన : పరిశుద్ధుడైన దేవుడు, మహిమగల ప్రభువైన దేవుడు, సమస్త కృపావరములకు దాతయైన దేవుడు, ఇహమందు సర్వసంపదలను, పరమందు మహిమభాగ్యమును మీకనుగ్రహించునుగాక! అన్నిటిలోను వివాహము ఘనమైనదని యున్నది. ***గనుక దంపతుల కుటుంబ జీవితము దైవభక్తి కలిగి, ఘనముగా వర్ధిల్లునట్లు*** సర్వశక్తిగల దేవుని దీవెన కలుగునుగాక!

## ప్రభువు రాత్రి భోజనము

యోహాను 6:55-57.

ప్రార్థన:- జీవాహారమైయున్న ప్రభువా! నీ పావన శరీర రక్తములు పుచ్చుకొనుట వలన కలుగు పాపపరిహారమును, స్వస్థత కార్యమును, నీతో చనువుగల సహవాసమును, నీ స్వరూప సౌందర్యమును; మానవ మరణము మరణమైయుండక మోక్షమునకు మార్గమైయుండు స్థితియును, సజీవముగా రెండవరాకడలో వెళ్ళు దీవెనయును వీరికి దయచేయుము. ఈ సంస్కారపు విందు ననుభవించుచున్న వీరికి నీ మోక్షలోకపు విందులో పాలుపొందు కృపయు దయచేయుము. ఆమేన్.

***(వధూవరులకు ప్రభువు శరీర రక్తములను ఇయ్యవలెను)***

# దీవెన

ఈ పెండ్లిలో పాలుపొందిన వీరు, నీ శరీర రక్తముల విందులో పాలుపొంది, పరమందు జరుగు గొర్రెపిల్ల పెండ్లి విందులో పాలు పొందునట్లు దీవించుము.

మన ప్రభువైన యేసుయొక్క పరిశుద్ధ శరీరమును, ఆయన అమూల్యమైన రక్తమును, మిమ్మును పరిశుద్ధపరచి, ఆయన మహిమ రూపమును మీకిచ్చి రెండవ రాకకును, అనంత జీవనమునకును, మిమ్మును సిద్ధపరచునుగాక! ఆమేన్.

(అందరు నిలువబడి యుండగా)

తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును; ఆదియందు, ఇప్పుడు, ఎల్లప్పుడు యుగయుగములయందు ఉండునట్లు మహిమ కలుగునుగాక! ఆమేన్.

**బోధకుడు :** నీ వాక్యము నా పాదములకు దీపమును, నా త్రోవకు వెలుగునై యున్నది.

**సంఘము :** నీ వాక్యము నన్ను బ్రతికించియున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది.

**బో :** ప్రభువు మీకు తోడైయుండును గాక!

**సం :** ప్రభువు మిమ్మును ఆశీర్వదించును గాక!

**బో :** ప్రభువా! మమ్మును కనికరించి మాకు కనబడుము.

**సం :** ప్రభువా! మమ్మును కనికరించి మాతో మాట్లాడుము.

**బో :** ప్రభువా! నీవే మా దాగుచోటు.

**సం :** ప్రభువా! నీ సన్నిధిచాటున నీవే మమ్మును దాయుము

**బో :** ప్రభువు త్వరగా వచ్చుచున్నారు.

**సం :** ప్రభువైన యేసూ! రమ్ము.

## ముగింపు ప్రార్థన

పరలోకపుతండ్రీ! ఈ వధూవరులు తమ బ్రతుకుకాలమంతయు కృపాక్షేమములు గలవారై జీవించుటకు, నీ పావన రెక్కల క్రింద కాపాడుము. ప్రభువా! వీరి శరీర జీవితమునకు, మహిమజీవితమునకు అవసరమైన సకల సదుపాయములు దయచేయుము. ***నీ పావనాత్మతో నింపి నీ చిత్తమును బయలుపరచుటకు, నీవే కనబడి మాట్లాడుము. భూలోకపు భక్తులతోను, పరలోకపు భక్తులతోను, దూతలతోను, నీతోను, సహవాసముగలవారై జీవించు కృప దయచేయుము.*** వీరి గృహములో నున్న సమస్త వస్తువులు, పరలోకపు గృహమునందున్న మహిమను జ్ఞాపకముచేయు గృహమై యుండునట్లు దీవించుము. వీరి గృహమునకు నీవే యధిపతివైయుండుము. గృహమందు జరుగు విందు, పరలోకపు విందును జ్ఞప్తికి తెచ్చునట్లు దీవించుము. వీరి కుటుంబములో జరుగు ప్రార్థనాస్తుతులు, వీరు చేయు ధర్మకార్యములు, నీ సన్నిధిని జ్ఞాపకముగా నుండునట్లు అంగీకరించుము. వీరితో ఎల్లప్పుడు నీవు ఉండుము. ***వీరికి కలుగు కష్టములలో నీవు తోడ్పడి, వీరికిని వీరితోనున్న వారికిని, నిన్ను బయలుపరచుకొనుము.*** వీరిలోని లోపములను పరిహరింపుము. ఇద్దరు ఒక్కరుగాను, ఒకరు ఇద్దరుగాను ప్రేమించుకొనుచు, నీతో కలసి జీవించునట్లు ఆశీర్వదించుము. నీ వాక్యమందు వీరిని పెంచుము. నీ రాకడకొరకు సిద్ధపరచుము. ***నీ వాక్యము ఉపదేశించుటకును, నీకు సాక్షులుగా నుండుటకును, వీరిని ఆయత్తపరచుము. బిడ్డలను దయచేయుము.*** వీరిని నీ భయమునందును, భక్తియందును పెంచునట్లు నీ కృప దయచేయుము. వీరిని ఏ **కృపగల ఉద్దేశముతో లోకమునకు పంపినావో ఆ నీ ఉద్దేశమును**

Bible Mission HQ Guntur

***నెరవేర్చగలస్థితి దయచేయుము.*** జీవితాంతమునందు మోక్షభాగ్యము నను(గ్రహింపుము. మా ఈ మనవులను, ప్రార్థనలను, స్తుతులను ఆలకించి, అంగీకరించుమని త్వరగా మహిమ మేఘములోనికి పెండ్లికుమారుడుగా రానైయున్న క్రీస్తు ప్రభువు ద్వారా వేడుకొనుచున్నాము.

## పరలోక ప్రార్థన

## దీవెన

ప్రభువు మిమ్మును ఆశీర్వదించి, మిమ్మును కాపాడునుగాక! ప్రభువు మీకు తన సన్నిధిని ప్రకాశింపజేసి, మిమ్మును కరుణించునుగాక! ప్రభువు మీమీద తన సన్నిధికాంతి ఉదయింపజేసి, మీకు సమాధానము కలుగజేయునుగాక! ఆమేన్.

ఆది 2:18-24; 24అధ్యా; కీర్తన 23అధ్యా॥ సామె. 10:22; 12:4; 18:22; 31:10; మత్తయి 19:3-6; యోహాను 2:1-11; I తిమోతి 4:4; 5:6-17; ఎఫెసీ 5:22-23; కొలస్స 3:18,19; ప్రకటన 19:6-9; I పేతురు 3:1-7.

# గృహప్రవేశారాధన

తెలుగు క్రైస్తవ కీర్తనలలోనుండి 8వ కీర్తన పాడవలెను.

తండ్రినుండియు, కుమారునినుండియు, పరిశుద్ధాత్మనుండియు కృపా సమాధానములు మీకు కలుగునుగాక!

దేవా! నా ప్రభువా! మేలు దయచేయుదునని నీవు నీ దాసుడనైన నాకు సెలవిచ్చియున్నావు. ***నీవు దేవుడవు గనుక నీ మాట సత్యము.*** దయచేసి నీ దాసుడనైన నా కుటుంబము నిత్యము నీ సన్నిధిని ఉండునట్లుగా దానిని ఆశీర్వదించుము. దేవా! ప్రభువా! నీవు సెలవిచ్చియున్నావు. నీ ఆశీర్వాదము నొంది, నా కుటుంబము నిత్యము ఆశీర్వదింపబడుగాక! II సమూ. 7:28-29.

**స్తుతి:-** పరలోకపు తండ్రీ! నీ పావన లక్షణరూపమునకై స్తోత్రములు. మమ్మును, మాకు కలిగిన సమస్తమును కాచే దూతలను; నీ ప్రేమరూపమును, నీ దివ్య కార్యక్రమమును చూపు గ్రంథము నిమిత్తము నీకు అనేక స్తుతులు.

మా నివాసము నిమిత్తము భూమిని ఇల్లుగాను, ఆకాశమును పై కప్పుగాను, సూర్య చంద్ర నక్షత్రాదులను దీపములుగాను, సమస్త ఈవులను మా కొరకు సృజించిన నీకు ప్రణుతులు. నీ హృదయవాసియైన నీ ప్రియకుమారుడైన మా ప్రభువైన క్రీస్తును లోకమునకు పంపి, మమ్మును రక్షించిన నీకు నుతులు. నీ పావనాత్మను మాలో ఉంచి, మమ్మును శుద్ధిచేసి, ***నీ కుమారునితోపాటు నీయందు నిత్యము నివసించుటకు*** మా కిచ్చిన మోక్షనివాసము నిమిత్తము స్తోత్రములు. దానకర్తవైన తండ్రీ! ఈ

దీనకుటుంబము నీ దీవెన కలిగి నివసించుటకు, నీవిచ్చిన ఈ గృహము నిమిత్తము స్తుతులు.

**బో :** ప్రభువైన యేసూ రమ్ము!

**సం :** ప్రభువా! మాతో ఉండుము.

**బో :** నీ లోగిట నీ భార్య ఫలించు ద్రాక్షావల్లివలె నుండురు.

**సం :** నీ భోజనపు బల్లచుట్టు నీ పిల్లలు ఒలీవ మొక్కలవలె నుందురు.

**కుటుంబము :** నేనును, నా ఇంటివారును ప్రభువును సేవించెదము.

**ప్రార్థన :-** దేవా! తండ్రీ! నీ ప్రేమనుబట్టి నీవును, నీ ప్రియ కుమారుడైన మా ప్రభువైన క్రీస్తును, మా వద్దకు వచ్చి, ***మా వద్ద నివాసము చేతుము అని పలికిన ప్రభువా! మాలో మా గృహములో నివసించుమని*** యేసు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

## ప్రార్థన

**బో :** త్రియేకుడవైన తండ్రీ! నీ ముఖకాంతిని ఈ గృహముపైనను, ఈ గృహవాసులపైనను ప్రకాశింపజేయుము. మా కార్యక్రమములకు ఆదియు, అంతమునైయున్న ప్రభువా! నీవును, దూతలును, పరిశుద్ధులును మాతోనుండి దీవించుము. నీ కృపా సమాధానములు మాకు దయచేయుమని త్వరగా వచ్చుచున్న యేసునామములో వేడుకొనుచున్నాము. ఆమేన్.

**బో :** భూమియు, దాని సంపూర్ణతయు; లోకము, దాని నివాసులును దేవునివే.

**సం :** మహిమగల రాజు ప్రవేశించునట్లు మిమ్మును లేవనెత్తుకొనుడి.

ప్రార్థన:- దావీదు తాళపుచెవి గలిగిన ప్రభువా! పరలోక, పాతాళలోకపు ద్వారము తెరచిన నీవే, ***ఈ గృహద్వారమును తెరచి ఈ గృహవాసులతో ఉండుమని,*** సదాకాలము మీతోకూడా ఉన్నానని పలికిన క్రీస్తు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

(తలుపు తెరచుట)......... ఈ పేరునగల నూతన గృహద్వారములను, తండ్రి కుమార పరిశుద్ధాత్మ నామమున తెరచుచున్నాము.

తెలుగు క్రైస్తవ కీర్తన 70 (అందరూ పాడుచు లోపల ప్రవేశింతురు.)

ద్వితియో 6:4-13; లూకా 10:38-42; ప్రకటన 21:1-3.

## ప్రసంగము

సమర్పణ: బుద్ధి విజ్ఞానములు సర్వసంపదలుగల ప్రభువునకే, ఈ గృహమును సమర్పణ చేయుచున్నాము.

**బో :** ఈ గృహమునందు దేవుని వాక్యమునకును, క్రీస్తు ప్రభువునకును స్థానమిచ్చెదరా?

**కుటుంబము :** ఔను అలాగునే చేయుదుము.

**బో :** ప్రభువు రెండవరాకడకు సిద్ధపడుటకు అనుదినము దైవసన్నిధి కార్యక్రమము ఈ గృహమందు జరిగించెదరా?

కుటుంబము : అట్లే చేయుదుము.

## దీవెనలు

1. ప్రభువుయొక్క మహిమ కాంతి మీ మీదను, మీ గృహమందును, మీ కార్యములందును ప్రకాశించునుగాక!

2. ప్రభువుయొక్క వాత్సల్యత నూతన గృహవాసులైన మీకు ప్రతిదినమును నూతనముగానే కలుగుచుండునుగాక!

3. ప్రభువు ఇచ్చు ఇహ, పరసంబంధమైన సకల ఈవులతో వర్ధిల్లుదురు గాక!

4. ***మీకు కలుగు శ్రమలే, ప్రభువుతోగల మహిమానుభవమును అందరికిని కనపరచును గాక!***

5. మన ప్రభువైన క్రీస్తుయొక్క దివ్యస్వరూపము మీ హృదయములలో ప్రతిష్టింపబడునుగాక!

6. మన ప్రభువు మీతో ఈ గృహవాసియైయుండి, మీకు కనబడుచు, మీతో మాట్లాడుచుండునుగాక!

7. ఈ గృహవాసులైన మీరు ప్రభువుయొక్క మహిమ రాకడకు సిద్ధపడి, పరమందున్న నూతన యెరూషలేము యొక్క నివాసులగుదురు గాక!

ప్రార్థన:- త్రియేకుడవైన తండ్రీ! నీ యాశీర్వాదము, నీ కరుణ, నీ శాంతి ఈ గృహవాసులపై నుంచుము. వీరిని, వీరికి కలిగిన సమస్తమును కాయుటకు నీ కావలి దూతలనుంచుము. ***అన్నిటికంటె ఉన్నతమైనదియు, అవసరమై-నదియునైన నీ సన్నిధిని వీరి గృహమందునుంచుము.*** వీరికి కనబడుము. వీరితో మాటలాడుము. వీరికి పరిశుద్ధుల సహవాసమును అనుగ్రహించుము. నీ పరిశుద్ధాత్మను వీరిలోనుంచి నీ కృపావరములను దయచేయుము. ***వీరి గృహమే చిన్న మోక్షమయ్యుండునట్లుగా దీవించుము.*** వీరి గృహములోనికి వచ్చు వారికి, వీరి ప్రార్థనలవలనను, వీరి అంతరంగ జీవితానుభవమువలనను, వీరి వాక్యానుభవమువలనను, వీరి పరిచర్యవలనను మేలు కలిగించుము.

వీరి శరీర జీవితమునకు, ఆత్మీయ జీవితమునకు, మహిమ జీవితమునకు అవసరమైన సమస్త ఈవులను దయచేయుము. వీరికి కలిగిన బిడ్డలకు, ఆరోగ్యము ఆయుష్కాలము, జ్ఞానము, విద్య, ఉద్యోగము, దైవభక్తిని అనుగ్రహించుము. ఈ గృహ వాసులను సాతానునుండి, పిశాచములనుండి, పాపశాపములనుండి, శత్రుభీతినుండి, అంటువ్యాధులనుండి; విషపురుగులు, విష జంతువులనుండి, అపాయములు, అజ్ఞానము నుండి, ఆయా విధములైన కీడులన్నిటినుండి తప్పించుము. మరియు ఈ గృహవాసుల నందరిని నీ రాకకొరకు సిద్ధపరచుము. వీరి జీవితాంతమునందు మహిమ మోక్షములోనికి చేర్చుకొనుము. ఈ మా ప్రార్థనలను త్వరగా రానైయున్న యేసు నామమున వేడుకొనుచున్నాము. ఆమేన్.

# మృతుల భూస్థాపన క్రమము

(క్రైస్తవ విశ్వాసమునందు మృతి నొందినవారిని భూస్థాపన చేయునప్పుడు మాత్రమే ఈ క్రమమును ఉపయోగింపవలెను).

(సంఘములో ఎవరైన చనిపోయిన యెడల సంఘాధ్యక్షునికి తెలియజేయ-వలయును. క్రైస్తవులెవరైన మృతి నొందినప్పుడు చావు గంట కొట్టించవలెను).

**(ఈ క్రమము భూస్థాపనకు పూర్వము ఆలయమునొద్దగాని, ఇంటియొద్దగాని ఉపయోగించవచ్చును)**

గురువు ప్రాకారద్వారమునొద్ద శవము నెదుర్కొని, దానికి ముందుగా దేవాలయము లోనికి వెళ్ళుచు, ఈ క్రింది వచనములలో ఒకటిగాని, కొన్నిగాని చెప్పవచ్చును. లేక కీర్తన పాడవచ్చును.

## బోధకుడు

పునరుత్థానమును, జీవమును నేనే నా యందు విశ్వాసముంచువాడు చనిపోయినను బ్రదుకును; ***బ్రతికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికిని చనిపోడు.*** (యోహాను 11:25,26)

జీవమార్గమును నీవు నాకు తెలియజేసెదవు. నీ సన్నిధిని సంపూర్ణ సంతోషము కలదు. నీ కుడిచేతిలో నిత్యము సుఖములు కలవు. (కీర్తన 16:11)

ఆదామునందు అందరు ఏలాగు మృతిపొందుచున్నారో, అలాగుననే క్రీస్తునందు అందరు బ్రతికింపబడుదురు. (1కొరింథీ 15:22)

నీతిమంతులు నశించుట చూచి ఎవరును దానిని మనస్సున పెట్టరు. భక్తులైనవారు తీసికొనిపోబడుచున్నారు. కీడు చూడకుండ నీతిమంతులు కొనిపోబడుచున్నారని ఎవనికిని తోచదు. (యెషయా 57:1)

యేసు మృతిపొంది తిరిగి లేచెనని మనము నమ్మినయెడల, అదే ప్రకారము యేసునందు నిద్రించినవారిని దేవుడాయనతో కూడ వెంటబెట్టుకొని వచ్చును. (I థెస్స 4:14)

ఈ చిన్నవారిలో ఒకనినైనను తృణీకరింపకుండ చూచుకొనుడి. వీరి దూతలు, పరలోకమందున్న నా తండ్రి ముఖమును ఎల్లప్పుడు పరలోకమందు చూచుచుందురని మీతో చెప్పుచున్నాను. (మత్తయి 18:10)

**కీర్తన :** మరణము కాదీ బాధ (తెలుగు క్రైస్తవ కీర్తనలలో 118)

వేదపఠనము : పా॥ని॥ దా.కీర్తన 23వ అధ్యాయము; క్రొ॥ని॥ యోహాను 11:21-27. పత్రిక పాఠము. 1థెస్స. 4:13-18.

## ప్రసంగము

**బో :** తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును మహిమ కలుగును గాక!

**సం :** ఆదియందు ఇప్పుడు ఎల్లప్పుడు యుగయుగములందు ఉండునట్లు మహిమ కలుగునుగాక!

**బో :** ప్రభువు మీకు తోడై యుండును గాక!

**సం :** మీ యాత్మకును తోడై యుండును గాక!

**బో :** ప్రభువా! మమ్మును కనికరించుము.

**సం :** క్రీస్తూ! మమ్మును కనికరించుము.

**బో :** ఇదిగో నేను త్వరగా వచ్చుచున్నాను.

**సం :** ప్రభువైన యేసూ! రమ్ము.

# ప్రార్థన

పరలోకపు తండ్రీ! భూలోకమందున్న విశ్వాసి మరణించుట, నీయందు విశ్రాంతి పొందుటయేగాని మరణముగా నుండదని, నీ భక్తుల యొక్క అనుభవములో నేర్పినావు. గనుక వందనములు. ఈ లోకములో పాపము, వ్యాధి, కష్టములు, బాధ, కన్నీరున్నందున నిజ విశ్రాంతిలేని మానవునికి, నీ చేతులందు నీ రొమ్మున ఆనుకొని, నిజ విశ్రాంతి పొందుటకై నీయొద్దకు చేర్చిన నీకు వందనములు. నీతోను, పరలోకపు దూతలతోను, నరలోకపు పరిశుద్ధులతోను, భూలోకపు విశ్వాసులతోను స్వేచ్ఛగా తిరుగుటకై పాపమను త్రాళ్లను తెంపి, నీయొద్ద చేర్చిన నీకు నుతులు. మరియు నీ యందు నిద్రించుటవలన నరకమను నిత్యమరణమునుండి తప్పింపబడి, మా ప్రభువైన క్రీస్తుతోకూడ నిత్యము పరిపాలించు కృప ననుగ్రహించిన నీకు వందనములు. మా స్తుతులు నిత్య జీవాధిపతియైన క్రీస్తు ప్రభువు ద్వారా చెల్లించుచున్నాము. ఆమేన్.

పరిశుద్ధుడవైన ఓ తండ్రీ! పరలోకపు పరిశుద్ధులకును, భూలోకపు విశ్వాసులకును, సహవాసము కలిగించిన నీకు స్తోత్రములు. పరమందున్న పరిశుద్ధులు నీతోనున్నారు. భూమిమీద నున్న విశ్వాసులుకూడ నీతోనే ఉన్నారు. భూమిమీదనున్న విశ్వాసుల జీవము మా ప్రభువైన క్రీస్తుతో నీయందు దాచబడియున్నదని కొలస్స: 3:3లో వ్రాయించినావు. గనుక నీవద్దనున్న పరలోకపు పరిశుద్ధులును, భూలోకపు విశ్వాసులును నీతోనేయున్నారు. గనుక స్తోత్రము. ఇట్టి సహవాసమును, మా ప్రభువైన క్రీస్తు రూపాంతర సమయమందు పరిశుద్ధులైన మోషే, ఏలియాలు వచ్చి మాట్లాడుట, భూమిమీదనున్న అపోస్తలులు చూచియున్నారు. ఈ చరిత్రవల్ల భూమిమీదనున్న విశ్వాసులకును,

నీవద్దనున్న పరిశుద్ధులకును సహవాసము ఉన్నట్లు కనబడుచున్నది. అందుకే క్రైస్తవ సంఘ విశ్వాస ప్రమాణములో పరిశుద్ధుల సహవాసమును నమ్ముచున్నామనియున్నది. గనుక ప్రభువా! నీయందు నిద్రించువారు నీతోనున్నను, నీవు మాతో నున్నావు గనుక వారు మాతో నున్నారు. ఉన్నవారు రూపాంతరమప్పుడు అపోస్తలులకు కనబడినట్లు మాకును కనబడి, మాతో మాట్లాడుదురు. ఇట్టి విశ్వాసానుభవమునందు మమ్మును పెంచుమని త్వరగా భూలోక, పరలోక సంఘములను మేఘములో ఆకర్షింపనైయున్న క్రీస్తుప్రభువుద్వారా వేడుకొనుచున్నాము.

కృపానిధివైన తండ్రీ! చనిపోయిన తన కుమారుని నిమిత్తము దుఃఖించుచున్న విధవరాలిని మా ప్రభువు ఓదార్చినట్లు, దుఃఖించుచున్న వీరిని నీవే ఓదార్చుమని రక్షణ కర్తయైన క్రీస్తుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

## పరలోక ప్రార్థన - దీవెన

## సమాధియొద్ద జరుపబడు ఆరాధన

(సమాధుల దొడ్డి ద్వారముగుండా ప్రవేశించుచు కీర్తన పాడుటగాని, ఈ క్రింది వచనములలో కొన్నిగాని చెప్పవచ్చును.)

**బో :** మృతులు దేవుని కుమారుని శబ్దము విను ఘడియ వచ్చుచున్నది, ***ఇప్పుడే వచ్చియున్నది;*** దానిని వినువారు జీవింతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. (యోహాను 5:25)

...ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్నవారందరు ఆయన శబ్దము విని, మేలుచేసినవారు జీవ పునరుత్థానమునకును; కీడుచేసినవారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు. (యోహాను 5:28,29)

మృతులలో నుండి యేసును లేపిన వాని ఆత్మ మీలో నివసించినయెడల, మృతులలోనుండి క్రీస్తుయేసును లేపినవాడు, చావునకు లోనైన మీ శరీరములనుకూడ మీలో నివసించుచున్న తన ఆత్మద్వారా జీవింపజేయును (రోమా 8:11).

## ప్రార్థన

పరలోకపు తండ్రీ! మానవుని అపరాధమువలన మంటినుండి తీయబడిన మనిషి మన్నై పోవునని ఆదాముతో పలికియున్నావు. ఆదామునందు అందరికి మరణము ఏలాగు సంభవించెనో, మా ప్రభువైన క్రీస్తునందు అందరు పునరుత్థానులగుటకు ఆయనను ఈ లోకమునకు పంపి, మా పాపమునకు ఆయన శరీరమందు శిక్ష విధించి, మా మరణమును కొట్టివేసి, నిత్యజీవము గలవారినిగా మార్చిన నీ కృపకై స్తుతులు. మహిమగల తండ్రీ! దావీదు– 'మన్ను నిన్ను స్తుతించునా' అని పలికెను. అయినను నీవు మన్నై మానవుని శరీరమును, నీ కుమారుని మహిమ రాకవలన మహిమ శరీరముగా మార్చిన నీకు స్తోత్రములు.

*(శవమును సమాధిలోనికి దింపుచుండగా, ఒక చిన్న కీర్తన లేక ఒక సంగీతము పాడవచ్చును.)*

**బో :** ఆర్భాటముతోను, ప్రధానదూత శబ్దముతోను, దేవుని బూరతోను, పరలోకము నుండి ప్రభువు దిగివచ్చును. క్రీస్తునందుండి మృతులైనవారు మొదట లేతురు. ఆ మీదట సజీవులమై నిలిచియుండు మనము వారితోకూడ ఏకముగా, ప్రభువు నెదుర్కొనుటకు ఆకాశమండలమునకు మేఘములమీద కొనిపోబడుదుము. కాగా మనము సదాకాలము ప్రభువుతోకూడ నుందుము. (1థెస్స. 4:16–17)

**(శవముపై కొద్ది మట్టి వేయుచు సేవకుడు ఇట్లు చెప్పవలెను.)**

సర్వశక్తిగల దేవుడు తన అధిక కృపచేత ప్రభువైన **క్రీస్తునందు నిద్రించుచున్న** మన ప్రియ సహోదరుని (లేక సహోదరి) ఆత్మను, ఆయన సాన్నిధ్యమైన పరదైసునందు చేర్చుకొనెను. గనుక మన ప్రభువైన యేసుక్రీస్తు మహిమ రాకడయందు పాలుపొందుటకై పునరుత్థానము కలుగునను నిశ్చయమును, దృఢమైన విశ్వాస నిరీక్షణయును గలవారమై, ఈయన (లేక ఈమె) శరీరమును మంటికి మన్నుగాను, బూడిదకు బూడిదగాను, దుమ్ముకు దుమ్ముగాను భూమికి అప్పగించుచున్నాను.

**బో :** సమస్తమును తనకు లోపరచుకొనజాలిన శక్తినిబట్టి, ఆయన మన దీన శరీరమును తన మహిమగల శరీరమునకు సమరూపము గలదానిగా మార్చును. (ఫిలిప్పీ 3:21)

ఇదిగో మీకు ఒక మర్మము తెలుపుచున్నాను. మనమందరము నిద్రించముగాని నిమిషములో, ఒక రెప్పపాటున, కడబూర మ్రోగగానే మనమందరము మార్పు పొందుదుము. బూర మ్రోగును. అప్పుడు మృతులు అక్షయులుగా లేపబడుదురు. మనము మార్పు పొందుదుము. క్షయమైన ఈ శరీరము అక్షయతను ధరించుకొనవలసి యున్నది; మర్త్యమైన ఈ శరీరము అమర్త్యతను ధరించుకొనవలసియున్నది. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొనినప్పుడు ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించుకొనినప్పుడు, 'విజయమందు మరణము మ్రింగివేయబడెను' అని వ్రాయబడిన వాక్యము నెరవేరును. (I కొరింథీ. 15:51-54)

## ముగింపు ప్రార్థన

జీవాధిపతివైన తండ్రీ! మానవుని శరీర ప్రాణాత్మలను నీవు పావనపరచి, నీ కుమారుని మహిమ రాకడలో పాలుపొందునట్లు దీవెన దయచేసిన నీకు స్తుతులు. ఆయనతో భూమిమీద వెయ్యేండ్లు పరిపాలనచేయు అధికారము ననుగ్రహించిన నీకు నుతులు. నీవే ఆలయమైయుండి, గొర్రెపిల్లయైన క్రీస్తే దీపమై యుండిన మోక్షమందు నిరంతరము జీవించు కృప దయచేసిన నీకు వందనములు. ఇట్టి ధన్యకరమైనస్థితి మా అందరకును దయచేయుమని రారాజుగా వచ్చుచున్న క్రీస్తు ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

## పరలోక ప్రార్థన - దీవెన

కీర్తన 90:1–3; ద్వితీ. 33:27; యోబు 19:25,26; కీర్తన 15:1–52; కీర్తన 23; కీర్తనలు 116:15; యెషయా 26:19; 57:1; దానియేలు 12:2; సామెతలు 10:7; లూకా 14:14; యోహాను 5:19–29; 11:21:27; 14:1–6; రోమా 6:5; 8:11; 14:8,9; 1కొరింథీ 15; 2కొరింథీ 4:15,16; 5:1–10; ఫిలిప్పీ 3:20–21; కొలస్స. 3:3; 1థెస్స. 4:13–18; 5:23; ప్రకటన 7:9–17; 21:3–7; లూకా 20:36.

# వార బోధిని

## (బైబిలు మిషను బోధించు ప్రత్యేక బోధలు)

## బాప్తిస్మము

మత గురువు ఉదకముతోనిచ్చు బాప్తిస్మము, ఆత్మీయ జీవిత జన్మస్నానమై యున్నది. ఇది తండ్రి, కుమార, పరిశుద్ధాత్మల నామమందు పొందు బాప్తిస్మము గనుక ఆయన మన తండ్రి. మనమాయన బిడ్డలము. ఇట్టి జన్మ బంధుత్వము బాప్తిస్మమువలన ఏర్పడును. బైబిలులో బాప్తిస్మమనియున్నది గాని పద్ధతిలేదు. బాప్తిస్మమిచ్చు గురువు, క్రీస్తునందు విశ్వసించి పొందు వ్యక్తికి, అట్టి సమయమున పరిమితిలేని నీటిని వినియోగించి, త్రిత్వనామమున ఇచ్చునదియే బాప్తిస్మము. ***గనుక ముంచినను, పోసినను బాప్తిస్మమే.*** బాప్తిస్మము ఒక్కటే అని పౌలు ఎఫెసీ 4:5లో వ్రాసిన ప్రకారము, ఎవరు ఎప్పుడు, ఎవరివలన అనగా ఏ సంఘములో బాప్తిస్మము పొందినను అది బాప్తిస్మమే. మత్తయి 28:19; 3:11; అపో.కార్య. 1:5; గలతీ. 3:27.

## పరిశుద్ధాత్మ బాప్తిస్మము

అనగా క్రీస్తుప్రభువు నీళ్ళతోకాక పరిశుద్ధాత్మతో ఇచ్చు స్నానమైయున్నది. ఇది ఆత్మీయ జీవనముయొక్కయు, ఆ జీవనపరుని సువార్త సేవయొక్కయు, వృద్ధిని కలిగించు సాధనమైయున్నది. నీటి బాప్తిస్మము వలన క్రైస్తవ సంఘ సభ్యత్వము కలుగును. పరిశుద్ధాత్మ బాప్తిస్మము వలన పరలోక సభ్యత్వము లభించును. యోహాను 3:5; యోవేలు 2:28,29; అపో.కార్య. 1:5; 2వ అధ్యాయము.

## స్వర్గీయ భాష

ఇది విశ్వాసికి పరిశుద్ధాత్మ ఇచ్చు ఒక వరము. గనుక దీనిని నిషేధింపరాదు. దీని అర్ధమును తెలుపుటకు ఒక వరమే. పరలోకము చేరబోవువారు ఈ భాషను నేర్చుకొందురు. ఇతర వరములనుగూర్చి బైబిలులో ఇంత వివరముగా వ్రాయబడలేదు.

I కొరి. 12:10; 13:1; 14:2; 39-40; మార్కు 16:17.

## ప్రవచనము

దైవాత్మావేశమువలన బైబిలు కాలపు ప్రవక్తలు, మూడు కాలములలోని సంగతులు ప్రజలకు చెప్పిరి. అవి గ్రంథములలో కూడ వ్రాసిరి. వారి వ్రాతలే ప్రవచనములు. **ఇట్టి ప్రవచనవరము దేవుడు నేడును కొందరికి ఇచ్చుచున్నారు.** మరియొక విధమైన ప్రవచన వరమేదనగా, వ్రాయబడిన ప్రవచన వాక్యములను దైవాత్మ సహాయమువల్ల, బహు వివరముగా బోధించుట, ఇదికూడ దేవుడు నేడు కొందరికి ఇచ్చుచున్నారు. కొందరు- 'బైబిలు కాల ప్రవక్తలవంటి ప్రవక్తలు నేడు లేరు' అని చెప్పుచున్నారు. ఆ వరము బైబిలు కాలముతోనే ఆగిపోయినది అని వారు తలంచుచున్నారు. పాదురులే ప్రవక్తలని వారి తలంపు.

I కొరి 12:10; 14:39,40; II పేతురు 1:10,11.

## దశమభాగము

తమ రాబడిలో పదియవ వంతు గుడిలో సమర్పించుట యూదుల ఆజ్ఞాచారము. అయితే, అంతకన్న ఎక్కువ సమర్పించుట, మన అనుభవ ఆచారమై యుండకూడదా? మత్తయి 5:20; Iకొరి 16:2; IIకొరి 8:4; మలాకీ 3:10.

## ప్రత్యక్షతలు

**1. దర్శన ప్రత్యక్షత:-** దీనిలో విశ్వాసులకు అంతయు, అన్నియు కనబడవచ్చును. భూలోకము, పరలోకము, పాతాళలోకము, వాయుమండల లోకము ఈ మొదలైన స్థలములు, వానిలోని సమస్తము సమయానుకూలముగా కనబడవచ్చును. దీనినే దర్శనమందురు. ***దేవుడు, దూతలు, మహిమ కనబడిన సంతోషము.*** అపవిత్ర స్థానములు, భయంకర స్థానములు, అపాయము ఈ మొదలైనవి కనబడినప్పుడుకూడ సంతోషము కలుగవలసినదే! ఎందుకనగా అవి యున్నవి గనుక కనబడకపోవునా?

యెషయా 6అధ్యా. సంఖ్యా 12:8; అపో.కార్య. 9:12; 9:27; 10:3-4; 16:9-10; ఎఫెసీ 3:3.

మత్తయి 17:3; యోహాను 4:7; లూకా 10:18-19.

## స్వర ప్రత్యక్షత

దీనిలో పైనుదహరించిన వారిలో ఎవరో ఒకరు మాటలాడిన మాటలు వినబడును. ముఖ్యముగా ప్రభువుయొక్క, పరిశుద్ధులయొక్క మాటలు వినబడును. 'నా గొర్రెలు నా శబ్దమును వినును' అని యేసుప్రభువు యోహాను 10వ అధ్యాయములో చెప్పినమాట ఇచ్చుట జ్ఞాపకమునకు వచ్చుచున్నది. I సమూ. 3:10; I రాజులు 19:12; యోహాను 10:27; అపో.కార్య. 9:4; ప్రకటన 1:11-12.

## వ్రాత ప్రత్యక్షత

దీనిలో సందేశము అనగా వర్తమానము, గాలిలో వ్రాయబడే అక్షరములుగా కనబడును. లేదా అచ్చువేయబడిన అక్షరములవలె కనబడును. దావీదునకు

దేవుడు గుడియొక్క నిర్మాణపద్ధతి వ్రాత మూలముగా చూపెనని దినవృత్తాంతములలో వ్రాయబడియున్నది గదా! ఒక్కొక్కప్పుడు చేతి వ్రాతకూడ కనబడును. మరియు పరలోకము నుండి ఒక అట్టబోర్డు వచ్చును. దానిపై ఒకరు వ్రాసి చూపింతురు. దానిని చదివి, నోట్సులో వ్రాసికొనవచ్చును.

నిర్గమ. 31:18; I దిన. 28:19; దానియేలు 5:5; యోహాను 8:6.

## స్వప్నప్రత్యక్షత

ప్రభువు యోసేపునకు స్వప్నములో కనబడి సంగతి తెలియపరచినట్లు, విశ్వాసికి  ప్రభువు కలలో కనబడి తెలియజేయును. పగలు చూచినది కలలో కనబడిన యెడల అది ప్రత్యక్షతకాదు. దైవప్రత్యక్షత స్వప్న ప్రత్యక్షతయే.

ఆది 37:7-10; సంఖ్యా 12:6; I రాజులు 3:5; మత్తయి 1:20; 2:12,13; 27:19.

## ఊహా ప్రత్యక్షత

ఇదియును దైవ ప్రత్యక్షతలలో నొకటి. ఇట్లు చేయుటకు **'పరిశుద్ధాత్మకును, మాకును తోచెను'** అని అపో.కార్య. 15:28,29లో గలదు. నెహెమ్యా 2:12.

## జ్ఞాన ప్రత్యక్షత

ఇది దేవుడనుగ్రహించిన జ్ఞానమునుబట్టి గ్రహించుకొను శక్తి. సొలొమోను, వేశ్యలకు తీర్పుతీర్చినది జ్ఞానమునుబట్టి కాదా! జ్ఞానమునుబట్టియే కదా నూతన యంత్రములు, స్టీమర్లు, విమానములు మొదలైనవి కనిపెట్టుట. **దేవుని సార్వత్రిక ప్రేమ అవిశ్వాసులకు కూడ ఇట్టి జ్ఞానమిచ్చును. ఇది ఆత్మీయజ్ఞానము కాదు. విశ్వాసులకు ఆత్మీయజ్ఞానము ఇయ్యబడును.** జ్ఞానముకూడ ఒక వరమని బైబిలులో నున్నది.

I రాజులు 3:11-12; అపో.కార్య. 6:10; I కొరి 1:6; 12:8.

## వాక్య ప్రత్యక్షత

మనము ప్రార్థనచేసిన తరువాత, జ్ఞానమును ఉపయోగించి బైబిలు తీసి జాగ్రత్తగా వెదకిన యెడల, మన ప్రార్థనకు సరిగా తగిన వాక్యమే దొరుకును. లూకా 4:17,18 తెలివి తక్కువగాను, అజ్ఞానముగాను వెదకిన యెడల కావలసిన వాక్యము దొరుకక పోవును. ఉదా:- ఒకప్పుడు క్రైకరుల మిషను క్రైస్తవుడు 'దేవా! నేను ఏమి పని చేయవలెనో, నీ వాక్యములో చూపిన ఆ ప్రకారము చేస్తాను' అని ప్రార్థించి, బైబిలు తెరువగా 'యూదా ఉరిపెట్టుకొనెను' అని వచ్చినది. అబ్బే ఇది సరిలేదు అని మరలా బైబిలు తెరువగా, 'నీవును వెళ్ళి అలాగు చేయుము' అని వచ్చినది. సిగ్గుపడి మరలా తెరువలేదు. ఇది చాదస్తపు భక్తి. నీలో జ్ఞానములేదు.

షరా: 1) కొందరికి ఈ ప్రత్యక్షతలలో ఏదోఒకటి యున్నది. కొందరికి రెండు లేక మూడు ఉండును. కొందరికి అన్ని ఉండును. దీనిని సరియైన రీతిని వాడుటనుబట్టి, వరములు ఉపయోగములోనికి వచ్చును. భయంకరమైన సంగతి ఏమనగా, దయ్యము కనబడితే ప్రభువని కొందరు అందురు. ప్రభువు కనబడితే కొందరు దయ్యమనుకొందురు. నీటిమీద ప్రభువు కనబడితే, శిష్యులు భూతమని తలంచిరి. గనుక జాగ్రత్తగా ఆలోచించవలెను. సాతాను వెలుగు దూతవేషము ధరించునని పౌలు వ్రాయుచున్నాడు.

2) కనిపెట్టు సమయములో ఈ వరము వాడుకలో నుండును. ***గాని కొందరికి ఎప్పుడుబడితే అప్పుడు ఉండును. హృదయ స్థితినిబట్టి ఈ వరముండును.*** విశ్వాసులారా! తప్పుడు దర్శనములకు, పిశాచులకు దూరస్థులగుడి. మరియు దర్శనములు అర్థము కానప్పుడు అర్థము కొరకు ప్రార్థించండి.

3) ఒక్కొక్కప్పుడు స్వప్నములు సరికాకపోవచ్చును. ఒక్కొక్కప్పుడు దర్శనములు సరికాకపోవచ్చును. ఒక్కొక్కప్పుడు ఊహాలుకూడ సరికాకపోవచ్చును. కాని వాక్య ప్రత్యక్షత ఎప్పుడును సరిగానే ఉండును. ఎందుకనగా అది వ్రాయబడియున్నది గనుక దానిని మార్చుటకు వీలులేదు. ఎలాగనగా 'అడుగుడి మీకు ఇవ్వబడును' అనే వాక్యముండగా, దీనిని ఎవరు మార్చగలరు? లేదని కాదని ఎవరనగలరు? దేవదూతలు అనరు గాని, అంటే మనమాటే నెగ్గును. ఎందుకంటె పత్రము మార్చవీలులేదు. మాట అయితే మార్చవచ్చును.

4) 'నీవు ప్రార్థన చేసినావు, నెరవేరలేదు' అని ఇతరులుగాని, నీ స్వంత మనసుగాని, పిశాచిగాని చెప్పినయెడల, ఆ మాట ఎంత మధురముగా నున్ననూ నమ్మవద్దు. వ్రాత వాక్యమే నమ్ముము. అప్పుడు క్షేమము కలుగును.

**పాదశుద్ధి:-** ప్రభువు శిష్యుల పాదములు కడిగెను. మీరును ఇట్లు చేయుడని చెప్పెను. ఈ మాటనుబట్టి పాదుర్లు నేటి కాలమందు, ప్రభువు భోజన కాలమందు సభికుల పాదములు కడుగవలెను. యోహాను 13:1-15.

**ప్రభువుభోజనము:-** ఈ భోజన సమయమందు విశ్వాసికి అంతరంగముగా, క్రీస్తుయొక్క శరీర రక్తములు దానిలోనుండి అందును. *ప్రభువు భోజనము ఎంత తరచుగా ఆచరిస్తే అంత మంచిది.* సమభాక్త్వము పుచ్చుకొన్న వెంటనే కొందరు రోగులు స్వస్థపడుదురు. మత్తయి 26:26-29; 1కొరి 11:23-34.

**దైవిక స్వస్థత:-** *1) ఔషదములేకుండా, కేవలము విశ్వాస ప్రార్థనలవల్లనే జబ్బులు బాగుచేసికొనుటకు దైవిక స్వస్థత అని పేరు. యెహోవాను* ఆశ్రయింపనందున ఆసాకు శిక్ష కలిగెను. గాని ఔషదము వాడుటవలన కాదు.

'మూలికలలో దేవుడే స్వయముగా 'స్వస్థపరచు శక్తినిపెట్టెను' అని మన అనుభవమువలన తెలిసికొనుచున్నాము. పుండునకు అంజూరపు పండ్లను కట్టవలెను. ***ఆ మాటనుబట్టి చూడగా, ఔషధములు నిషేధములు కావని కనబడుచున్నది.*** గాని కేవలము విశ్వాసమువల్లనే బాగుచేసికొనుట శ్రేయస్కరము. (స్వస్థి పత్రిక చదివినారా?)

నిర్గమ 15:26; కీర్తన 107:20; యెషయా 53:5; మత్తయి 4:23-24; అపో.కార్య 3:16; I పేతురు 2:24.

**దయ్యములను వెళ్ళగొట్టుట:-** ఇది ప్రభువు తన శిష్యులకిచ్చిన ఒక గొప్ప వరము. నేడును ప్రభువు ఈ వరము కొంతమందికి ఇచ్చుచున్నాడు. విశ్వాసి అపవిత్రాత్మపట్టినవాని ఎదుట వాక్యము బోధించి, ప్రార్థన చేసిన యెడల ప్రభువు అపవిత్రాత్మను వెళ్ళగొట్టును. ఇది కూడ మేము ప్రయత్నించుచున్నాము. (కొందరు దయ్యములున్నవని నమ్మరు. అట్లు నమ్మకపోవుట దయ్యములకు ఎంతో ఇష్టము). మత్తయి 10:8; మార్కు 16:17.

## పరిశుద్ధుల సహవాసము

విశ్వాస ప్రమాణములో పరిశుద్ధుల సహవాసము నమ్ముచున్నానని ఉన్నది. పరిశుద్ధులు అనగా ఈ లోకములోని పరిశుద్ధులు, పరలోకములోని పరిశుద్ధులు. ఈ లోక పరిశుద్ధులతో సహవాసముచేయుట సులువే. పరలోక పరిశుద్ధులతో సహవాసము చేయవలెనని మేము బోధించుచున్నాము. వారు మన ప్రార్థనలోనికి వస్తారుకదా! రూపాంతర పర్వతము మీదికి మోషే, ఏలియాలు వచ్చిరి అను సంగతియు, ప్రభువు మరణదినమున పరిశుద్ధులు వచ్చినారను సంగతియు, ఆరోహణ దినమున ఇద్దరు మనుష్యులు వచ్చినారను సంగతియు ఈ

సందర్భమున వివరించుచున్నాము. మత్తయి 17:1-4; 27:52,53; అపో.కార్య. 1:10-11.

## దైవవాక్యము

బైబిలు గ్రంథము దైవావేశముచేత వ్రాయబడిన గ్రంథము. క్రైస్తవ మతమునకు మూలగ్రంథము. దేవుని మనస్సును చూపించునట్టి గ్రంథము. ఈ గ్రంథములో వ్రాయబడిన కృపావరములన్నియు, అన్ని కాలములందును, దేవుడు తన కిష్టమైనవారికి అనుగ్రహించును. సృష్టిద్వారా, మనస్సాక్షిద్వారా, దైవప్రత్యక్షత ద్వారా, ఉపకారముల ద్వారా, కష్టముల ద్వారా, దేవుడు కొన్ని విషయములు బైలుపరచవచ్చును, ***కాని అన్నిటికంటె బైబిలు వ్రాతవాక్యము మానవమాత్రులమైన మన కండ్లకు అన్నియు కనబరచును.*** గనుక బహు విశ్వాసనీయము. మనము వాక్యము చూపించునపుడు సైతాను నోరు పడిపోవును. అందుచేతనే యేసుప్రభువు 'వ్రాయబడియున్నదని' ముమ్మారుచెప్పి, సైతానును తోలివేసెను. కీర్తన 119:72; మత్తయి 4వ అధ్యాయము; హెబ్రీ. 4:12; 11:3.

## కనిపెట్టుట

***ప్రతివారును రోజు ప్రార్థనలో, అధమపక్షము ఒక గంట కనిపెట్టు వాడుక కలిగియుండుట మంచిది.*** ఒక అంశమునుగురించి ప్రార్థించి ముగించిన వెంటనే వెళ్ళిపోక, అక్కడనే కొంతసేపు కనిపెట్టినయెడల, ప్రభువు మన మనస్సులో జవాబు తోచునట్లు చేయును. 'కనిపెట్టు గంట' అనే చిన్న పుస్తకమును చదువండి. కీర్తన. 37:7.

# దైవసన్నిధి

I. వీలైన సమయము, స్థలము చూచుకొని ఉదరశుద్ధి, హృదయ శుద్ధి, దేహశుద్ధి, వస్త్రశుద్ధి కలిగిన 7గురు ప్రతిదినము కూడుకొని కీర్తనపాడి, వాక్యమును వరుసగా చదివి, ప్రార్థనమెట్ల ప్రకారము కార్యక్రమమును జరిగించి, పిదప ప్రభువును ఇష్టమువచ్చిన ప్రశ్నలడిగి జవాబు కొరకు కనిపెట్టిన, ప్రభువు కనబడి మాట్లాడును, ఉత్తరమిచ్చును.

II. (1) ఒకసారి ఆయన కనబడి మాట్లాడును. (2) మరియొకసారి దేవదూతలను పంపును. (3) ఇంకొకసారి మోక్షలోక పరిశుద్ధుల ఆత్మలను పంపును. (4) వేరొకసారి భూలోకభక్తుల ఆత్మలను పంపును. (5) తరువాత భూలోకములోని భక్తిహీనుల ఆత్మలను పంపును. (6) అటుపిమ్మట భక్తిహీనులైన మృతుల ఆత్మలను పంపును. (7) కోరిన వాటిని, కోరినవారినికూడ పంపును. వారందరు కనబడి మాట్లాడి ప్రత్యుత్తరమిత్తురు. (8) పిదప ఒక భూతమునుకూడ రానిచ్చును. చివరకు ఆ భూతము పారిపోగా, ఆయనవచ్చి ఆ భూతము చెప్పిన మాటలు నమ్మకుడి. వాడి మాటలకు వెరవకుడని చెప్పి ఆదరించును.

III. ***ఎంత గొప్ప వంశమునందు జన్మించినను; ఎంత ఆరోగ్యము, ధనము, విద్య, ఉద్యోగము, పేరు, బంధుత్వము సంపాదించినను; దైవసన్నిధి ధ్యానముతో సాటియగునా? ధ్యాన విద్యవలన తక్కిన వాటన్నిటికి రాణింపు, సహాయము కలుగును.***

నిర్గమ 33:14,15; కీర్తన 16:11; 31:20; 32:7; జెఫన్యా 1:7; అపో.కార్య. 9:27; ఎఫెసీ 3:3; అపో.కార్య. 10:3,4; మత్తయి 17:3; అపో.కార్య. 16:9,10; యాకోబు 4:7-8.

## విశ్వాస జీవితము

'రక్షణ, ఒక్క క్రీస్తుప్రభువువల్లనే దొరుకును' అని నమ్ముట విశ్వాసజీవితమై యున్నది. మరియు 'పోషణకూడ యేసుప్రభువువల్లనే కలుగును. అని నమ్ముటయు విశ్వాస జీవితమైయున్నది. అనగా 'శరీర, ఆత్మీయ జీవితములకు కావలసినవన్నియు పరిపూర్ణముగా దొరుకునని నమ్ముటయే' విశ్వాసమై యున్నది. ***బైబిలుమిషనువారు పోషణ విషయమై మిషనులనుగాని, మనుష్యులనుగాని అడుగకయే పొందుచున్నారు.*** దేవుడు సమయోచితముగా ఎవరిద్వారానైన ఒకరిద్వారా సహాయము పంపుచున్నారు. దేవునికి స్తోత్రములు. బైబిలుమిషను ప్రభువు దర్శనములో కనబడి, స్వయముగా మాట్లాడే మిషనైయున్నది. మత్తయి 10:10; ఫిలిప్పీ 4:19; 1తిమోతి 6:17.

## పెండ్లికుమార్తె

రక్షింపబడిన వారందరును ఈ సంఘములోనివారు కారు. కాని హృదయస్థితినిబట్టి ప్రభువు ఏర్పరచుకొనువారు ఈ పెండ్లికుమార్తె సంఘస్థులు. మరియు వీరిలో ఎవరు ప్రభువు వచ్చువరకు ఉందురో, వారు సజీవముగా ఎత్తబడుదురు. ఎవరు ప్రభువుయొక్క రాకడను నమ్మి సిద్ధపడుదురో వారు మహిమ శరీరధారులై, ప్రభువు వచ్చునప్పుడు ఆయనతో మేఘమెక్కి వెళ్ళుదురు. క్రీస్తునందలి మృతులును లేచి వత్తురు. ఆ గుంపు ఈ గుంపు కలసి పెండ్లికుమార్తె అనబడును. ప్రకటన 22:21; హెబ్రీ 12:23.

## నగలు

నగలు ధరించుకొనవచ్చునని ఒకచోటను, తీసివేయవలెనని ఒక చోటను, బైబిలులో వ్రాయబడియున్నది. గనుక సందర్భానుసారముగా ఈ

రెంటిని అనుసరింప వచ్చును. 'నీ చెయ్యి ఆటంకముగానున్నయెడల నరికివేయుమని' ప్రభువు చెప్పెను. గనుక నీకు ఆటంకముగా నున్నవాటిని తీసివేయవచ్చును. నూతన యెరూషలేములోని పెండ్లికుమార్తె ఆభరణములతో నుండును. అవి మహిమాభరణములు. పెండ్లికుమార్తె ఇప్పుడు భూమిమీద నున్నది. భూమిమీద నున్న పెండ్లికుమార్తెకు నగలు నిషేధములు కావు. అనాగరికమైన నగలు మర్యాదను చెడగొట్టును. నీ ఆస్తిని అమ్మి పేదలకిమ్మని ప్రభువు ఒక ధనికునితో చెప్పెను. ఆ మాట మంచి సమరయుని కథ విన్న శాస్త్రితో చెప్పలేదు. నగలు పై యాచారమునకు సంబంధించినవి. ఆది 24:53; నిర్గమ 3:22; 12:35; 1పేతురు 3:3; మార్కు 9:43-47.

**క్రీస్తుప్రభువు రెండవరాకడ :** ప్రభువు రెండవసారి రావలసిన రాకడకు ముందు జరుగవలసిన గురుతులన్నియు జరిగిపోయినవి. గనుక ఆయన మనకాలమందే త్వరగా వచ్చునని మేము నమ్ముచున్నాము. ***ఆయన ఎప్పుడు వచ్చినను, త్వరగావచ్చునని నమ్ముటలో హానిలేదుగదా!*** (నమ్మకపోవుటవలన హాని ఉన్నది) క్రీస్తువారి జీవితములోని జన్మమును, సిలువ, మరణ, పునరుత్థాన, ఆరోహణములను నమ్మి; కడవరి అంశమగు రాకడను నమ్మనియెడల ఏమి ప్రయోజనము? 1థెస్స. 4:13-18; మత్తయి 24వ అధ్యా॥; మార్కు 13అధ్యా॥; లూకా 21వ అధ్యాయము.

**ఏడేండ్ల శ్రమకాలము :** విశ్వాసుల సంఘము (పెండ్లికుమార్తె) వెళ్ళిపోయిన తరువాత భూమిమీద మిగిలియున్నవారికి ఏడేండ్లు శ్రమలుండును. అంతెక్రీస్తు అను క్రీస్తు విరోధివల్ల అవి కలుగును. ఆ సమయమందు చాలమంది మారుమనస్సు పొందుదురు. ప్రకటన 6:1-18; మార్కు 13:19; జెఫన్యా 1:14-18; ప్రకటన 6:17.

**హర్మెగెద్దోను యుద్ధము :** క్రీస్తు ప్రభువు పరలోకమునుండి వచ్చి అంతెక్రీస్తుతో హర్మెగెద్దోను నొద్ద యుద్ధము చేసి, అతనిని అతని సహాయకుడగు అబద్ధ ప్రవక్తను, దయ్యములను అగ్ని గుండములో వేయును. అయితే సాతానును వెయ్యేండ్లు చెరసాలలో బంధించును. ప్రకటన 16:12-15; 19:19-20; జకర్యా 14వ అధ్యాయము.

**వెయ్యేండ్ల పరిపాలన :** క్రీస్తు ప్రభువు భూమిమీద శాంతి పరిపాలన చేయును. అప్పుడే లోకమంతటికిని సువార్త పూర్తిగా ప్రకటింపబడును. ప్రకటన 20:4-6; 19:15,16; 5:10.

**సజీవుల తీర్పు :** వెయ్యేండ్లలో సువార్త విన్నవారు ఏమి తీర్మానించుకొన్నారో విని, తీర్పు విధించుటకు యేసుప్రభువు భూమిమీద సింహాసనము వేసికొనును. దీనినే సజీవుల తీర్పందురు. మరియు గొఱ్ఱెమేకలను వేరుచేయు తీర్పందురు. మత్తయి 25:31-46.

**సాతాను విడుదల :** ప్రభువు సాతానును విడుదల చేయగా, అతడు భూమి మీదికి వచ్చి, అనేకులను సైన్యముగా ప్రోగుచేసికొని యుద్ధమునకు వెళ్లును. ఆ సైన్యమును ఆకాశ అగ్ని దహించును. అప్పుడు ప్రభువు సైతానును అగ్ని గుండములో వేయును. ప్రకటన 20:7-10.

**అంత్యతీర్పు :** ఆదాము మొదలుకొని అప్పటివరకు సమాధులలో ఉండి, మారు మనస్సు పొందని వారందరు ఈ తీర్పులోనికి వచ్చెదరు. అప్పుడే కొందరు 'ప్రభువా! నీ నామమున మేము ప్రవచింప లేదా?' అని అడుగుదురు. ప్రక 20:11-15; ప్రసంగి 12:14; దాని 7:27; యోహాను 5:27-29.

**పరదైసు :** క్రీస్తునందు మృతులైనవారి ఆత్మలు పరదైసునకు వెళ్ళును. ఇది మోక్షలోకము లోనిదే! 'నేడు నీవు నాతోకూడ పరదైసులో నుందువు' అని

ప్రభువు ఒక నేరస్థునితో చెప్పినది పరదైసే? ***ప్రభువు వలెనే శిష్యులును హేడెస్సులో బోధింతురు.*** లూకా 16:22; 23:43; II కొరి 12:4; ప్రక. 2:7.

**హేడెస్సు :** ఇది పాతాళ లోకములోనున్న ఒక లోకము. మారుమనస్సు పొందని మనుష్యుల ఆత్మలు ఇక్కడ ఉండును. యేసుప్రభువు ఇక్కడికి వెళ్ళి సువార్త ప్రకటించినట్లు పేతురు వ్రాయుచున్నాడు. దేవుడు సర్వశక్తిగలవాడు గనుక మారుమనస్సు పొందనివారిని జీవాంతమందైనను రక్షింపగలడు. 'నేను పాతాళమునందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు' అని దావీదు కీర్తన 139:8లో నున్నది. సాధు సుందర సింగుగారు వ్రాసిన పరలోక దర్శనములను పుస్తకములో, ఈ సంగతిని తెలిసికొన వచ్చును. కీర్తన9:17; 139:8. ఆమోసు 9:2; I సమూ 2:6; I పేతురు 3:20; 4:6; ఫిలిప్పి 2:9-11.

**పరలోక ప్రార్థనా కూటము :** ఇక్కడ భూలోకము నిమిత్తమై ప్రార్థనలు చేయబడును. ఈ ప్రార్థన కూటముయొక్క సంగతి మిక్కిలి వినోదకరమైనది. ప్రక. 4:6; యెషయా 6:3; యెహెజ్కేలు 1వ అధ్యా॥.

**నూతన యెరూషలేము :** ఇది పెండ్లికుమార్తె వరుసలోని వారి నివాస స్థలము. ప్రకటన 21:2.

**రక్షింపబడిన వారి మోక్షము :** ఏ విశ్వాసులు పెండ్లికుమార్తె వరుసలోనికి వెళ్ళలేరో, వారు మోక్షములోనే మరియొక భాగమునకు వెళ్ళగలరు. అదియే రక్షితుల మోక్షము. ప్రక 7:1-14; 20:4; 14:3.

**భూలోక మోక్షము :** పాత్రల కాలములోని విశ్వాసులు భూమిమీద ఎప్పుడును ఉండిపోదురు. వెయ్యేండ్ల తరువాత ఈ భూమి పరలోకములో ఒక భాగమై యుండును. ప్రకటన 21:1; II పేతురు 3:13.

**బైబిలు మిషను :** 1938వ సం॥ము జనవరి 31వ తేదీన రాజమండ్రిలో దేవుడు యం. దేవదాసు అయ్యగారికి గాలిమీద బైబిలు మిషను అని వ్రాసి

చూపించెను. లూథరన్ మిషనును విడిచి పెట్టవలెనని ప్రభువు ఆయనకు ఫిబ్రవరి నెలలో వ్రాసి చూపించెను. ఒక సైన్యముయొక్క యువరాజువలె బయటికి వచ్చివేయుమని ప్రభువు మార్చి నెలలో వ్రాసి చూపించెను. ప్రభువుయొక్క ఆజ్ఞ చొప్పున లూథరన్ మిషనుకు రాజీనామా పెట్టిరి. గాని వారంగీకరింపలేదు. అయినను లూథరన్ మిషనులోని ప్రభు భోజన సంస్కార దినమున గుడికి వెళ్ళిరి. ఆయనను వారు బల్లయొద్దకు రానీయలేదు. ఇది ఏప్రియల్ నెలలో జరిగినది. గుడిలో యధాస్థలమున కూర్చుండి, ప్రభువా! నీవే నాకు సంస్కార భోజనము ననుగ్రహింపుమని ప్రార్ధింపగా, ప్రభువే స్వయముగ అప్పుడే దర్శనమునందు కనబడి రొట్టె, ద్రాక్షారసమును ఇచ్చిరి. ఆయన అదివరకే త్రిత్వదేవుని వలన దర్శనములో పాదిరి పనికి ఆర్డినేషను పొందియున్ననూ, విజయరత్నంగారిచే బైబిలుమిషను పనివారికి ఆర్డినేషను ఇప్పించిరి. నేటికి బైబిలు మిషనులో అనేకమంది పాస్టర్లు, పనివారు, సభ్యులు, అభిమానులు కలరు. ఇది ఆంధ్ర రాష్ట్రములోనే కాక అనేక రాష్ట్రములలోను, అనేక స్థలములలోను వ్యాపించియున్నది. బైబిలు మిషను ద్వారా అనేక పుస్తకములు, పత్రికలు, పద్యములు, కీర్తనలు ప్రచురింపబడుచున్నవి. బైబిలు మిషనులో జీతనాతముల ఏర్పాట్లు లేకపోయినను, సువార్తను ఉచితముగా ప్రకటించుచు దేవాలయములను నిర్మించుచున్నారు. ఆయా స్థలములలో మూడేసి దినములు సభలు జరిగించుచు, ఉచిత భోజన ఏర్పాట్లు చేయుచున్నారు. 1949వ సం॥ము నుండి ప్రతి సోమవారము గుంటూరు వద్దనున్న పెదకాకానిలోని కీ॥శే॥ రాజారావు గారి తోటలో స్వస్థత కార్యక్రమము జరుగుచున్నది.

# కాలోచిత ప్రార్థనలు

## క్రిస్మసు స్తోత్రారాధన

యోహాను 1వ అధా॥; ఎఫెసీ 1:4-12; ఫిలిప్పీ 2:4-7; ఆది 3:15,16; 9:26; 12:1-3; 49:9,10; సంఖ్యా 24:16,17; ద్వితీ. 18:16-22; కీర్తన 72:16-18; యెషయా 7:14; 9:6, 11:1; మీకా 5:2; లూకా 1:26-56; 2:1-38; మత్తయి 1:18-26, 2వ అధ్యా॥; గలతీ 4:4,5; రోమా 1:2-9; హెబ్రీ 1:1-5.

## క్రిస్మస్ అనగా క్రీస్తును ఆరాధించుట అని అర్థము.

ప్రేమాస్వరూపివైన తండ్రీ! 'నీవు లోకమును ప్రేమించియున్నావు' అను వాక్యమును బట్టియు, విశ్వసించువారు నశింపక నిత్యజీవము పొందుటకై, నీ అద్వితీయ కుమారుని పంపిన వృత్తాంతమును బట్టియు, నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము. బహిరంగమున మొట్టమొదట శిశువుగా ప్రత్యక్షమైన జనతైక కుమారుడవైన యేసు ప్రభువా! పాపమును, దుష్టఫలితమును గల ఈ లోకమునకు రాగోరిన నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము.

పరిశుద్ధాత్మవైన తండ్రీ! మా ప్రియ రక్షకుడు, మా భూలోకమునకు రావలసిన రాకడను నీవు పరిశుద్ధ కన్యక మూలముగా నెరవేర్చినందులకు నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము. త్రియేక దేవుడవైన తండ్రీ! అనాదిలో నీవు ఉద్దేశించిన కార్యములను యుక్తకాలములయందు, చిత్రమైన పద్ధతుల మూలముగ జరిగించుచు వచ్చిన నీ అనంత జ్ఞానమునుబట్టి నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము.

శిశువైన యేసుప్రభువా! సర్వలోక రక్షకుడవైన నీవు, సర్వలోక ప్రజా సంఖ్య లిఖిత సమయమున, కాలము పరిపూర్ణమైనప్పుడు జన్మించిన నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము. మానవ శిశువైన దేవా! ప్రజాసంఖ్య గణన దినములలో పుట్టుటవల్ల, ప్రజాసంఖ్యలో చేరుటకు బిడియపడని నిన్ను స్తుతించుచు ఆరాధించు చున్నాము.

శిశువైన తండ్రీ! ప్రవచన ప్రకారము బేత్లెహేములో పుట్టి, ప్రవచనము సార్థకము చేసిన నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము. క్రీస్తు ప్రభువుగా వచ్చిన శిశువా! భూమి యాకాశములును, వాటిలోని సమస్తమును నీవియైయున్నప్పటికిని, గొప్పవారి గృహములలోనున్న ఉయ్యాలతొట్టిలేనివాడవై, పశువులతొట్టిలో పరుండిన నీ దీనత్వమును బట్టి నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము.

యేసుప్రభువుగా వచ్చిన శిశువా! విశ్వాసులకు నీ నీతి వస్త్రమును ధరింపజేయగల నీవు, పొత్తిగుడ్డలు ధరించుకొన్నంత పేదరికమురాగా, సహించుకొన్న నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము. శిశువుగా కనబడి, కాలక్రమేణ వెయ్యేండ్ల స్వీయ పరిపాలనలో రాజులందరికంటెను, చక్రవర్తులందరికంటెను గొప్పవాడవుగా కనబడబోవు నీవు ప్రపంచ చక్రవర్తియైన ఔగుస్తుపాలనలో జన్మించుటవల్ల నీవెంత దేవుడవైనను, మానవ జన్మమునుబట్టి మానవాధికారుల స్వాధీనములో చేరిన నీ వినయ స్వభావమునకు అనుగుణ్యముగా నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము.

శిశువు అనిపించుకొన్న రాజా! నరులు ఎంత గొప్ప చక్రవర్తులైనను నీవలననే గొప్ప స్థితికి వచ్చినందున, అట్టి ఔగుస్తు వంటివారినికూడ నీ సేవలో ఉపయోగపరచు కొనుచున్న నిన్ను స్తుతించుచు ఆరాధించుచున్నాము. ఆమేన్.

# క్రీస్తు జన్మ ప్రవచన సంవత్సరములు

| ప్రవచనము విన్నవారు | వాక్యభాగము | షుమారు ఏ సం॥ము వినిపింపబడెను |
|---|---|---|
| 1. ఆదాము | ఆది 3:15 | క్రీ॥పూ॥ 4004 సం॥ము |
| 2. నోవహు | ఆది 6:18 | ॥ 2353 సం॥ము |
| 3. షేము | ఆది 9:26 | ॥ 2348 సం॥ము |
| 4. అబ్రాహాము | ఆది 12:3 | ॥ 2126 సం॥ము |
| 5. ఇస్సాకు | ఆది 26:4 | ॥ 1806 సం॥ము |
| 6. యాకోబు | ఆది 28:14 | ॥ 1760 సం॥ము |
| 7. యూదా | ఆది 49:10 | ॥ 1689 సం॥ము |
| 8. ఇశ్రాయేలీయులు | సంఖ్యా 24:17 | ॥ 1452 సం॥ము |
| 9. మోషే | ద్వితీ. 18:18 | ॥ 1451 సం॥ము |
| 10. దావీదు | II సమూ. 7:16 | ॥ 1042 సం॥ము |
| 11. యెషయా | యెషయా 7:14 | ॥ 742 సం॥ము |
| | ॥ 9:6 | ॥ 740 సం॥ము |
| 12. మీకా | మీకా 5:2 | ॥ 710 సం॥ము |
| 13. యోసేపు | మత్తయి 1:20,21 | ॥ 5 సం॥ము |

# మధ్యరాత్రి ఆరాధన

Watch Night Service : 31వ తేది మధ్యరాత్రి 9 గం॥ల నుండి 1 గంట వరకు అనగా రానున్న సంవత్సరములో ప్రవేశించు వరకు చేయు ప్రార్థన లేక ఆరాధన.

మత్తయి 28:20; కీర్తన 103; కొలస్స. 3:1-15

**యుగ సమాప్తి:-** ఈ మాటను గ్రీకుభాషలో అయోనని అందురు. ఈ అయోనను మాట బైబిలులో చాల పర్యాయములుగలదు. యుగము అనగా ఒకప్పుడు ఎక్కువ సంవత్సరములుండును. ఒకప్పుడు తక్కువ సంవత్సరములుండును. ఎన్ని సంవత్సరములు యుగము అనునది చెప్పలేము. ఒక సంగతి అయిన తర్వాత యుగము. ఇంకొక సంగతి జరిగిన తర్వాత మరియొక యుగము. ***'బైబిలు మిషను' అను గాలిలో వ్రాయబడిన ప్రత్యక్షత, గాలి మొదలు మేఘము వరకు నుండును. ఎందుకనగా భూమి మొదలు మేఘము వరకు గాలి ఉండును.***

ఒక పుస్తకమున్నది. దానిపేరు 'గాలి పుస్తకము' బజారునకు వెళ్ళి ఒక పుస్తకము తెచ్చి వాడుదుము. పెట్టెలోనే ఎప్పుడును దానిని ఉంచము. ఆ పుస్తకము కొంత సేపు బల్లమీద, కొంత సేపు చేతిలోను, కొంత సేపు పెట్టెలోను ఉండును. అయితే ఈ గాలి పుస్తకము ఆలాగు కాదు. ఉదయము మొదలు సాయంకాలము వరకు, సాయంకాలము మొదలు ఉదయము వరకు ఉండును. దీనికి 12 పేజీలుండును. మొదటి పేజీ తెల్లగా నుండును. అందులో మొదటగా ఎర్రగీత, దానిక్రింద నల్లగీత ఉండును. రెండవ పేజీలోను అట్లేయుండును.

ఎఱ్ఱగీతమీద సౌఖ్యకాలమనియు, నల్లగీతమీద కష్టకాలమనియు; ఇట్లు పన్నెండు ఆకుల మీద నుండును. ఇది గాలి పుస్తకము గనుక ఎప్పుడుబడితే అప్పుడే ఉండును. కొన్నిమార్లు ఉండి కొన్నిమార్లు లేకపోవుటకు, ఇది బజారు పుస్తకముకాదు. ఈ ప్రకారము అది అన్ని యుగములలో నుండును. ఈ దినము మనము 2005వ సం॥ము అనుచున్నాము. ఈ అంచుమీదనుండి క్రొత్త సంవత్సరము అనగా 2006 అంచుమీదికి దూకి వెళ్ళుదుము. పాత సంవత్సరములో నున్న గీతలే క్రొత్త సంవత్సరము లోనికి వచ్చును. ఈ గీతలు ఎప్పుడు తప్పించుకొందుమనగా, ప్రభువు వచ్చినప్పుడు మాత్రమే, అనగా గాలిద్వారా ఎప్పుడు మేఘములోనికి ప్రవేశింతుమో, అప్పుడే తప్పించుకొందుము. కష్టకాలము గీతవంటి నల్లగీతలు అప్పుడురావు, ఎఱ్ఱగీత ఎప్పుడును పోదు. అనగా సౌఖ్యము, ఆనందము తరగకయుండును. సన్నిధికూటములు, ప్రార్థనలు, సువార్త ప్రకటన, పత్రికలు, స్తుతులు ఈ మొదలైనవి ఉన్నయెడల ఆ నల్లగీత ఎందుకుపోదు! అనవచ్చును. ***అయితే, అది ఇక్కడ పోయేది కాదు గనుక పోదు. అది మనమీద ఉండక మనకాళ్ళ క్రింద ఉండును.*** గతించిన పాత సంవత్సరమును గురించి స్తుతించవలెను. రానైయున్న క్రొత్త సంవత్సరమును గురించి స్తుతించవలెను. ఎందుకనగా ఎఱ్ఱగీత స్థిరపడుటకు, నల్లగీత సహాయపడును. మన ఈ భూలోక జీవితము ఒక పాత సం॥ము వంటిది. రాబోయే మహిమలోక జీవితము ఒక క్రొత్త సంవత్సరము వంటిది. ఇంకొక నిమిషమునకు వచ్చే క్రొత్త సంవత్సరము మరనాత. ఇపుడు అందరకు పాత సంవత్సరపు మరనాత.

**ప్రార్థన:-** ఓ దయగలతండ్రీ! మాయొద్దనుండి ఒక స్నేహితుడు వెళ్ళిపోవు- చున్నపుడు అతనికి సలాము చేయుదుము. అప్పుడే ఒక క్రొత్త స్నేహితుడు వచ్చిన, ఆయనకుకూడ సలాము చేయుదుము. అర్ధము మాత్రము భేదము. వెళ్ళిపోయే స్నేహితునితో, 'అయ్యా! వెళ్ళిరండి' అను భావము; వచ్చే స్నేహితునితో 'అయ్యా! దయచేయండి. కూర్చోండి అను భావము' ఇద్దరకు Shake hand ఇస్తాము. అలాగే పాత సంవత్సరమును సాగనంపి క్రొత్త సంవత్సరమును ఆహ్వానించుచున్నాము. అయితే మనము దానిని సాగనంపుట లేదు. దానంతట అదే వెళ్ళిపోవును. క్రొత్త సంవత్సరమును రమ్మని మనము పిలవడము లేదు. దాని అంతట అదే వచ్చును. ***బైబిలు మిషనును మనము పిలువలేదు. దాని తలంపే లేదు. దాని అంతట అదే వచ్చినది. దాని అంతట అదే సాగుచున్నది. మనము పనిగట్టుకొని గట్టిగా త్రోసివేసిననూ అది వెళ్ళదు.*** గాలి తుఫాను వచ్చినపుడు మనమందరము బయటకువెళ్ళి, చేతులుచాపి ఆగుమని చెప్పిన అగునా? ***అలాగే బైబిలుమిషనును ఎందరు ఆపిన ఆగదు. ఈ సంగతి ప్రభువును అడిగి తెలిసికొనవలెను.*** ఓ ప్రభువా! యుగ సమాప్తివరకు ఉండునని చెప్పినావు. దాని వివరము గొప్పది. యుగమనగా ఏమిటి? యుగసమాప్తి అనగా ఏమైనది నీవు చెప్పినగాని తెలియదు. కాబట్టి మేము అడుగువరకు, నీవు చెప్పువరకు ఆగియుంటాము. ఈ ప్రార్థన నీ ఘనమైన నామమునుబట్టి ఆలకించుము. ఆమేన్.

# నూతన సంవత్సర ప్రార్థన

ద్వితీ 11:12; కీర్తన 65:8-13; II పేతురు 3:8; ఆది 1:14; యోబు 36:11-26; కీర్తన 61:6; 90:1-4; 102:27; యెషయా 29:1; హబక్కూకు 3:2; గలతీ 4:10.

'నీ ముఖకాంతి మామీద ప్రకాశింపజేయుము'. కీర్తన 67:3.

1. ఓ ప్రభువా! నీ ముఖకాంతి మా మీదను, భూమి మీదను, నీ సృష్టి మీదను ప్రకాశింపజేయుము. మా జీవితకాలమంతయు నీ రాకడ వరకు సంఘముమీద నీ ముఖకాంతి ప్రకాశింపచేయుము.

2. భూలోకముమీద నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము. ఆకాశము మీద నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము. సంఘముమీద నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము. ***ఇచ్చట మా అందరిపై నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము.***

3. పాపములతోను, పాపఫలితములైన వ్యాధులు, బాధలు, ఇబ్బందులు, అనారోగ్యము, ధనాపేక్ష, మొదలగు చీకటులలోనున్న భూమిపై సూర్యముఖని కాంతి, చంద్రముఖకాంతి, నక్షత్రముల ముఖకాంతి ప్రకాశింపజేసినట్లు ప్రభువా! నీ ముఖకాంతిని అందరిపై ప్రకాశింపజేయుము.

4. భూతములు చెలరేగుచు, నీ రక్షణ కార్యమునకు భిన్నమైన పనులు చేయించుటనుబట్టి మత భేదములతోను; సిద్ధాంత భేదములను బట్టి వివాదములతోను, ప్రపంచము చీకటియైనది గనుక నీముఖకాంతి ప్రపంచముపై ప్రకాశింపజేయుము.

5. నీ సంఘము నీవిచ్చిన వాక్యమును అపార్థము చేసికొనుటను బట్టి, వాక్యముపై ఒకరీతిగా చీకటి క్రమ్మినను, చివరి గ్రంథమగు ప్రకటన గ్రంథముమీద నీవు బ్యాటరీ లైటువేసి, అందున్న మర్మములు లోకమునకు బయలుపడునట్లు నీ ముఖకాంతిని ప్రకాశింపచేయుచున్నందులకు నీకు వందనములు.

6. అధికమైన చీకటికార్యములు నీ రాకడకు ముందు జరుగుచున్నందున, నీ వాక్యములోని అనేక వచనములయొక్క నిజార్థము నీ సంఘమునకు తెలియుటలేదు. ***నీ ముఖకాంతిని ప్రకాశింపజేయుటవలన నీ వాక్యార్థము బయలుపడును*** గనుక ప్రకాశింపజేయుమని వేడుకొనుచున్నాము.

7. చీకటిలోనికి దీపకాంతి రాగానే, అనేక వస్తువులు ఎక్కడెక్కడ నున్నవి, ఏమి ఉన్నవి? తెలియును. అలాగే నీ వాక్యమునందలి నిజార్థము గ్రహించునట్లు, నీ వాక్యముపై ముఖకాంతిని ప్రకాశింపచేయుము.

8. వాక్య ప్రకటన చేయువారు వాక్యమును వారనుకొన్నట్లుగాక, నీ చిత్తానుసారముగా బోధించునట్లు నీ ముఖకాంతి వారిపై ప్రకాశింపజేయుము.

9. అనేకులు నీ సత్యము చెవులతో విన్నను, మనసుతో గ్రహింపలేని చీకటి వారిని ఆవరించియున్నది. అట్టివారిపై నీ ముఖకాంతి ప్రకాశింపజేయుము.

10. సూర్యకాంతి నీటిమీద, చెట్లమీద, పంటలమీద ఇతర మంచి స్థలములమీద మాత్రముకాక, గత్తర స్థలములమీద కూడ ప్రకాశించుచున్నది. అట్లే పాపులమీదను, నిన్ను అంగీకరింపని వారిమీదను నీ ముఖకాంతిని ప్రకాశింప జేయుము.

11. శతాబ్దములు గతించిపోగా, పాత సంవత్సరము గతించిపోగా, ఇంకా చీకటి ఎక్కువగుచున్న ఈ సమయమున మరెక్కువ వెలుగు, సత్యబోధ అవసరము గనుక ఈ నూతన సంవత్సరమంతయు ఇంకా ఎక్కువగా నీ ముఖకాంతి మా మీద ప్రకాశింపజేయుము.

12. ***నీ వాక్యముయొక్క సత్యార్థము మాకు తెలియనప్పుడు ఇతరులయొక్క కండ్లను ఎట్లు తెరువగలము?*** ఇతరులకెట్లు జ్ఞానము కలిగించగలము? గనుక నీ ముఖకాంతి మా మీద ఎక్కువగా ప్రకాశింపజేయుము.

13. ఈ మా ప్రార్థనలు నీ కుమారునిబట్టి అంగీకరించుమని వేడుకొను చున్నాము. ఆమేన్.

# బైబిలు మిషను ఆనవర్సరీ స్తుతులు, ప్రార్థనలు

## 31 జనవరి, 1938వ సం॥ము బైబిలుమిషను బైలుపర్చబడినది

త్రిత్వదేవా! భూమి పుట్టినది మొదలుకొని ఒకదాని తర్వాత ఒకటి ఏలాగు బయలుపరచినావో, అలాగే బైబిలుమిషనును బైలుపరచినావు. నీకు అనేక నమస్కారములు.

ఆదికాండములో నీ సృష్టిని ఒకదానితర్వాత ఒకటి, ఏలాగు ఆరు దినములు బైలుపరచినావో, ఆలాగే బైబిలు మిషనును బైలుపరచినావు నీకు అనేక స్తోత్రములు.

మోషేకాలములో ఏలాగు ధర్మశాస్త్రమును బయలుపరచినావో, అలాగే బైబిలు మిషనును బయలుపరచినావు. నీకు అనేక స్తోత్రములు.

తర్వాత ప్రవక్తల ద్వారా మలాకీవరకు ఏలాగు నీ చిత్తమును బయలు పరచినావో, అలాగే బైబిలుమిషనును బయలుపరచినావు. నీకు అనేక కృతజ్ఞతార్పణలు.

పాతనిబంధనలో నిన్ను గూర్చిన భవిష్యత్తు ఏలాగు బయలుపరచినావో, అలాగే బైబిలుమిషనును బయలుపరచినావు. నీకు అనేకమైన స్తుతులు.

నాలుగు సువార్తలలో ఏలాగు నిన్ను నీవు బయలుపరచుకొన్నావో, అలాగే బైబిలుమిషనును బయలుపరచినావు నీకు అనేకమైన స్తుతులు.

అపోస్తలులకార్యములలో నీ సంఘమును ఏలాగు బయలుపరచినావో, అలాగే బైబిలుమిషనును బయలుపరచినావు. నీకు అనేకమైన సంస్తుతులు.

పత్రికలలో నీ సంఘముయొక్క కట్టడలు ఏలాగు బైలుపరచినావో, అలాగే బైబిలుమిషనును బయలుపరచినావు నీకు అనేకమైన వినుతులు.

సిలువమీదను, సమాధిమీదను; నీ స్వంతజయమును ఏలాగు బయలు పరచినావో అలాగే బైబిలుమిషనును బయలుపరచినావు. నీకు అనేకమైన ప్రణుతులు.

సంఘముయొక్క జయమును ప్రకటన గ్రంథములో ఏలాగు బయలు పరచినావో, ఆలాగే బైబిలుమిషనును బయలుపరచినావు. నీకు అనేకమైన సాష్టాంగ నమస్కారములు.

లూథర్‌ద్వారా బైబిలు ఏలాగు బైలుపరచినావో, అలాగే మా కాలములో బైబిలుమిషనును బయలుపరచినావు. నీకు అనేకమైన నిత్య స్తోత్రములు.

బైబిలుమిషనును ఏలాగు బయలుపరచినావో, అలాగే నూతన విషయములు సన్నిధికూటములలో బయలుపరచుచున్నావు. నీకు అనేక స్తోత్రార్పణలు.

పూర్వకాలమందు భక్తులతో ఏలాగు మాట్లాడినావో, అలాగే ఇప్పుడు సన్నిధి కూటస్థులతో మాట్లాడుచున్నావు. నీకు అనేక స్తుతి, వందనములు.

బైబిలుమిషనులో ఇదివరకే కొన్ని పుస్తకములు, అనేక కరపత్రములు ప్రచురింపచేసినావు. నీకు అనేకమైన ఆనంద స్తోత్రార్పణలు.

ఇంగ్లీషులోను, మహమ్మదీయుల భాషలోను, ఓఢ్ర భాషలోను, అరవ భాషలోను, కన్నడ భాషలోను, హిందీభాషలోను కొన్ని కరపత్రములు ప్రచురింప జేసినావు. నీకు అనేకమైన దివ్య సంస్తుతులు.

బైబిలుమిషనులో నీ చిత్తమును పూర్తిగా నెరవేర్పలేని గుణమును ప్రవేశింపనిచ్చినావు. అందుమూలముగా మాకు చురుకుదనము, నీతిపాఠము నేర్పించుటకు ఉద్దేశించినావు. నీకు అనేకమైన వందన స్తోత్రార్పణలు.

బైబిలుమిషనులో నీవు సన్నిధికూటములు స్థాపించినందుకును, నీవు ఆ కూటములలో దర్శనమిచ్చి, కూటస్థుల ప్రశ్నలకు జవాబులు అందించుచున్నందుకును నీకు అనేకమైన అనంతస్తోత్రములు.

యేసుక్రీస్తు ప్రభువా! సన్నిధికూటములలో ప్రతిదినము రాకడను గురించి చిన్న ప్రసంగమును వినిపించుచున్నావు. నీకు అనేకమైన వినయ స్తోత్రములు.

ప్రభువా! నీవు సన్నిధికూటస్థులకు ***ప్రతి గురువారము సంస్కార భోజనమును వడ్డించుచున్నావు.*** నీ పాదములకు అనేకమైన హృదయానంద నమస్కారములు.

***బైబిలు మిషనులో స్వస్థిశాలలు స్థాపించుచున్నావు. నీకు అనేకమైన ప్రేమ వందనములు.***

## దేవుని మెచ్చుకొనదగిన అంశములు

దేవా! నీవు ఏ ఉద్దేశముతో బైబిలుమిషనును బయలుపరచినావో, ఆ ఉద్దేశమును కడవరకు నెరవేర్చుము.

నీవు స్థాపించిన సంఘము 850 శాఖలైనను, నీవు బైబిలుమిషనును ఎందుకు స్థాపించినావో నీ జ్ఞానమునకే తెలియును.

క్రైస్తవులున్న ఇన్ని దేశములుండగా, బైబిలుమిషనును ఇండియాలో ఎందుకు బయలుపరచినావో నీ జ్ఞానమునకే తెలియును.

లోకములో గొప్పగొప్ప పట్టణములుండగా, రాజమహేంద్రవరములో ఎందుకు బైబిలుమిషనును బయలుపరచినావో నీకే తెలియును.

మొదటి నరులు పుట్టినది మొదలుకొని ఇన్నివందల సంవత్సరములు గడువగా, 1938వ సంవత్సరములో బైబిలుమిషనును ఎందుకు బయలుపరచినావో నీకే తెలియును.

సంఘములో 850 మిషనులుండగా, లూథరన్ మిషనులోనున్న ఒక బోధకునికి ఎందుకు బైబిలుమిషనును బయలుపరచినావో; సంఘములో అనేకమంది పరమభక్తులుండగా బైబిలుమిషను ఈ ఒక్కనికే ఎందుకు బయలుపరచినావో నీకే తెలియును.

సంఘములో అనేకులగు ధనికులు ఉండగా, ధనములేని ఈ బోధకునికి బైబిలుమిషనును ఎందుకు బయలుపరచినావో నీకే తెలియును. బైబిలుమిషనును వారికి బయలుపర్చి యుండినయెడల, దీనిని గురించి ఈ పాటికి లోకమంతటికిని తెలియజేసి యుందురు.

సంఘములో అనేకమంది గ్రంథకర్తలు ఉండగా, ఈయనకే ఎందుకు బైబిలు మిషనును బయలుపరచినావో నీకే తెలియును. వారికి బైబిలుమిషనును బయలుపరచి యున్నయెడల నేటికి అనేక పుస్తకములు, కరపత్రములు అచ్చువేసి అందరికి తెలియజేసి యుందురు.

## ప్రార్థనాంశములు

***1. తండ్రీ! మామీదికి వచ్చుచున్న నిందలు పరిహరించుము.*** 2. తప్పు అర్థము చేసికొనుచున్న వారికి, నీవు నిజము తెలియజేయుము. 3. మాద్వారా నీవు చేయదలంచుకొన్న అన్ని పనులు సాగించుము. 4. ప్రతి స్థలములో బైబిలు మిషనును స్థాపించుము. 5. ప్రతి కుటుంబములో సన్నిధికూటములు స్థాపించుము. 6. ప్రతిచోట స్వస్థికూటములు స్థాపించుము. 7. అన్ని మిషనులలోనున్న సందేహములను, తప్పు సిద్ధాంతములను రద్దుపరచుము. 8. ***నీవు చెప్పుచున్న వర్తమానములు త్వరలో అచ్చువేయుటకు మాకు శక్తి దయచేయుము.*** 9. మాకు విరోధముగా నున్నవారిని క్షమించుము. 10. బైబిలుమిషను చరిత్రను అన్ని భాషలలో ప్రకటింపజేయుము. 11.

అనేకమైన బైబిలు కీర్తనలు రచింపగల కవులను లేపుము. 12. తెలుగులో బైబిలంతయును పద్యములుగా రచింపగల కవులను లేపుము. 13. రాకడ వర్తమానమును ఎడతెరిపి లేకుండా చాటించు సామర్ధ్యమును అనుగ్రహించుము. 14. సాతాను యొక్కయు, అతని దూతలయొక్కయు, అతని అనుచరుల యొక్కయు ప్రయత్నములను ఆపుచేయుము. 15. బైబిలుమిషనువారు చేయదలంచుచున్న పనులన్నియు సఫలపరచుము. 16. **బైబిలుమిషనువారు ఏయే క్రొత్త పనులు చేయవలెనో అవి వారికి బయలుపరచుము.** తండ్రికిని, కుమారునికిని, పరిశుద్ధాత్మకును నిత్య మంగళ స్తోత్రములు.

ఓ త్రిత్వదేవా! ఓ సృష్టికర్తవైన ప్రభువా! మమ్మును కలుగజేసిన తండ్రీ! మా ప్రార్ధనలు, మా స్తుతులు, మా కోరికలు, మా పనులు; నీ ఘనతకొరకును, ప్రజలకు ఉపయోగము కొరకును సిద్ధించునట్లు త్వరగా రానైయున్న యేసుప్రభువుద్వారా ఆలకించుమని నిన్ను బ్రతిమాలుకొనుచున్నాము. ఆమేన్.

# అయ్యగారి జ్ఞాపకార్థ ప్రార్థన

**(యం. దేవదాసు అయ్యగారు ది. 9 ఫిబ్రవరి 1960న ప్రభువునందు నిద్రించినారు)**

(సామెతలు 10:7, 11; హెబ్రీ 13:7,17; II దిన. 20:20; I కొరి. 4:17; కార్య 4:26)

1. పరిశుద్ధుడవైన తండ్రీ! నీవు అనాదికాలములోనే నీ అనాది యోచననుబట్టి, రక్షణ కార్యక్రమములో వాడుకొనుటకు ఆయావారిని కాలక్రమమున లోకమునకు పంపిన నీకు నుతులు.

2. ఈ కడవరి కాలములో నీ దాసుడును, మా ఆత్మీయ జనకుడునైన దేవదాసు అయ్యగారిని, బైబిలుమిషనును లోకమునకు బయలుపరచుటకుగాను, వరముగా ననుగ్రహించిన నీకు ఆనంద స్తోత్రములు.

3. జన్మకాలమునుండి జీవితాంతమువరకు పరిశుద్ధ జీవితమందు వర్ధిల్లజేసిన నీకు ప్రణుతులు.

4. బాల్యము నుండియు, ఇతరులకు ఆశ్చర్యము కలిగించు ప్రార్థనలు చేయుటయందును, నిన్ను స్తుతించు గీతములు రచించుటయందును ప్రత్యేకత ననుగ్రహించిన నీకు వినుతులు.

5. యౌవనమునుండి వృద్ధాప్యమువరకు ఆంధ్ర ఇవాంజిలికల్ లూథరన్ మిషనునందు నీకు మహిమకరముగాను, అనేకులకు దీవెనకరముగాను నుండగల సేవను నీ దాసునిద్వారా జరిగించిన నీకు వందనములు.

6. వృద్ధాప్యము, అనారోగ్యస్థితి గల ఈ సమయములో బైబిలుమిషనును గాలిమీద తెలుగుభాషలో వ్రాసిచూపిన నీ ప్రత్యక్షతకు నీదాసుడు లోబడగల వినయ మనసు దయచేసిన నీకు వినయ వందనములు.

7. ధనమును, జనసహాయమును లేనప్పుడు, లూథరన్ మిషనునకు రిజైన్ ఇచ్చి, 'సైన్యముయొక్క యువరాజువలె నీవు వెలుపలికి రమ్ము' అని నీవచ్చిన నీ పిలుపును అంగీకరింపగల విధేయత నీ దాసునికి అనుగ్రహించిన నీకు నమస్కారములు.

8. సంఘము నీ దాసునికి సంస్కార భోజనమీయ నిరాకరించినపుడు నీవే వచ్చి స్వయముగా రొట్టె, ద్రాక్షారసముల నిచ్చి; ఎవరికిని, ఎన్నడును లేని నూతనానుభవమును నీ దాసునిద్వారా వెల్లడిలోనికి తెచ్చిన నీకు సంస్తుతులు.

9. మరియు నీ దాసుని బరంపురములోని దైవసన్నిధిలోనికి నడిపించి మానవులచేత నీ దాసునికి అభిషేకము నిప్పించక, త్రియేక దేవుడవైన నీవే స్వయముగా అక్కడే అభిషేకించి, ఇతరులను సేవకు అభిషేకింపగల అనుభవాధికారమును ఇచ్చిన నీకు స్తోత్రము.

10. 1938 సం॥ము జనవరి 31వ తేదీని నీ దాసునికి బైబిలు మిషనును గాలియందు వ్రాసి చూపించి, తన సహకారులతో మే 5వ తేదీన స్థాపించి, బహిరంగమునకు ఈ మిషనును చూపించినందుకు వందనములు.

11. మరియు ఈ సంఘాభివృద్ధికి బైబిలు తరగతులు, పనివారి కూటములు, ఉపవాస ప్రార్థనాకూటములు, సామాన్య ప్రార్థనలు జరిగించు ఏర్పాటును; సువార్తికులను హస్తనిక్షేపణద్వారా ప్రత్యేకపరచుట, పాస్టర్లను అభిషేకించుట, స్త్రీలను పనివారలుగా ఏర్పరచుటయును, ముఖ్యమైన బోధలను చార్టుల రూపములో వ్రాయించుట, బూర ప్రసంగములు చెప్పించుట, కొన్ని గ్రంథములను మరియు లక్షలాది సువార్త పత్రికలను అచ్చువేయించుట, ఈ మొదలగు పనులను నీ దాసునిద్వారా చేయించుకొన్న నీ కృపగల కార్యక్రమమునకు వేలాది నుతులు.

12. నీ దాసునిద్వారా ప్రత్తిపాడు, ఏలూరు, గుంటూరు మొదలగు స్థలములలో స్వస్థిశాలలను స్థాపింపజేసి, లక్షలాది ప్రజలకు శరీరాత్మీయ ఉపకారములను చేకూర్చుచున్న నీ కృపకు మహిమస్తోత్రములు.

13. బైబిలుగ్రంథము నందలి ప్రత్యక్షతలన్నియు నీ దాసునికి అనుగ్రహించి, అవన్నియు నేటి కాలమందును జరుగుననునట్టి అనుభవమును అనేకులకు ఆయనద్వారా అందింపజేసిన నీకు ప్రణుతులు.

14. **"దేవుడందరికి కనబడును, మాట్లాడును"** అనునట్టి గొప్ప సందేశము అన్ని మతముల వారికిని, మిషనుల వారికిని, నీ దాసునిద్వారా అందింపజేసినావు గనుక నీకు ఆగని సంస్తుతులు.

15. దైవగ్రంథమగు బైబిలులోని గొప్ప మర్మములు నీ దాసుని ఉపదేశముల ద్వారాను, ప్రార్థనలద్వారాను, వ్రాతలద్వారాను; ముఖ్యముగా రెండవ రాకడ, పెండ్లి కుమార్తె, దైవలక్షణముల స్తుతి, సాతానును ఎదిరించుట అను గొప్ప విషయములను లోకమునకు బయలుపరచుట ద్వారా నీ కృపను చూపించినందుకు హృదయ వందనములు.

16. క్రమముగాను, కారణసహితముగాను చేయుస్తుతిని; ఆ స్తుతియొక్క నిజస్థితిని; దానివలన కలుగు ఫలితమును; సృష్టినిబట్టి, వాక్యమునుబట్టి, అనుభవమునుబట్టి ఏలాగు స్తుతి చేయవలెనో నేర్పిన నీ దాసుని మా యెదుట నుంచిన ప్రభువా! నీకు ప్రణుతులు.

17. ఓ ప్రభువా! బైబిలులో ఏయే గ్రంథములను నీ సంఘము నిర్లక్ష్యముగా చూచుటవలన, సైతాను ఆయాగ్రంథముల విషయములో వారి జ్ఞానముపై ముసుగు వేసినదో, అట్టి గ్రంథములగు పరమగీతము, ప్రకటన అను పుస్తకముల పూర్తి వివరమును నీ దాసునిద్వారా మాకందించి, మాపై సైతానువేసిన ముసుగును తీసివేసినందుకు నీకు మా ఆనంద స్తోత్రములు.

18. ప్రభువా! అంతరంగముగా నీవిచ్చు సంస్కారము తీసికొనగల అనుభవము ఒక్క నీ దాసునికి మాత్రమే కాదనియు, అట్టి అనుభవము సంఘములలో అనేకులు పొందగలరను ఉపదేశమును అందించి అట్టి అనుభవము ఇతరులనేకులలకు కలుగు భాగ్యము నీ దాసునిద్వారా గలిగించిన దేవా! నీకు నిత్య సంస్తుతులు.

19. సన్నిధికూటములను నీ దాసునిద్వారా స్థాపించి వానివలన లోకమునకు, సంఘమునకు, అనేక మేళ్ళు అనగా దూతలతోను, పరలోక పరిశుద్ధులతోను, భూలోక పరిశుద్ధులతోను, కైలాసమందలి ఋషులతోను, దురాత్మలతోను మాట్లాడగల శక్తి విశ్వాసులకు కలదని, లోకమునకు ఎరుకపరచిన నీ దీవెనకరమైన స్థితికి మా హృదయపూర్వక వందనములు.

20. మరణకరమైన శ్రమను ఒక ముల్లుగా ఈ నీ దాసుని శరీరములో ఉంచి, ఆ శ్రమద్వారా నీ సేవకులకు, ప్రజలకు గొప్ప ఆదరణ కలిగించి, వాటివలన శ్రమలలో నున్నవారికి గొప్ప మహిమ కలదని తెలియజేసినావు గనుక నీకు మహిమ నుతులు.

21. అన్ని స్థితులలో నుండువారికి సరిపడు కీర్తనలను, అందరికి అర్థమగునట్లు సులభశైలిలో పద్యములను; దండకము, తుపాను పాట మొదలగునవి నీ దాసుని ద్వారా వ్రాయించి మహిమ పొందిన నీ నామమును స్తుతులతో ఘనపరచు చున్నాము.

22. నీతిమంతుడు విశ్వాసమూలమున జీవించునను వాక్యప్రకారము నీ దాసుడు జీతములపై ఆధారపడక, కేవలము నీపై మాత్రమే ఆధారపడి జీవించునట్లు చేసి, అట్టి విశ్వాస జీవితమును వాక్య సేవకులకుకూడ నేర్పించుటకు నీ దాసుని వాడుకొన్నందులకు నీకు నిత్య ప్రణుతులు.

23. గత కాలమందును, ప్రస్తుత కాలమందును, అనేకులు నీనామ మెరుగకుండ చనిపోయినవారి రక్షణ విషయము ప్రార్థించగా, వారికి పాతాళమందు సువార్త విను ఏర్పాటుగలదని నీ దాసునికి తెలియజేసిన నీకు వందనములు. మరియు నీ దాసుని శరీరమును మంచము మీదనే యుంచి ఆత్మను ఆయా స్థలములకును, పాతాళమునకును, తీసికొనివెళ్ళి అక్కడ ఆయనతో సేవ చేయించుకొనుచున్న ప్రభువా! నీకనేక వందనములు.

24. అనేకులద్వారా నీవు సొమ్ము పంపించినప్పుడు ఆ సొమ్మును ముట్టుకొనకయు, నీవు పంపిన లెక్కలేనంత సొమ్ముతో నీ మహిమార్థమైన అనేక కార్యములు నీ దాసునిద్వారా చేయించుకొన్న నీకు నమస్కారములు.

25. 'చేయవలసిన ప్రార్థనలన్నియు ముగించినానని' అనేకమార్లు చెప్పి, 'నేను చనిపోయినను ఎక్కడికి వెళతాను? మీతోనే ఉంటాను' అని చెప్పి, చివరికి ఈ భౌతిక దేహమును చాలించినను, నీ దాసుని ఆత్మను మాతోనే ఉంచి అనేక వర్తమానములు, పనులు, అద్భుతములు, నీ మహిమకొరకు చేయించుకొనుచున్నావు. గనుక నీకు మా ఆనంద స్తోత్రములు. ఆమేన్.

# కానుకల పండుగ స్తుతి

**(ప్రతి సంవత్సరము ఫిబ్రవరి నెలలో ఈ పండుగను ఆచరింతుము)**

ఆది 4:1-7; 14:20; 28:22; లేవీ 27:30-33; ద్వితీ. 14:22-29; 16:17; సంఖ్యా 18:21; II దిన. 31:5,10; I దిన. 29:9; సామె 3:9-10; 19:17; మలాకీ 3:8-10; నెహెమ్యా 10:37; మత్తయి 2:11 5:20; లూకా 21:1-4; యోబు 41:11; కార్య 11:29; 20:35; రోమా 15:26; I కొరి 16:1-2; II కొరి 8అధ్యా॥ 9:5-8; 12-14; గలతీ. 6:6; ఫిలిప్పీ 4:18-19; I తిమోతి 6:19; హెబ్రీ 7:1-5; 13:14-17.

మనకు దేవుడిచ్చెను గనుక మనము ఆయన సేవకు కృతజ్ఞత కానుక ఇయ్యవలెను. దేవుడిచ్చెను గనుక మనము బీదల కియ్యవలెను. దేవుడిచ్చెను గనుక మనము రోగుల కియ్యవలెను. ***దేవుడిచ్చెను గనుక మనము అక్కర కనబడినప్పుడు, ధనికులకు సహితము ఇయ్యవలెను.*** దేవుడిచ్చెను గనుక మనము ధర్మకార్యములన్నిటికిని ఇయ్యవలెను. దేవుడు నిత్యము ఇచ్చువాడై యున్నాడు గనుక మనమును నిత్యమును ఇచ్చువారమై యుండవలెను. ధన్యతయైనను, ధనసంపాదనయైనను, ఐశ్వర్యమైనను, **దేవుని మెప్పైనను, *మనసానందమైనను ఇందులోనే కనబడును.***

దానకర్తవైన తండ్రీ! నీవు మాకు ఎండ, వెన్నెల, వర్షము, గాలి, నేల, వృక్షములు, జీవరాసులను దానముగానిచ్చిన నీకు స్తుతులు. కృపగల తండ్రీ! దూతలును, బైబిలును, సంఘమును ఇవియు నీ దానములే. గనుక నీకు వందనములు. తండ్రీ! క్రిస్మసునాడు కుమార దానము; మంచి

శుక్రవారమునాడు కుమారుని ప్రాణదానము; పెంతెకొస్తునాడు దైవాత్మ దానమును, మాకు దయచేసిన నీకు మా హృదయపూర్వక వందనములు.

తండ్రీ! మేమిచ్చు కానుకలు నీవిచ్చు దానముల యెదుట ఏమూల? మేము కృతజ్ఞతతో మా హృదయమును నింపుకొనుటయే, మేమిచ్చు కానుకలకంటె గొప్ప కానుక. గనుక ఈ గొప్ప కానుకయైన కృతజ్ఞత నీకు చెల్లించుచున్నాము. మా స్తోత్రములు క్రీస్తు నామమున అంగీకరించుము. ఆమేన్.

ప్రార్థన:– జాలిగల తండ్రీ! నీవు మాకు ఇచ్చుచున్నట్లు మేము నీకును, రోగులకును, పేదలకును, సమస్త ధర్మకార్యములకును ఇచ్చునట్లు దీవించుము. నీవు సర్వదా ఇచ్చుచున్నట్టు, మేమును ఎప్పుడును దానములను ఇచ్చు ధర్మగుణమును దయచేయుమని త్వరగా వచ్చుచున్న యేసు నామమున వేడుకొనుచున్నాము.

# భస్మ బుధవారము కొరకైన ప్రార్థన

ప్రార్థన:- మిక్కిలి ప్రియుడవైన తండ్రీ! తిరిగి మమ్ములను మండల దినములలో ప్రవేశపెట్టి **మాకు జీవము పోయుటకును, సాతాను జీవమును నశింపజేయుటకును** ఈ ధ్యాన దినములను భస్మ బుధవారముతో ప్రారంభముచేసిన తండ్రీ! నీకు స్తోత్రము. సాతాను క్రియలు నాశనము చేయుటకును, సాతాను బలమును పడగొట్టివేయుటకును, మాకు ఈ నలుబది బాణములను ఇచ్చినందుకు స్తోత్రములు. నీవు నలుబది దినములు ఉపవాసముచేసి సాతానును జయించినావు. మోషే నలుబది దినములు ఉపవాసము చేసి సాతానును బంధించు పదియాజ్ఞలు సంపాదించియున్నాడు. అలాగే మేమును ఈ నలుబది ధ్యాన దినములను వాడుకొనుటద్వారా, సాతానును మా పాదముల క్రింద త్రొక్కగల కృప దయచేయుము.

తండ్రీ! భస్మ బుధవారమునాడు మేము ఒక విత్తనమును భూమిలో విత్తిన యెడల అదిమంచి శుక్రవారమునాటికి ఏ విధముగా నెదుగునో, ఆ విధముగానే నీవు మా కొరకు సిలువను భరించి జయించిన, ఈ జయ విత్తనము మాలో విత్తబడి వృద్ధిపొందు విశ్వాసము దయచేయుము. నీవు నలుబది ఉపవాస ప్రార్థన ధ్యాన దినములయందు బలము పొంది, ఆ బలముద్వారా శ్రమలకు ఎదురెక్కి జయించినట్లు, మేమును ధ్యానాభ్యాసముచే సంపాదించిన బలమునుబట్టి జీవము కలిగి శ్రమలకు ఎదురెక్కు కృప నిమ్ము.

తండ్రీ! ప్రతివారు నశింపక నిత్యజీవము పొందునట్లు, నీవు ఈలోకమునకు వచ్చియున్నావు. నశించువారికి ఈ ధ్యాన దినములద్వారా

జీవము పోయబడునట్లు సహాయము దయచేయుము. మరియు క్రైస్తవ బిడ్డలయొక్క పాటలు, మాటలు, ఉపదేశములు, ధ్యానములు మొదలగువాటిద్వారా అనేకులు మేలుపొందు కృప ననుగ్రహింపుము. ***ఈ నలుబది దినముల ధ్యానములలో ఒక దిన ధ్యానముకంటె మరియొక దినధ్యానము మమ్మును తెప్పరిల్ల జేయునట్లు చేయుము.*** తండ్రీ! కోడి పొదిగిటిలోనున్న ఆకారములేని గ్రుడ్లు, 21 దినములకు పిల్లరూపమును దాల్చి జీవము కలిగియున్నట్లు, మేమును *నలుబది దినములు* సిలువ పొదిగిటిలో నుండి, *జయశీలుడవైన నీ రూపము దాల్చుకొని* సమృద్ధిజీవము పొందునట్లు చేయుము. మట్టిలోని విత్తనము చెమ్మను పీల్చుకొని, మూడవరోజునకు మన్నును పెల్లగించుకొని, మొలకెత్తి బయటికివచ్చి, సూర్యుని ఎదుట పడునట్లు, ***ఈ నలుబది దినముల ధ్యాన చెమ్మవలన పాపపు మట్టిని, బలహీనతలను పెల్లగించుకొని బయటికి వచ్చి, నీతి సూర్యుడవైన నిన్ను అంటుకొని బ్రతుకునట్టి జీవము దయచేయుము.***

తండ్రీ! మా చేతిలో ఒక రూక ఉంటే వాడుకొందుము. కాని పారవేయము. అలాగే ఈ నలుబది దినములను ***విలువైన నాణెములుగా వాడుకొని మేలు పొందునట్లు*** దీవెన దయచేయుమని త్వరగా వచ్చుచున్న ప్రభువుద్వారా వేడుకొనుచున్నాము. ఆమేన్.

ఆది 18:27; యోబు 30:19; 42:6; ఆది 3:19; యోనా 3:5-10; మత్తయి 20:17-19; మార్కు 10:32-34; లూకా18:31-32.

# మట్టలాదివారము

జెకర్యా 9:9; మత్తయి 21:1-17; మార్కు 11:1-11; లూకా 19:29-46; యోహాను 12:12-16.

**ప్రార్థన:-** రారాజువైన ప్రభువా! ప్రవక్తలు ప్రవచించిన ప్రకారము, గార్ధభాసీనుడవై జయోత్సాహముతో యెరూషలేమునందు ప్రవేశించిన నీకు నుతులు. ఈ యెరూషలేము ప్రవేశమును, నీ రెండవరాకడలో పరలోక నూతన యెరూషలేమునందు ప్రవేశించుటకు సూచనగా జరిగించిన నీకు స్తోత్రములు. నీవు భూలోక యెరూషలేమునకు వెళ్ళునప్పుడు గార్ధభముపై కూర్చుండుటను; రేపు నీవు రెండవ రాకడలో పెండ్లికుమార్తెను తీసికొని వెళ్ళుటకు వచ్చునప్పుడు, నీవు కూర్చుండు మేఘమునకు సూచనగా చూపించిన నీకు స్తుతులు. నీవు యెరూషలేమునకు జయోత్సవముతో వెళ్ళినప్పుడు నీముందు ఒకగుంపు, నీవెనుక ఒక గుంపు ఉన్నట్లు, నీవు రెండవ రాకడలో మేఘముమీద వచ్చునప్పుడు; నిన్ను కలసికొను మృతుల గుంపును, సజీవుల గుంపును సూచించునట్లు చేసిన నీకు, నాకు తోచినన్ని స్తుతులు. నీవు కూర్చున్న గార్ధభముపై శిష్యులుపరచిన వస్త్రమును, నీవు రాకడలో వాహనముగా ఏర్పరచుకొన్న **షెఖీనా మేఘముపై పెండ్లికుమార్తె వేయు స్తుతివస్త్రమునకు ముంగుర్తుగా నేర్పరచిన** నీ ప్రేమకార్యము నిమిత్తమై నా జ్ఞానమునకు తోచినన్ని వందనములు. ప్రభువా! నీకు జయము రాకముందే జయము పాడినప్పుడు నీవు అంగీకరించుటవలన, విశ్వాసులకు ముందు అపజయము కనబడినను చివరికి జయమే అనియు, అపజయము ఉన్నను, స్తుతించవలెననియు; జయమను కలవరింపు నీ బిడ్డలెప్పుడును కలిగి ఉండవలెననియు, **నిన్ను బట్టి మాకు అన్ని విషయములలో జయమేననియు మాకు నేర్పిన నీకు నా** శక్తికిమించిన ప్రణుతులు. ఈ మా స్తుతులను మేఘారూఢుడై రానున్న ప్రభువుద్వారా అంగీకరించుము. ఆమేన్.

# పరిశుద్ధ గురువారము కొరకైన స్తుతి ప్రార్థన

1. ప్రేమాస్వరూపుడవైన తండ్రీ! అంతములేని ప్రేమను అగుపరచిన తండ్రీ! మమ్ములను అంతమువరకు ప్రేమించిన తండ్రీ! ఈ ప్రత్యేక దినమున నీ దివ్య ప్రేమను కొనియాడుచు మిమ్ములను నమస్కరించు చున్నాము.

2. తండ్రీ యొద్దనుండి మాయొద్దకు వచ్చిన కుమారుడవైన దేవా! తండ్రి అంతరంగములోదాగిన అనాది ప్రేమను ఈ దినమున వెళ్ళడిచేసిన నీ ప్రేమకు స్తుతులు. నీ పవిత్ర హస్తములను మా మంటిపాదములపై తాకించిన నీ అపార కనికరము నిమిత్తమును మరియు నీ రక్తసిక్త హస్తములకు మా రిక్త హస్తములను జోడించి వందించుచున్నాము.

3. తండ్రియొక్క ప్రభావ మహత్యములను వస్త్రమువలె ధరించుకొనిన తండ్రీ! నీపై వస్త్రమును మాకొరకు తీసివేసి మాకు చాకిరీ చేయుటకు పరిచారకునిగా మారిపోయిన మిమ్ములను మాహృదయమంతటితో కీర్తించుచున్నాము.

4. బోధకుడవనియు, ప్రభువనియు పిలువబడిన తండ్రీ! ఈలోకపు గురువులవలె కాక, మీరే మీ శిష్యుల పాదములమట్టునకు వంగి వారిని శుద్ధీకరించిన మీ తగ్గింపునకు మీకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాము.

5. ఏడేండ్ల పెండ్లివిందులో నీ చెంత నన్ను కూర్చుండబెట్టు కొననైయున్న తండ్రీ! భోజనపంక్తినుండి లేచి పరిచర్యకు ఉపక్రమించిన ప్రాణనాధుడ నీకు అనేక వందనములు.

6. మహిమసింహాసనము నుండి దిగివచ్చిన తండ్రీ! నాపైన నీకున్న శ్రద్ధాసక్తులు కనపరచుటకు నీపై వస్త్రము తీసి ప్రక్కన బెట్టి మీ పరిచర్య సిద్ధబాటుకై మీకు మా వందన స్తోత్రములు.

7. సత్యమను దట్టీచేత నా నడుమును బలపరచుటకు నీ నడుమునకు తువాలు కట్టుకొనిన తండ్రీ! నీ ప్రాణ పరిక్రయ పరిచర్యరూపము నిమిత్తమై నీకు అనంతకాల సంస్తుతులు.

8. ఒక సిపాయివలె కష్టపడి పనిచేసిన తండ్రీ! నీ పరిచర్య అంతటిలో నీకు సహకారులు ఎవ్వరు లేనప్పటికినీ! వెరువక, వెనుదీయక ఒంటరిగా నీ ప్రయాసను ముగించిన ప్రాణరక్షకా! నీకు నా ఆత్మానంద ప్రణుతులు.

9. ప్రాణప్రియుడవైన తండ్రీ! దూరస్తులమైన మాకు నీ పరిచర్య విధానమును ప్రత్యక్షపరచి మీరు చేసిన పాదశుద్ధి క్రమమును మాకును అందించిన తండ్రీ! నీకే మా వందనములు.

10. నీ పావనామృత హస్తములతో నేడు ఈ పాప మాలిన్య పాదములు తాకి పరిశుద్ధ సృష్టిగా మార్చిన రక్షకా నా వందనములు.

11. ఒకరి పాదములు మరొకరికి తగులుట, అభ్యంతరకరమైన ఈలోకములో మీ పరలోకపు ప్రేమ మానవ అభ్యంతరములన్నింటినీ మించినదని ఋజువుపరచుటకు నీ పరిశుద్ధ హస్తములతో మా పాదములను పరిపూర్ణముగా కడుగుటద్వారా, నీ ప్రేమ పరిమళములను మాపై గుభాళింప చేసిన ప్రేమోన్నతుడా నీకే నా ప్రేమానంద ప్రణుతులు.

12. నీ నోటినుండి వచ్చిన వాక్యాజలముతోనూ, నీ శరీరమునుండి కారిన రక్తజలముతోనూ, నీ అంతరంగము నుండి ప్రవహించిన ఆత్మ జలముతోను, నీ రాకడ వధువును శుద్ధీకరించిన ప్రాణ ప్రియుడా! నీకే మా స్తోత్రములు.

13. నీ సత్య వెలుగుతో మా హృదయ దీపము వెలిగించిన తండ్రి! ఈలోకపు చీకట్లను, నైజపు చాయలను మా హృదయముల నుండి అంతరింపజేసిన ఆత్మ వరుడా! నీకే నా నిత్య నుతులు.

14. ఆత్మాదానకర్తా! నీ హస్తధాన శుద్ధినిబట్టి మాకు కలిగిన సత్యదానవృద్ధితో మిమ్మును  హెచ్చుగా కీర్తించుచున్నాము.

15. నీ అడుగులలో మా అడుగులు స్థిరపరచిన తండ్రీ! నీ జాడలలోని మహిమ సారమును వెదజల్లుటకు నీ మహిమ హస్తములతో మా జాడలను శుద్ధిచేసిన ప్రాణనాధా! నీకే వినయ వందనములు.

16. 'కేవలము పవిత్రులైన' వారలనుగా నీశిష్యులను మార్చిన తండ్రీ! మీరు ఇచ్చు జీవశుద్ధి కేవలము మహిమగలవారినిగా వారిని మార్చుటకే కాక మమ్ములను కూడ అట్టి శుద్ధిగలవారలనుగా మార్చినందులకు మా నిత్య సంస్తుతులు.

ఈ నీ మహోన్నతమైన పరిచర్యద్వారా తొట్రిల్లకుండా మమ్మును కాపాడి, నీ షెఖీనా మహిమ ఎదుట నీ నూతన యెరూషలేము పరిపూర్ణత ఎదుట ఆనందముతో నిలువబెట్టుదువని నమ్ముచూ, పెండ్లికుమారునిగా వచ్చుచున్న యేసునామమున ఈ మా స్తుతులు స్తోత్రములు సమర్పించుచున్నాము తండ్రీ!  ఆమేన్.

# మంచి శుక్రవారము -1

క్రీస్తు శ్రమల ప్రవచనములు - వాటి నెరవేర్పులు

| | ప్రవచనము | నెరవేర్పు |
|---|---|---|
| 1. | యూదులు మరియు అన్యులు ఆయనను నిరాకరించుట. కీర్తన 21:1; 22:12; 41:5; 56:5; 69:8; 118:22,23; యెషయా 6:9,10; 8:14; 29:13; 49:7; 53:3; 65:2. | యోహాను 1:10-11 అన్న, కయప-వీరు యూదులు; హేరోదు, పిలాతు- వీరు అన్యులు; వీరిరువు కలసి ఆయనను నిరాకరించిరి. |
| 2. | ప్రభువును బాధించువారు కీర్తన 22:6; 35:7,12; 56:5; 74:10; 109:2 | మత్తయి 26:3; మార్కు 14:1; లూకా 22:1 |
| 3. | యెరూషలేములో ప్రవేశించుట కీర్తన8:2; 118:26; జెకర్యా 9:9 | మత్తయి 21:1-11; మార్కు 11:1-11 లూకా 19:29-44; యోహాను12:12-29 |
| 4. | గెత్సేమనే, కీర్తన 22:14-15 | మత్తయి 26:36-39; మార్కు 14:3-36;లూకా 22:42-44 |
| 5. | స్నేహితుని వలన అప్పగింపబడుట కీర్తన 41:9; 55:12-14 | మత్తయి 26:49; మార్కు14:45; లూకా 22:42-44 |
| 6. | శిష్యులచే విడిచిపెట్టబడుట జెకర్యా 13:7 | మత్తయి 26:31,56; |
| 7. | ముప్పది నాణెముల విలువ జెకర్యా 11:12 | మత్తయి 26:15; మార్కు 14:10-11; లూకా 22:5 |

Bible Mission HQ Guntur

| | | |
|---|---|---|
| 8. | కుమ్మరివాని పొలము కొనుట<br>జెకర్యా 11:13 | మత్తయి 27:7 |
| 9. | యూదా ఇస్కరియోతు మరణము<br>కీర్తన 55:15,23; 109:17 | మత్త.27:3-10;కార్య 1:18,19 |
| 10. | మనకు బదులు ఆయనకు శ్రమ<br>యెషయా 53:4-6,12;<br>దానియేలు 9:26 | మత్తయి 20:28 |
| 11. | అబద్ధ సాక్ష్యములు చెప్పుట<br>కీర్తన 27:12; 35:11; 109:2 | మత్తయి 26:59-60; మార్కు<br>14:55-60; లూకా 23:1-2 |
| 12. | ఆయన నోరు తెరవకుండుట<br>కీర్తన 38:13; యెషయా 53:7 | మత్తయి 26:62; 27:12-14;<br>మార్కు 14:60; 15:4,5 |
| 13. | ఆయనను కర్రతో కొట్టుట<br>మీకా 5:1 | మత్తయి 27:30; మార్కు15:19;<br>యోహాను 19:1-3 |
| 14. | అవమానించుట, గుద్దుట, కొట్టుట<br>ఉమ్మివేయుట కీర్తన 35:15-21;<br>యెషయా 50:6 | మత్త.26:67; 27:26,30,31;<br>మార్కు 14:65; లూకా 22:<br>62-65; యోహాను 19:1-3 |
| 15. | అపహసించుట<br>కీర్తన 22:7,8,16; 109:25 | మత్తయి 27:39-44;<br>మార్కు 15:29-32; లూకా<br>23:35-38 |
| 16. | ఆయనను పొడుచుట, గాయములు<br>కీర్తన 22:16; జకర్యా 13:6 | లూకా 23:33; యోహాను<br>19:18,34 (సిలువ) |
| 17. | సిలువమీది 1వ మాట శత్రువుల<br>కొరకు ప్రార్థన, విజ్ఞాపన.<br>కీర్తన 109:4; యెషయా 53:12 | లూకా 23:34 |

Bible Mission HQ Guntur

| | |
|---|---|
| 18. 4వ మాట నా దేవా! నా దేవా! కీర్తన 22:1 | మత్త. 27:46; మార్కు 15:34 |
| 19. 7వ మాట, ఆత్మను అప్పగించుట కీర్తన 31:5 | లూకా 23:46 |
| 20. చేదు చిరకనిచ్చుట. కీర్తన 69:21 | మత్త. 27:34; మార్కు 15:23 లూకా23:6; యోహాను 19:29 |
| 21. నేరస్థులలో ఒకడుగా ఎంచబడుట యెషయా 53:12 | మత్త. 27:38; మార్కు 15:27 లూకా 23:33; యోహాను 19:18 |
| 22. వస్త్రముల కొరకు చీట్లు కీర్తన 22:18 | మత్త. 27:35; మార్కు 15:24 |
| 23. యౌవ్వనములో మరణము కీర్తన 89:45; 102:24 | 33 1/2 సం॥లప్పుడు చనిపోయెను, మార్కు 15:37. |
| 24. ఇష్టపూర్వకమైన మరణము కీర్తన 40:8 | మత్తయి 26:47-56 యోహాను 18:1-11 |
| 25. ఎముకలు విరువబడవు నిర్గమ 12:46; కీర్తన 34:20 | యోహాను 19:33-36 |
| 26. ధనికులతో పాతిపెట్టబడుట యెషయా 53:9 | మత్తయి 27:57-60; మార్కు 15:42-46; లూకా 23:50-53; యోహాను 19:38-41 |

Bible Mission HQ Guntur

# మంచి శుక్రవారము - 2

మత్తయి 26:36-75; 27వ అధ్యా॥; మార్కు 14:32-72; 15వ అధ్యా॥; లూకా 22:39-71; 23వ అధ్యా॥; యోహాను 18:19 అధ్యా॥.

1. ప్రభువా! 'తోటలో నీవు 'ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము' అని ప్రార్థించినావు. మా పాపములవలన నీకు ఎంతో బాధ కలుగబట్టి శ్రమ తొలగకపోయినను ప్రార్థించినావు. సహించినావు. గనుక నీకు మా నమస్కారములు. 2. మా పాపమువలననే నీకు అంతరంగములో శ్రమ, మనసులో శ్రమ, శరీరములో శ్రమ. గనుకనే నీ రక్తము చెమటగా వచ్చినది. నా నిమిత్తము ఇట్టి గొప్ప శ్రమ అనుభవించినావు గనుక నీకు స్తోత్రములు. 3. యూదా నిన్ను ముద్దుపెట్టుకొని అప్పగించెను. ఇది నీకు గొప్ప విచారము. అయినను నీవు అతనిని శపింపలేదు. ఈలాగు శత్రువులను క్షమించుటకు మాకు మాదిరి నేర్పిన ప్రభువా! నీకు పరిశుద్ధ నుతులు. 4. పేతురు చెవి నరకుట పిశాచిపని. అట్లుచేసిన పేతురునకు కత్తినిగూర్చిన బోధచేసి, పేతురును క్షమించి, మల్కుని స్వస్థపరచి లోకమునకు శాంతి బోధనచేసిన ప్రభువా! నీకు నిత్య జీవస్తుతులు. 5. నీ శిష్యులలో ఒక్క యోహాను తప్ప తలగానున్న పేతురును, పాదముగానున్న యూదా ఇస్కరియోతును, తప్పిపోవుట మాత్రమేగాక అందరును పారిపోయిరి. ఇది నీకెంత విచారము? ఐనను నీవు వారిపై కోపించలేదు. మరియు ఇట్లే విశ్వాసులుకూడ శ్రమలలో ఆదరించు స్నేహితులులేక యుందురనియు, మాకు బోధచేసిన ప్రభువా! నీకు ప్రణుతులు. 6. ముద్దాయివలె నీ చేతులు వెనుకకు కట్టి నిన్ను యెరూషలేము వీధులలో నడిపించినారు. ఇది నీకెంత అవమానము? మా పాపములనుబట్టి వచ్చిన ఈ యవమానము భరించి పరలోకములో మేము ముద్దాయిలము కాకుండ చేసిన దేవా! నీకు సాష్టాంగ

నమస్కారములు. 7. నేరస్థులమైన మేమును, ఆ ప్రజలును, ఆ ప్రధాన యాజకులును; రేపు పరలోకములో నీయెదుట నేరస్తులవలె నిలువబడకుండ చేయుటకే నేరములేని నీవు నేరస్థునివలె ప్రధాన యాజకుల యెదుట నిలువబడిన ప్రభువా! నిన్ను మేమెట్లు స్తుతింపగలము? గనుక నీకే హృదయపూర్వక వందనములు అర్పించుచున్నాము. 8. నీ ముఖముపై ముసుగువేసిరి. ఎందుకనగా పాపముచేయు మేము నీ ముఖమునకు మరుగుగా లేమనియు, నీకన్ను మమ్మును చూచుచున్నదను విషయమును మా మనోనేత్రములకు చూపిన ప్రభువా! నీకు మంగళ స్తోత్రములు. 9. కొరడాలతో నిన్ను కొట్టినప్పుడు నీ శరీరమంతయు, రక్తసిక్తమాయెను. మా రక్తాపరాధమునకు నీకు శిక్ష. **మాకు రక్ష నీకు శిక్ష.** మా రక్తపరాధమునకు మమ్మును కొట్టవలసినది, మా రక్తము చిందింపవలసినది. కాని నీ రక్తము మాకు బదులు చిందించిన ప్రభువా! నీకు నిత్య సంస్తుతులు. 10. పిలాతు కోర్టులో నీయందేమి నేరము కనబడలేదను మాట వినబడినను గవర్నమెంటుకు పన్నియ్యవద్దని బోధించుచున్నాడనియు, ప్రజలను తిరుగుబాటు చేయించుచున్నాడనియు, లేనిపోని నేరములు నీపై పడుటనుబట్టియు; నిన్ను అనుసరించువారు నిర్దోషులైనను, వారిపై లోకముచే లేనిపోని నేరములు వేయబడునను జ్ఞానకాంతి మాకనుగ్రహించిన ప్రభువా! మా జ్ఞానమునకు తోచినన్ని నుతులు. 11. **మానవులు ఒకరినొకరు హేళన చేసికొనుట దేవుని హేళన చేయుటయే** అను విషయమును మాకు తెలియజేయుటకే నీవు ఐదు కోర్టులలోను హేళనపొందిన ప్రభువా! నీకు మా కృతజ్ఞతార్పణలు. 12. నీలో ఏ నేరమును లేదని పిలాతునకు తెలిసినను, యూదులకును, రోమావారికిని భయపడి పిరికివాడై నిన్ను సిలువకు అప్పగించినట్లు; 'మేమును, నిన్ను ఒప్పుకొనుటను పిరికివారముగా నుందుము' అను మా నేరమును భరించిన ప్రభువా! నీకు మా వినయ ప్రణుతులు.

13. రాబోవు తీర్పు మాకు లేకుండ చేయుటకు పిలాతు చేతులలో అన్యాయపు తీర్పును పొందిన ప్రభువా! నీకు అనంతకాల స్తుతి.

14. నీ స్వజనులగు యూదులవలన, నీవు పిలువగా వచ్చి పారిపోయిన విశ్వాసులవలన, నిన్ను విడిపింపవలసిన రోమా ప్రభుత్వపువారైన పరజనుల వలన నీకు సిలువ. నిన్ను సిలువవేసిన పై గుంపులలో మేము లేకుండునట్లును, నీ శ్రమ తగ్గించినవారి గుంపులో నుండగలుగునట్లును, నీ దీవెన మాకనుగ్రహింతువని నమ్మి ప్రభువా! నిన్ను ఘనపరచుచు, వందించుచున్నాము.

15. మేము పది ఆజ్ఞలకు విరోధముగాచేసిన పాపములన్నియు నీమీద సిలువగా నెత్తబడెను. అందరి పాపములు కలసి ఒక భారమైన సిలువగా నీపైబడెను. మేము గ్రహింపలేనంత భారమైన సిలువ మా రక్షణ నిమిత్తము మోసిన ప్రభువా! నీకు మా మనసు సమర్పింపగలిగినన్ని స్తుతులు.

16. లోకములో ఎవరును నీకన్న ఎక్కువ శ్రమను పొందలేరు. ఎవరైనను శ్రమ పొందినయెడల, తమ ఒక్కరికొరకే పొందగలరు. గాని నీవలె గతించినవారి నిమిత్తమును, ఉన్నవారి నిమిత్తమును, రాబోవువారి నిమిత్తమును, అనగా అన్నికాలములలో గల ప్రజలందరి నిమిత్తమును శ్రమపొందలేరు. చరిత్రలో ఎక్కడనులేని ఇట్టి గొప్ప శ్రమ చరిత్ర మా కొరకు పొందిన ప్రభువా! నీకు మంగళ హారతులు.

17. మా చెడుగును నీపై వేసికొని, సిలువను భరించి సిలువ దగ్గర విశ్వాసికి హాయినిచ్చిన ప్రభువా! నీకు మా ఆనందస్తోత్రములు.

18. కొట్టి, ముండ్లకిరీటముబెట్టి కల్వరికొండపైనసున్న సిలువపై పరుండబెట్టి నీ చేతులలోను, కాళ్ళలోను, మేకులుకొట్టి నీ శరీరమంతటిని బాధించుట చూడగా, నా చేతులతోను, పాదములతోను, నా శరీరమంతటితోను

చేసిన పాపమునకు శిక్ష భరించిన ప్రభువా! నా ప్రాణముతోను, ఆత్మతోను, శరీరముతోను నిన్ను స్తుతించు చున్నాము.

19. సిలువకు అంటగొట్టిన బాధ, ఆ సిలువనెత్తి గోతిలో నిలువ బెట్టినప్పుడు బాధ, మేకులు ఆయనను లాగిపట్టినప్పుడు బాధ, తలపై ముండ్లకిరీటము కదలుటవలన బాధ, వీటన్నిటిని నన్ను ఎక్కువగా ప్రేమించుటనుబట్టి సంతోషముతో భరించిన నా ప్రభువా! నీ ఋణమును నేనెట్లు తీర్చుకొనగలను? గనుక నా వందనార్పణలను నీకు చెల్లించు చున్నాను.

20. ప్రక్కలో బల్లెపుపోటువలన రక్తముకార్చి సాతాను ప్రక్కను దాని సహవాసములోనున్నవారిని నీ ప్రక్కకు, నీ సహవాసమునకు ఆహ్వానించి విశ్వాసికి ఎంతో సంతోషము కలిగించిన ప్రభువా! నీకు నిత్య మంగళస్తోత్రములు.

21. గెత్సేమనెలో పడిన శ్రమకు చెమట రావలెను. గాని రాకూడని రక్తము వచ్చుటయును, సిలువపై బళ్ళెముతో ప్రక్కలో పొడువగా రక్తము కారవలసినదిగాని రాకూడని నీరు వచ్చుటయు చూడగా, ఎంత సహించినను ప్రజలు మారకున్నారను మనో దుఃఖమువలనను, ఎవరును గ్రహింపలేని మనోవేదనవలన, నీగుండె నీరగునట్లు చేసిన శ్రమను నాకొరకు భరించిన ప్రభువా! నీకు అనంత కోటి నుతులు.

22. మేలు తలంచిన నీ శిరస్సున మరల ముండ్ల కిరీటము వేయకుండను, మేలు చేసిన నీ చేతులలో మరల సీలలను కొట్టకుండను, మేలుచేయుటకు నడచిన నీ పాదములలో మరల మేకులు కొట్టకుండను, పాపులను చేర్చుకొన్న నీ ప్రక్కలో మరల బల్లెము పొడువకుండను, నా పాపముల చెడుద్వారా మరల నిన్ను సిలువ వేయకుండ కాపాడుదువనియు నమ్మి నిన్ను నా అంతరంగమంతటితోను నుతించుచున్నాను. ఈ మా స్తుతులను జయశీలుడైన క్రీస్తు ప్రభువుద్వారా చెల్లించుచున్నాము. ఆమేన్.

Bible Mission HQ Guntur

# పునరుత్థానము

మత్తయి 22:31; 28 అధ్యా॥; మార్కు 16 అధ్యా॥; లూకా 14:14; 24 అధ్యా॥; యోహాను 5:28; 11:23, 20అధ్యా॥; అపో.కార్య 26:26; 1కొరి 15:1-20; 50,56; 1థెస్స. 4:15-18; ప్రకటన 20:4-6;

స్తుతి:- పునరుత్థానుడవైన ప్రభువా! నీవు సమాధినుండి లేచుటవలన విశ్వాసులైన మృతులుకూడ లేతురను విశ్వాసము సంఘమునకు అనుగ్రహించిన నీకు నుతులు. నీవు లేచినావు. గనుక మేముకూడ పాపములు, శోధనలు, కష్టములు మొదలగు వాటిలోనుండి లేచు కృప దయచేసినావు. గనుక నీకు సంస్తుతులు. లోక చరిత్రలో ఎప్పుడును, ఎన్నడును, జరుగని పునరుత్థానము అను గొప్పచరిత్ర జరిగించి, రాబోవుకాలములోకూడ సంఘమునకిట్టి గొప్ప చరిత్ర అనగా పునరుత్థానము జరిగింపనైయున్న నీకు నిత్యస్తుతులు. పునరుత్థాన సమయమందు సాతాను కంటికి కనబడకుండ చేసిన ప్రయత్నములు, దాని ప్రేరేపణ వలన మానవులు కంటికి కనబడునట్లు చేసిన ప్రయత్నములు ధ్వంసము చేసినట్లు; సంఘముకూడ తాను పునరుత్థానము కాకుండా సాతాను, మానవులుచేయు ప్రయత్నములన్నిటిని జయించునను సంతోషము మాకు కలిగించిన నీకు ఆగని ప్రణుతులు. పునరుత్థాన దినమున నీ వెలుగు ఎదుట చీకటి పారిపోయినట్లు, నీ పునరుత్థాన వెలుగునుబట్టి విశ్వాసులయొక్క చీకటిని కూడ పారదోలుదువు. ఇట్టి గొప్ప ఉపకారములు మా యెడల జరిగించిన నీకృపకు తరుగని నమస్కారములు. ప్రభువా! నీ సహింపు వలన మొదటి జయమును, పునర్జీవితుడవై నందున సంపూర్ణ జయమును పొందినట్లు; నీ

బిడ్డలమైన మేమును, నీరాకడవరకు శ్రమలు సహించుటవలన ఈ లోకమందు జయమును; రాకడ కాలమందు పొందు పునరుత్థానమువలన అసలు జయమును పొందుదుమను ఆదరణ మాకనుగ్రహించిన నీకు సంపూర్ణ స్తోత్రములు. ప్రభువా! సాతాను, శత్రువులు; గెత్సేమనే తోట మొదలుకొని సిలువవరకు వచ్చినారు గాని పునరుత్థానమందు ఎవరు రాలేకపోయిరి. గనుక ఇది సాతానుకు గొప్ప సిగ్గు. అలాగే శత్రువులు విశ్వాసులను చివరివరకు తరుముకొని వస్తారుగాని వారిచేతులలో పడకుండ సంఘము ఎగిరిపోవునప్పుడు సాతానుకు, దాని అనుచరులకు గొప్ప సిగ్గు కలుగును. ఇట్టి సంతోషము విశ్వాసులకు కలిగించు నీ పునరుత్థానమునుబట్టి నీకు అనంతకాల నుతులనర్పించుచున్నాము. పునరుత్థానుడవైన ప్రభువా! మేము జరిగిపోయిన నీ పునరుత్థానమునకును, రేపు జరుగనైయున్న సంఘ పునరుత్థానమునకును, మధ్య మమ్మునుంచి త్వరగా రానైయున్న నీ రాకడ నిరీక్షణ మా కనుగ్రహించిన నీ కృపాసహితమైన పని నిమిత్తమై మంగళ స్తోత్రములు. పాపముచేసి మానవుడు తెచ్చుకొన్న మరణము నిన్ను ఆవరించి నీవు లేవకుండ గట్టిగా బంధించినానని తలంచినది. గాని మరణము నిన్ను సమాధిలో ఉంచలేకపోయినట్లు, రేపు మృతులైన విశ్వాసులను మరణముగాని, సజీవులైన విశ్వాసులను లోకముగాని ఆరోహణముకాకుండ ఆపుచేయులేవను గొప్ప విజయవర్తమానము మాకందించిన నీకు మంగళ హారతులు. మా స్తుతులు, స్తోత్రములు త్వరగా రానైయున్న యేసుప్రభువు ద్వారా ఆలకించుము. ఆమేన్.

Bible Mission HQ Guntur

# ఆరోహణ పండుగ స్తుతులు

మత్తయి 28:16-20; మార్కు 16:19,20; లూకా 24:50-53; కార్య 1:6-11.

యేసుప్రభువా! నీకు పరలోకమందు సర్వాధికారమీయబడెను. అందుచేత నీకనేక వందనములు. యేసుప్రభువా! నీకు భూమిమీద సర్వాధికారమీయబడెను. అందుచేత నీకనేక స్తోత్రములు. యేసుప్రభువా! నీవు పరలోకమునకు వెళ్ళకముందు ఒక వాగ్ధానము ఇచ్చినావు. అదియేదంటే 'ఇదిగో నేను యుగసమాప్తి పర్యంతము సదాకాలము మీతోకూడ ఉన్నాను". ఈ మాట నిమిత్తమై నీకనేక స్తుతులు సమర్పించు చున్నాము. ప్రభువా! పునరుత్థానమైన తరువాత పరలోకమునకు చేర్చుకొనబడినావు అని వ్రాయబడియున్నది. కాబట్టి నీకనేక స్తుతులు. ప్రభువా! నీవు దేవుని కుడిపార్శ్వమున ఆసీనుడవైయున్నావని వ్రాయబడియున్నది. గనుక నీకనేక నమస్కారములు.

యేసుప్రభువా! నీవు పరలోకమునకు వెళ్ళినప్పటికిని, భూలోకములోనున్న నీ శిష్యులకు సహకారుడవై యున్నావని వ్రాయబడియున్నది గనుక నీకనేక గౌరవ స్తోత్రములు. ప్రభువా! భూమిమీద నీ శిష్యులద్వారా జరుగుచువచ్చిన నీ సూచక క్రియలవలన వాక్యము నీవు స్థిరపరచుచున్నావు అని వ్రాయబడియున్నది. గనుక నీకనేక వందనీయ స్తోత్రములు.

ప్రభువా! నీవు ఆరోహణ సమయమందు నీ శిష్యులమీద చేతులెత్తి ఆశీర్వదించినావని వ్రాయబడియున్నది. కాబట్టి నీకనేక కృతజ్ఞతా స్తోత్రములు. యేసుప్రభువా! నీవు పరలోకమునకు ఆరోహణమైనావని వ్రాయబడియున్నది గనుక నీకనేక వందనములు. యేసుప్రభువా! నీవు నీ శిష్యులను ఆశీర్వదించుచుండగా ఆరోహణుడవైనావని వ్రాయబడియున్నది. గనుక నీకనేక వందనములు. యేసుప్రభువా! ఆరోహణ సమయమందు నీ శిష్యులు నీకు నమస్కారము చేసిరి. అంత్య దినము వరకు ఉండే నీ శిష్యులవల్ల నీకు నమస్కారములు కలుగుచుండునుగాక! యేసుప్రభువా! నీవు వెళ్ళినందున వారు దుఃఖించక మహానందముతో యెరూషలేమునకు తిరిగివెళ్ళిరి గనుక నీకు వందనములు. యేసుప్రభువా! నీవు వెళ్ళిన తరువాత వారు దేవాలయమునకు వెళ్ళి యెడతెగక దేవుని స్తోత్రము చేయుచుండిరి. గనుక నీకు వందనములు.

Bible Mission HQ Guntur

# పెంతెకొస్తు పండుగ

(పరిశుద్ధాత్మ తండ్రికి ప్రార్ధన)

పరిశుద్ధాత్మవైన దేవా! నీవు దేవుడవు గనుక నీకు వందనములు. పరిశుద్ధాత్మవైన తండ్రీ! నీవు తండ్రివి గనుక వందనముల చేయుచున్నాను. ఓ తండ్రీ! సృష్టికాలమందు నీవు సృష్టిని కాపాడుటకై సృష్టిమీద ఉన్నావు. నీకనేక వందనములు ఆచరించుచున్నాను. కాపాడుచున్న తండ్రీ! నీ సృష్టిలో నేనును ఉన్నాను గనుక నన్నును కాపాడుచున్న తండ్రీ! నీవు వందనములు సమర్పించుచున్నాను. తల్లికోడి రెక్కల క్రింద పిల్లలను దాచి కాపాడు రీతిగా, నీవు నాకు ఏ కీడును రాకుండ కాపాడుదువని నీకు వందనములు చెల్లించు చున్నాను. ***నీవెంత దేవుడవైనను నాలో నివసించుటకు పూనుకొనియున్నావు.*** గనుక నిన్ను వందించుచున్నాను.

"పైనుండి మనమీద ఆత్మ కుమ్మరింపబడువరకు నగరి విడుబడును. జన సమూహములుగల పట్టణము విడువబడును. కొండయు కాపరుల గోపురమును, గుహలుగా నుండును. అవి అడివి గాడిదలగు ఇష్టమైన చోట్లుగాను, మందలు మేయు భూమిగాను నుండును" అని యెషయాచేత నీవు వ్రాయించినావు. కాబట్టి నీకు స్తుతులు. ప్రభువా! నీ కుమ్మరింపులేని యెడల నేను పాడైపోయిన భూమివలె నుందునని ఈ వచనము వలన తెలిసికొనుచున్నాను. ఓ తండ్రీ! కుమ్మరింపు నాకు కలుగునని నేను నిన్ను స్తుతించుచున్నాను. ఆదరణకర్తవైన తండ్రీ! పెంతెకొస్తు పండుగనాడు నూట ఇరువదిమంది ఆత్మతో నిండుకొన్న వారైనారు. గనుక నీకు స్తుతులు చేయుచున్నాను. **నేనుకూడ నీతో నిండినవాడనై యుండగోరుచున్నాను.** కృప దయచేయుదువని నమ్మి స్తుతులు ఆచరించుచున్నాను. ఓ ఆత్మ తండ్రీ! గాలివంటి

ధ్వని ఇల్లంతయు వ్యాపించిన రీతిగానే, నీవు నా జీవితమంతట వ్యాపించుమని ప్రార్థించుచు, అట్లు చేయుదువని నమ్మి నీకు స్తుతులు సమర్పించుచున్నాను. విశ్వాసుల హృదయములలో వ్యాపించిన తండ్రీ! నాలోను వ్యాపించు తండ్రీ! పూర్వ ప్రవక్తలలోను, అపోస్తులులతోను ఉండి, వారిచేత పనిచేయించిన ప్రకారముగా, నాచేతకూడ పనిచేయించుమని ప్రార్థించుచు నీకు స్తుతులు చెల్లించుచున్నాను.

నా తలంపులోను, మాటలోను, చూపులలోను, తినుటలోను, ఆచారములోను ప్రయత్నములోను, క్రియలలోను, సేవలలోను, కష్టకాలములోను, సౌఖ్యకాలములోను, నా బ్రతుకు కాలమంతటిలోను నీవు వ్యాపించుచున్న యెడల నా ధన్యత ఏమని చెప్పను. నీకనేక స్తోత్రములు. ప్రియమైన నా తండ్రీ! నీవు నాలో లేనియెడల ప్రభువు యేసు సంపాదించిన రక్షణభాగ్యమును అందుకొనలేను. అందుకొన్నను నిలుపుకొనలేను. పొందినది వాడుకొనలేను. గనుక అందుకొని, నిలుపుకొని, వాడుకొనునట్లు సర్వములో వ్యాపించి యుండుము. ఇది నా కోరిక. ఇది నా వాక్కు. ఇది నా విశ్వాసము. నెరవేర్చగల తండ్రీ! మంచితనము కలిగియున్నను, దానిలో నీవు లేకపోయిన యెడల దానికి జీవమే లేదు. ***గనుక నాలో ఎప్పుడును చురుకుదనము గలిగి పనిచేయు జీవముండునట్లు నీవు నాలో వ్యాపించియుండుము.*** ఈ నీ పని నిమిత్తమై నా అంతరంగమంతటను నీకు స్తోత్రములు, స్తోత్రములు, స్తోత్రములు. ఆమేన్.

పరిశుద్ధాత్మ బాప్తిస్మమును గూర్చిన ప్రవచనములు

యెషయా 32:14; యెహెజ్కేలు 39:29; యోవేలు 2:28-29; జెకర్యా 12:10. మత్తయి 3:11; మార్కు 1:8; లూకా 3:16; అపో. కార్య. 1:4-5.

## పరిశుద్ధాత్మ పనులు

యోహాను 14:17; 14:25-26; 16:13.

## పరిశుద్ధాత్మ బిరుదులు

హెబ్రీ 9:14; కీర్తన 139:7- 13; 1కొరి. 2:10; లూకా 1:35; రోమా 15:19; Iపేతు 4:14; యోహాను 3:5-6; I యోహాను 5:6-8; II తిమో 3:16; II పేతురు 2:21; యెషయా 11:2; యోహాను 14:26; I కొరి. 12:8; యోహాను 16:13; మత్తయి 12:28; లూకా 11:20; అపో.కార్య. 19:1-6; రోమా 15:19; అపో. కార్య 13:2-4; మత్తయి 9:38; అపో.కార్య. 20:28; అపో.కార్య. 6:8-10; 9:31; II కొరి 1:3; యెహెజ్కేలు 37:28; రోమా 15:16; హెబ్రీ 10:15; యోహాను 16:8-11; 15:26; 14:16; యోహాను 14:17; 14:26; 15:3-5; గలతీ 5:22; I థెస్స. 1:6; రోమా 15:13; గలతీ 5:5; యోబు 33:4; అపో.కార్య. 1:16; I పేతురు 1:11-12; II పేతురు 1:21.

# త్రిత్వాదివారము

## (త్రిత్వ దేవునికి స్తుతి)

యెషయా 6:3; మత్తయి 28:19; I యోహాను 5:7; II కొరి 13:14; ప్రక 1:4-5; 4వ అధ్యా॥, సంఖ్యా 6:24-26.

త్రియేక దేవుడవైన తండ్రీ! ఒక్కరు ముగ్గురుగాను, ముగ్గురు ఒక్కరుగాను బైలుపడినందుకు స్తోత్రము స్తోత్రము, సృష్టిని కలుగజేసినప్పుడు 'వెలుగు కలుగునుగాక' అని పలికిన తండ్రీ! పలుకబడిన వాక్యైయున్న కుమారుడవైన తండ్రీ! పలుకబడిన ప్రకారము వెలుగు కలుగజేసిన తండ్రీ! స్తోత్రము. సూర్యబింబము ఒక్కటైనను, అందు వెలుగు, వేడి, జ్వాలగల త్రిత్వము నుంచిన తండ్రీ! స్తోత్రము. జ్యోతులు సూచనలను, కాలములను, దిన సంవత్సరములను సూచించును. ఇది ఒక త్రిత్వము గనుక నీకు స్తోత్రములు. దినములో ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము అను త్రిత్వము నుంచిన తండ్రీ! స్తోత్రములు. సంవత్సరములో శీతాకాలము, వేసవికాలము, వర్షాకాలములను త్రిత్వము నుంచిన తండ్రీ! స్తోత్రము. ఈ విధముగా సృష్టియంతటిలో నీ త్రిత్వమునుంచిన తండ్రీ! స్తోత్రములు. మానవుని మీ స్వరూపమందు, మీ పోలిక చొప్పున కలుగజేసిన తండ్రీ! స్తోత్రములు. మీ స్వరూపమనగా మీ దివ్య లక్షణములతోను, మీ పోలిక అనగా తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలు ఉన్నట్లు; మానవుని శరీర ప్రాణాత్మలను కలుగజేసి, మానవునిలో త్రిత్వమును కనబరచిన తండ్రీ! వందనములు.

మానవ రక్షణ కొరకు మానవునిగా వచ్చి బాప్తిస్మము పొందిన సమయమందు, కుమారుడు నీళ్ళనుండి బైటకు వచ్చుటయు, పరిశుద్ధాత్ముడు

పావుర రూపమున కుమారునిపై వ్రాలుటయు, తండ్రి, 'నా ప్రియకుమారుడని' పలుకుటయు చూడగా, త్రిత్వమును లోకమునకు బహిరంగముగా బయలుపరచిన తండ్రికి స్తుతులు.

దేవా! పరలోకమందలి దూతలు నిన్ను స్తుతించుటచూడగా, 'పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు' అని ముమ్మారు పలుకుటనుబట్టి నీవు ఒక్కడవైనను, ముగ్గురుగా నున్నావని బయలుపరచుచున్న నీకు నాజ్ఞానమునకు తోచినన్ని స్తుతులు. ఒక వృక్షముయొక్క మ్రానును తీసికొని కుర్చీలు, బల్లలు, మంచములు చేస్తున్నారు. ఆ వస్తువులు ముందు మ్రానులోనున్నట్లు కనబడవు. అలాగే ***త్రిత్వము ముందు మర్మముగా కనబడునుగాని కాలక్రమమున దేవుడు చేసిన పనినిబట్టి అర్థమగును.*** తండ్రీ! నీవు సంఘమునకిచ్చిన దీవెనలో నీ త్రిత్వనామమును బయలుపరచుచున్నావు. 'ప్రభువైన యేసుక్రీస్తు కృపయు, దేవుని ప్రేమయు, పరిశుద్ధాత్మ సహవాసమును మీ కందరికిని తోడైయుండునుగాక!" II కొరి 13:14. వర్తమాన, భూత, భవిష్యత్కాలములలో ఉండువానినుండియు, ఆయన సింహాసనము ఎదుటనున్న ఏడు ఆత్మల నుండియు, నమ్మకమైన సాక్షియు, మృతులలోనుండియు ఆది సంభూతుడుగా లేచినవాడును, భూపతులకు అధిపతియునైన యేసుక్రీస్తు నుండియు, కృపా సమాధానములు మీకు కలుగునుగాక! ప్రకటన 1:4,5.

*ప్రభువా! ఇట్టి దీవెన త్రిత్వనామములో మాకిచ్చినందుకు స్తోత్రములు. ఆమేన్.*

# దైవసన్నిధి

ఆది 4:14; నిర్గమ 33:14; లేవీ 22:3; I దిన. 16:27,33; యోబు 1:12; 2:7; 23:15; కీర్తన 31:20; 32:7; 16:11; 17:2; 51:11; 68:2,8; 97:5 యెషయా 63:9; 64:1; హెబ్రీ. 9:24.

ప్రభువా! పరలోకమందున్న దైవసన్నిధిని పాపభరితమైయున్న భూలోకములో, మామధ్యకు దించి నీ సన్నిధిభాగ్య దీవెనలు మాకనుగ్రహించిన నీ ఘన నామమునకు నమస్కారములు. ఇద్దరు ముగ్గురు నా నామమందు ఎక్కడ కూడుకొందురో వారిమధ్య నేనుందునని పలికిన ప్రభువా! స్తోత్రము. నీవు మాతో నున్నావని, మా మనస్సు నీతో ఉంచి, మా లోపములు దిద్దుకొని, నీ కొరకే జీవించెదమని తీర్మానించుకొని, మా స్వరము నీకు సమర్పించి, నిన్ను స్తుతించి, మా అంశము నీతో చెప్పుకొని, నీవద్ద మౌనముగా నున్నందున సమస్త కీడులు పోయి మేళ్ళు కలుగుననియు, నీవు కనబడి మాటలాడు-దువనియు నీ దాసునిద్వారా నేర్పిన నీకు స్తోత్రములు.

ప్రభువా! యోహాను పద్మసు ద్వీపమున నీ సన్నిధినుండగ, ఆయన నీ యాత్మ వశముననుండి నిన్ను చూచి, నీ మాటవిని, నీవు చూపిన సమస్తమును చూచి, నీవు చెప్పినవి వినగల కృప ఇచ్చిన నీకు స్తోత్రములు. 1) ఆత్మవశము, 2) ప్రత్యక్షత 3) ఆత్మ సంచారము, 4) పరలోక వాస్తవ్యులు మనతోనుండుట. ***ప్రభువా! లోకవశము, పాపవశము, సాతాను వశముకాకుండ, మమ్మును నీ యాత్మ వశము చేయుటకు నీ సన్నిధిని చేర్పాటుచేసి, నీ పాదములయొద్ద నుండుటకు మమ్మును పిలిచిన ప్రభువా!*** నీకు కృతజ్ఞతా

వందనములు. ప్రభువా! నీ పాదములయొద్ద మమ్మునుంచి, నీ ప్రత్యక్షతలను అనగా దర్శనముద్వారా నిన్ను చూచుటకును, అనేక మర్మములు తెలిసికొనుటకును, నీ స్వరము వినుటకును, నీవు వ్రాసి చూపినది చూచుటకును స్వప్నముద్వారా మాకు అనేక విషయములు తెలియజేయుటకును, మా ఊహకు నీ విషయములు అందజేయుటకును, నీ వాక్యములోని అనేక ప్రత్యక్షతలు మా కనుగ్రహించుటకును నీ సన్నిధిని మాకు సాధనముగా నిచ్చిన నీకు మా వినయ నమస్కారములు.

ప్రభువా! సర్వవ్యాపివైన నీయొద్ద మమ్మును ఉంచి, నీ రూపమునకు మమ్మునుమార్చి, నీ సన్నిధి బిడ్డలయొక్క ఆత్మలను పరలోకమునకు, భూలోకములోని ఆయా ప్రదేశములకు, పాతాళలోకమునకుకూడ తీసికొనివెళ్ళి, నీకిష్టము వచ్చినవి చూపించుట, నీ కిష్టమువచ్చిన పనిచేయించుట మొదలగు కార్యములను బలహీనులమైన మా ద్వారా చేయించుకొనుచున్న నీకు ప్రణుతులు. మరియు ప్రభువా! నీ సన్నిధివలననే, నీ విశ్వాసులకు; నీతోను, నీ దూతలతోను పరలోకమందున్న పరిశుద్ధులతోను అనగా పరలోక వాస్తవ్యుల సహవాసభాగ్యము మాకనుగ్రహించినట్లు దయచేయుదువని నమ్మి నీకు నుతులర్పించుచున్నాను. ఆమేన్.

# తైలాభిషేక ఆరాధన పండుగ స్తుతులు (10-8-59)

1. దేవా! మమ్ములను ఈ పండుగకు చేర్చినందుకు నీకు వందనములు ఆమేన్.
2. ప్రభువా! భూమిమీద బైబిలు మిషనును బైలుపర్చినావు గనుక నీకు స్తోత్రములు ఆమేన్.
3. సృష్టికర్తా! రక్షకా! లూథరన్ మిషనులోని బోధకునికి బైబిలు మిషను బైలుపర్చినావు నీకు స్తోత్రములు ఆమేన్.
4. దేవా! బైబిలు మిషనును రాజమండ్రిలో బైలుపర్చినావు గనుక స్తోత్రములు. ఆమేన్.
5. త్రియేక దేవా! బైబిలు మిషను గాలిలో వ్రాయించినావు గనుక నీకు స్తోత్రములు. ఆమేన్.
6. సృష్టికర్తా! గాలి ఎవరియొద్దకు వెళ్లునో వారియొద్దకు బైబిలు మిషను వెళ్లేటట్లు చేయుదువు గనుక నీకు స్తోత్రములు. ఆమేన్.
7. తండ్రీ! పూర్వకాలము దావీదునకు గాలిలో వ్రాసి చూపించినావు. ఇప్పుడు మాలో ఒకరికి చూపించినావు గనుక నీకు స్తోత్రములు. ఆమేన్.
8. దేవరాజా! అన్ని మిషనులను బైబిలు మిషనులోనికి తీసికొని వస్తావు గనుక వందనములు ఆమేన్.
9. దేవా! ప్రభువా! అన్ని మతములవారిని బైబిలు మిషనులోనికి తీసికొని వస్తావు గనుక వందనములు ఆమేన్.
10. తండ్రీ! బైబిలు మిషనులోనికి వచ్చిన వారిని దీవిస్తావు గనుక వందనములు. ఆమేన్.
11. విమోచకుడవైన తండ్రీ! బైబిలు మిషనులోనికి రాలేకపోవుచున్న అభిమానులను దీవిస్తావు గనుక నీకు స్తోత్రములు ఆమేన్.

12. యేసుప్రభువా! బైబిలు మిషనును గ్రహించని వారికి జ్ఞానము దయచేస్తావు గనుక వందనములు ఆమేన్.

13. పరిశుద్ధాత్మవైన దేవా! బైబిలు మిషనును గూర్చి అల్లరి చేసేవారిని బైబిలు మిషను పక్షముగా తీసికొని వస్తావు గనుక వందనములు. ఆమేన్.

14. సర్వజనుల తండ్రివైన దేవా! నాస్తికులను సహితము బైబిలు మిషనలోనికి తీసికొని వస్తావు గనుక వందనములు. ఆమేన్.

15. బైబిలులో బైలుపడిన దేవా! నరమాంస భక్షుకులనుకూడా బైబిలు మిషను లోనికి తీసికొని వస్తావు గనుక వందనములు. ఆమేన్.

16. సర్వలోకముల తండ్రీ! బైబిలు మిషనును గురించి అన్ని లోకములకు తెలియజేస్తున్నావు గనుక స్తోత్రములు ఆమేన్.

17. దేవలోక నివాసీ! నీవు మోక్షలోకములోకూడా బైబిలు మిషనును స్థాపించినావు గనుక నీకు స్తోత్రములు ఆమేన్.

18. పరిశుద్ధుడవైన దేవా! బైబిలు మిషను మోక్షలోకములో స్థాపించినావని చనిపోయిన భక్తుల వలన చెప్పించుచున్నావు గనుక నీకు సోత్రములు. ఆమేన్.

19. గొప్ప కృపగల దేవా! పాతాళ లోకములో ఉన్నవారికికూడా బైబిలు మిషను గూర్చి బోధ చేయిస్తున్నావు గనుక వందనములు. ఆమేన్.

20. అనాది దేవుడవైన ప్రభువా! నీవు అనాదినుండియు మమ్మునుగూర్చి ఆలోచించుచున్నావు గనుక వందనములు. ఆమేన్.

21. అనంత దేవుడవైన ప్రభువా! మాకు అనంత జీవము కలుగజేయనై యున్నావు గనుక వందనములు. ఆమేన్.

22. జీవమైయున్న దేవా! నీ సృష్టియంతటికిని నీవు ప్రతిదినము జీవమిచ్చు చున్నావు గనుక వందనములు. ఆమేన్.

23. జీవమునిచ్చుచున్న దేవా! నీకు స్తోత్రములు ఆమేన్.

24. జ్ఞానమైయున్న దేవా! సృష్టియంతటిని ఒక క్రమము అనుసరింపజేసినావు ఇది నీ జ్ఞానము గనుక నీకు స్తోత్రములు. ఆమేన్.

25. ప్రేమరైయున్న దేవా! నీవు పాపాత్ములను సహితము ప్రేమించుచున్నావు గనుక నీకు స్తోత్రములు ఆమేన్.

26. న్యాయమైయున్న దేవా! నీ ఆజ్ఞలను తుంచనాడే వారిని రక్షించుటకు శిక్షించుచున్నావు. ఇది నీ న్యాయమైయున్నది గనుక నీకు స్తోత్రములు. ఆమేన్.

27. పరిశుద్ధమైయున్న దేవా! నీ సృష్టిలో చేరిన కళంకమంతటిని నీవు తీసివేసి నీవు పరిశుద్ధ పరచగలవు. గనుక నీకు స్తోత్రములు. ఆమేన్.

28. సర్వవ్యాపివైయున్న దేవా! నీవు ఎంత దేవలోకములో ఉన్నప్పటికిని గనుక ఎక్కడబడితే అక్కడే ఉండగలవు సృష్టియంతటిని కాపాడగలవు నీకు స్తోత్రములు చెల్లించుచున్నాను. ఆమేన్.

29. సర్వశక్తుడవైయున్న దేవా! మానవునికి ఏది చేయుటకు అసాధ్యమో అది నీకు సాధ్యము. అందుచేత అందరిని రక్షింపగలవు. గనుక నీకు మా కృతజ్ఞత స్తోత్రములు ఆమేన్.

30. దేవా! సర్వ స్వాతంత్ర్యమైయున్న దేవా! నీవు కలుగజేసిన సృష్టియంతటికిని నీవు స్వతంత్ర్యము ఇవ్వగలవు గనుక నీకు స్తోత్రములు కలుగునుగాక! ఆమేన్. ఈ మా స్తుతులు, స్తోత్రములు నీకుమారుని పరిముఖముచూచి ఆలకించుమని వేడుకొనుచున్నాము ఆమేన్.

# బైబిలు పండుగ స్తుతులు

## మతోద్ధారణ పండుగ

ద్వితీ. 26:15-19; 28:1-12; లేవీ 26:1-13; కీర్తన 46 అధ్యా॥; మత్తయి 21:12,13; అపో.కార్య 14:21-27; రోమా 12:1-2; II కొరి 6:1,2; ఎఫెసీ 5:15,16; కొలస్స. 4:5.

దేవా! నీ వాక్యము లోకముయొక్క నేత్రములకు కనబడేటట్లు దానిని వ్రాతలో పెట్టించినావు కాబట్టి నీకు స్తోత్రములు. ఓ తండ్రీ! లోకమునకు నీ స్వరము వినబడదు. గనుక నీ వాక్యము కనబడేటట్లు అచ్చు వేయించినావు గనుక నీకు వందనములు. నేటికి నీ గ్రంథము 2000 భాషలలోనికి వచ్చివేసినందువల్ల ఇప్పుడది లోకముయొక్క హస్తభూషణము అయినది. అందుచేత నీకనేక వందనములు. నీ వాక్యగ్రంథమును అందరు చదివినా, చదవకపోయినా, చూచి ప్రక్కబడి వెళ్ళిపోయినా, సాక్షార్ధముగా లోకముయెదుట ఉన్నది. గనుక నీకు వందనము.

ఓ దేవా! నీవు హెబ్రీ బాషలో పలికిన పలుకు మా కాలములో రెండువేల పలుకులుగా వినబడుచున్నది. గనుక నీకు స్తోత్రములు. ఓ తండ్రీ! రెండువేల భాషలవారు ఒకచోట కూడుకొని అందరు యోహాను 3:16 చదివితే ఒకరిమాట ఒకరికి అర్ధము కాకపోయిన అందరికి అర్ధము తెలుసు గనుక అందరు నిన్ను స్తుతిస్తారు. ఇన్ని భాషలలో నీకు స్తుతివస్తుంది. కాబట్టి నీకు వందనములు. లూథర్ బయటకు తీసిన ఒక బైబిలును అన్ని భాషలలోనికి మార్చేటందుకు, బైబిలు సొసైటీవారిని లేపినందుకై నీకనేక వందనములు. ఓ తండ్రీ! అక్షరాలు లేని భాషలలోకూడ నీ గ్రంథములోని సంగతులు నీ సేవకులు బోధిస్తున్నారు గనుక నీకనేక వందనములు.

ఓ ప్రభువా! అనేకమంది భక్తులను లేపి నీ గ్రంథముయొక్క అర్ధాలు వ్రాయించినావు. కాబట్టి నీకనేక వందనములు. ఆ అర్ధాలుగల వ్యాఖ్యానములు చదివి నీ సేవకులు సంఘాలకు బోధిస్తున్నారు. గనుక నీకు వందనములు. ఓ తండ్రీ! నీ గ్రంథము అచ్చువేయించుటకు చాలా ధనము అవసరము. బైబిలు సొసైటీవారు నీ గ్రంథమునకు సరియైన ఖరీదేర్పరచితే అందరు కొనలేరు. అందరియొక్క అందుబాటులో ఉండేటట్లు తక్కువ ఖరీదు పెట్టించినావు గనుక నీ కనికరము నిమిత్తమై అనేక వందనములు. ఓ దయగల తండ్రీ! ఇన్ని యేళ్ళనుండి నీ పుస్తకము అచ్చువేయుటకు బైబిలు సొసైటీవారికి సామర్థ్యము దయచేసినందుకు వందనములు. ఇంకా శక్తి ఇస్తావని నమ్ముచూ ఆనందిస్తున్నాను.

ఓ దేవా! నీ వాక్యగ్రంథము లోకములోని గొప్పగొప్ప పుస్తకశాలలో ఒక ముఖ్యమైన పుస్తకమైనది. అందుచేత నీకు వందనములు. ఓ దయగలతండ్రీ! నీ గ్రంథమును అనేకమంది తప్పులు పట్టవలయునని, ఖండించవలయునని చదివినారు. అట్టివారు చదివి చదివి మారుమనస్సు పొందినారు. కాబట్టి నీకు అనేక నుతులు. కొందరు బైబిలులో పండితులు కావలెనని కోరి నలగ చదివినారు. అట్లు చేయుటవల్ల వారినే నలగగొట్టింది బైబిలు. కనుక వందనములు. ఓ దేవా! నీ వాక్యము పురుషులు వెళ్ళలేని ఘోషా గృహముల లోనికికూడ పంపించినావు గనుక నీకనేక నమస్కారములు.

# సర్వ పరిశుద్ధుల పండుగ

ఎఫెసీ 1:1-3; దానియేలు 7:27; హెబ్రీ. 11, 12:1.

ప్రభువా! మానవులను నీవు కలుగజేసినప్పుడు వారిని పరిశుద్ధులుగానే చేసియున్నావు. అట్టి పరిశుద్ధత మాకర్థము కానప్పటికిని, పాపపతనము తరువాత వచ్చిన మాకును, అట్టి పరిశుద్ధత దయచేయుదువని నమ్మి నిన్ను స్తుతించుచున్నాము.

మానవులు పాపములో పడిన తరువాత అనేకులను పరిశుద్ధపరచి, భక్తులనుగా మార్చి, నీ మహిమకొరకు వాడుకొన్నట్లుగా, మమ్మును కూడ వారివలె మార్చి పరిశుద్ధపరచి, వాడుకొందువని నమ్మి నిన్ను కొనియాడు చున్నాము. పాతనిబంధన భక్తులను నీవు పరిశుద్ధపరచి, భూమిమీద వారిని వాడుకొని, పరలోకమందు వారిని చేర్చుకొన్నట్లు, మమ్మునుకూడ నీ మహిమకొరకు వాడుకొని, తుదకు పరలోకము చేర్చుకొందువని నమ్మి నీకు అనంతకోటి వందనములర్పించుచున్నాము. ప్రభువా! నీవు భూలోకమునకు వచ్చిన తరువాత అనేకమందిని నీవు నీ రక్తముద్వారా శుద్ధీకరించి, వారిని పరిశుద్ధులుగా చేసిన నీ కృపకు వందనములు. మమ్మునుకూడ పరిశుద్ధపరతువని నమ్మి నీకు నమస్కారములు చెల్లించుచున్నాము.

నీవు మా కొరకు ప్రాణము నర్పించిన విషయమును చూచి, అనేకులు నీకొరకు తమ ప్రాణములర్పించి, హతసాక్షులైన పరిశుద్ధులలో చేరియున్నారు. మేము మా ప్రాణములను సహితము లెక్కచేయక, నీకు హతసాక్షులుగా జీవించు కృపనిత్తువని నమ్మి నీకు నుతులర్పించుచున్నాము. నీవు కొందరిని ఏర్పరచుకొని వారిని హిమాలయ పర్వతములలో ఎవ్వరును వెళ్ళలేని స్థలమందుంచి, వారిద్వారా నీకు ఇష్టమైన పని చేయించుకొనుచున్నందులకు అనేక వందనములర్పించుచున్నాము. ***మాలో కొందరికి వారికున్నట్టి అనుభవము నిత్తువని నీకు ప్రణుతులర్పించుచున్నాము.*** నీ రాకడ కాలమందున్న పరిశుద్ధులకు నీవు మరణము అంటకుండజేసి, సజీవులగుంపులో వారిని నీ మేఘములోని కాకర్షించుటకు తయారు చేయుచున్నావు. మమ్మునుకూడ అట్టి గొప్ప స్థితికి తయారుచేతువని నిన్ను వందించుచున్నాము. ఆమేన్.

# రాకడ పండుగ

మత్తయి 24 అధ్యా॥; 25:6-10; మార్కు 13 అధ్యా॥; లూకా 17:3437; 21 అధ్యా॥; యోహాను 14:3; అపో. కార్య. 1:11; 2:19; I కొరి. 15 అధ్యా॥; కీర్తన 45 అధ్యా॥; యెహెజ్కేలు 37:21; ఎఫెసీ 5:27; I థెస్స. 4:16,17; 5:2; II పేతురు 3:3-9.

**ప్రార్థన:-** త్రియేక దేవుడైన ఓ తండ్రీ! ప్రభువా! సర్వాధికారీ! సమస్త సృష్టికి కర్తవైన ఓ తండ్రీ! నీ మహా గొప్ప మహిమ యెదుట పాపులమైన మేము ఈ దినమందు కూర్చుండి మా ప్రభువుయొక్క రెండవ రాకడను ధ్యానము చేయగోరుచు నిన్ను స్తుతించుచున్నాము. ఓ దేవా! నీవు కలుగజేసిన సూర్య చంద్ర నక్షత్రములను వధువు సంఘము చూచినపుడు, ఇవే ఇంత కాంతిగా ఉంటే, నా తండ్రి ఇంకా ఎంత కాంతిగా ఉండునో అని తలంచే తలంపు వధువు సంఘమునకు దయచేయుము. నేనింకెప్పుడు పరలోకములోనికి వెళ్ళి ఆయన మహిమ కాంతిలో జ్యోతివలె ప్రకాశించి, ఆనందించుదునో అని తలంచే కృప వధువు సంఘమునకు దయచేయుము. ఆ రాబోయే మహిమ కాంతికి మేము సిద్ధపడులాగున ఇప్పుడే ఈ జ్యోతులకాంతిని ఆకాశమందు చూపుచున్నందుకు నీకు వందనములు. ఆకాశ జ్యోతులకాంతిని చూపుచు, నీ మహిమ కాంతిని జ్ఞాపకము చేస్తున్నందుకు వందనములు. వాటికి స్వరము లేకపోయిననూ 1) బోధకులకంటె, 2) గ్రంథములకంటె మాకు ముందుగా నీ మహిమను తెలియజేయు జ్యోతులనుబట్టి నీకు వందనములు.

2. నీవు మాకు దాచిపెట్టి ఉంచిన మేఘజలమును చూడగా, మేము పరలోకములోనికి వచ్చి చూడబోయే, 'సుఖారు బావియొద్ద సమరయ స్త్రీతో చెప్పిన జీవ జలమును' జ్ఞాపకముచేయునట్టి కృప వధువు సంఘమునకు

దయచేయుము. 3. మరలా భూమిమీదకు రాగా మాకంటె తక్కువగా నిన్నుగూర్చి తెలిసియున్న పక్ష్యాదులయొక్క ఉదయకాల గానములు చూడగా, పరలోకానికి వెళ్ళి ఆగని స్తుతిగానము మేమెరుగని స్తుతిగానము, దూతల స్తుతిగానము, భక్తుల స్తుతిగానము ఎట్లుండునో అని గ్రహించు వధువు సంఘ స్థితి మాకు జ్ఞాపకము దయచేయుము. 4. ఇంకా క్రిందికి రాగా పాపముచేయు మానవులకు ఇక్కడి పండ్లు పువ్వులు ఆనందము దయచేయుచుండగా; మాకు, పరలోకములో జీవవృక్ష పండ్లు, పుష్పములు, వస్తువులు ఇంకెంత ఆనందము దయచేయునో అని తలంచే కృప వధువు సంఘమునకు దయచేయుము.

5. పాపమువలన చెడిన ఈ సృష్టిలోనే ఇంత రమ్యమున్నది. ఇంతకంటే పరలోకములో ఎంత రమ్యముండునో! అని ఎదురుచూచే వధువు సంఘ కృప మాకు దయచేయుము.

6. పాపలోకములో నుండగానే, మా తండ్రీ! కొంతమంది విశ్వాసులను నేర్పరచి, బోధించే బోధకులను ఇచ్చిన ఈ క్రమము చూస్తుండగా, ఇక్కడి బోధకులవలననే ఇట్టి మహిమ బోధలు వివరింపబడుచున్నవి, పాపములేని పరలోకములో పరిశుద్ధులు వివరించే బోధలు ఇంకా ఎంత వినసొంపుగా నుండునో అని తలచే తలంపులు, జ్ఞాపకముచేసే వధువు సంఘ కృప మాకు ఇమ్ము.

7. ఇక్కడ ధ్యానముచేసేవారి సమాజము కొద్దిమందే, అక్కడ సమావేశమయ్యే గుంపు దీనికంటే పెద్దదేగాని, వీటన్నిటికంటే ఎక్కువైన సమావేశము అక్కడున్నది. మా స్నేహితులు, బంధువులు, క్రొత్త నిబంధనవారు, పాత నిబంధనవారు, సంఘ చరిత్రవారు, మా మిషనువారు అక్కడ ఉన్నారు. మేమెన్నడు అనుకొనని పరమ దుర్మార్గులైనవారు, పరమ భక్తులుగా ఉన్నారని అనుకొనగల వధువు సంఘ తలంపు దయచేయుమని వందనములు అర్పిస్తున్నాము.

8. కొందరు దర్శనములు చూస్తున్నారు, అంత సంతోషములేదు. అక్కడ అందరిని చూస్తాము. ఈ పాడులోకము, పాడుచెత్త, పాడైనవన్నీ ఇక్కడ చూస్తున్నాము. అక్కడ అట్టి పాడు ఉండదు గనుక ముఖాముఖిగా చూచే వధువు సంఘ కృప దయచేయుము.

9. త్వరగా వస్తానన్న ప్రభువు త్వరగా వస్తుంటే, త్వరగా మేము సిద్ధపడి, ప్రభువా! నీవు ఒక్కడవే కాదు; మేముకూడ త్వరగా వస్తున్నాము అని చెప్పే వధువు సంఘ కృప మాకు దయచేయుము.

10. పాపులమధ్యను, సుంకరులమధ్యను కూర్చుండియున్న మా ప్రభువువలె; పాపులు, సుంకరులమధ్య నేడు ఉన్న వధువు సంఘముయొక్క నిరీక్షణ, సమావేశములు, బోధలు, గానములు మాచుట్టూనున్న వారు చూస్తుండగా, వారికిని ప్రేరేపణ కలిగి వధువు సంఘములోనికి వచ్చేటట్టు చేయగలవని నమ్మి, ***ఇన్నాళ్ళకు మీరుకూడ వధువు సంఘములోనికి వచ్చినారా! అని హస్తపరిచయము జేసికొనే*** వధువు సంఘ కృప దయచేయుము. తండ్రీ! విశేషముగా మేము నీ సన్నిధిలో ఉండగలిగే కృప దయచేయుము. నీ కృపగల వర్తమానము అందించుమనియు, రావలసినవారిని రప్పించుమనియు వేడుకొనుచున్నాము. ఆమేన్.

# దైవిక స్వస్థత

ఆది 20:17; నిర్గమ15:26; సంఖ్యా 12:10-14, 21:4-9; I రాజులు 13:4-6; 17:17-24; II రాజులు 1వ అధ్యా॥; 4:8-32-37; 5:1-14; 20,17; II దిన. 7:14; 16:12-14; యోబు 33:25; కీర్తనలు 6:2; 30:2; 41:3; 92:15; 103:1-5; 107:20; సామెతలు 3:7-8, 4:20-22; యెషయా 19:22; 38:1-8; 53:4-5; యిర్మియా 17:14; జెకర్యా 13:6; మలాకీ 4:2; మత్తయి 4:23-24; 8:2-13; 9:2-8; 20:22; 12:9-15; 14:34-36; 15:29-31; 19:1-2; 20:29-34; 21:14,15; 26:51; మార్కు 1:40-49; 2:1-12; 6:53-56; 8:22-26; 14:47; లూకా 5:12-26; 7:1-10; 13:10-17; 18:11-19; 22:50; యోహాను 4:46-54; 5:1-9; 10:38; 18:10-11; అపో. కార్య. 3:1-10; 5:15,16; 8:4-8; 9:15-18: 14:7-11; I పేతురు 2:24.

మహిమ ప్రభావముగల తండ్రీ! మానవుని కొరకు సమస్త దానములుగల భూమి యాకాశములను కలుగజేసిన తండ్రీ! వందనములు. మానవుడు తన జ్ఞానమును వినియోగించి, నీవు కలుగజేసిన వాటిని వాడుకొని స్వస్థత నొందుటకు, సృష్టిలో నీ ప్రభావమును ఉంచిన తండ్రీ! నమస్కారములు. "నిన్ను స్వస్థపరచు యెహోవాను నేనే" అని పలికిన తండ్రీ! నీ ప్రవక్తలద్వారా నీవనేక రోగులను స్వస్థపరచిన నీకు నుతులు.

కుమారుడవైన తండ్రీ! నీవే స్వయముగా నీ ప్రభావముచేత రోగులను స్వస్థపరచిన నీకు నుతులు. ప్రభువా! పక్షవాత రోగి నీ వద్దకు తేబడి నిన్ను అడుగకపోయినను, వాని హృదయములోనున్న కోరికనుబట్టి స్వస్థపరచిన నీకు వందనములు. దేవ మానవుడవైన ప్రభువా! సేన దయ్యములు పట్టినవాడు

నిన్నుచూచి నమస్కరించిన చర్యనుబట్టి, అతనిలోని దయ్యములను వెళ్ళగొట్టిన నీకు నమస్కారములు.

జీవమైన తండ్రీ! ఒక అధికారి వచ్చి– 'నా కుమార్తె ఇప్పుడే చనిపోయినది, అయినను నీవు వచ్చి నీ చేయి ఆమెమీద ఉంచుము, ఆమె బ్రతుకుననెను'. అధికారి నిన్ను వేడిన ప్రకారమే వెళ్ళి ఆ చిన్న దానిని స్వస్థపరచిన నీకు ప్రణుతులు.

ఏర్పాటు రక్షకుడవైన ప్రభువా! కనాను స్త్రీ వచ్చి కుమార్తె స్వస్థత కొరకు ప్రాధేయపడి అడుగగా, ఆమె కుమార్తెను బాగుచేసిన నీకు వందనములు. పరిశుద్ధుడవైన తండ్రీ! పదిమంది కుష్ఠరోగులు మమ్మును కరుణించుమని వేడుకొనగా, వారి మనవి విని మీరు వెళ్ళి యాజకులకు కనబరచుకొనుడని చెప్పిన నీ మాట ప్రకారము వారు వెళ్ళుచు దారిలో బాగుపడిరి. ***ఈ విధముగా స్థలాంతరమున బాగుచేసిన నీకు స్తోత్రములు.*** ప్రార్థన చేయునపుడు 'మీరు అడుగుచున్న వాటినెల్లను పొందియున్నామని నమ్ముడి. అపుడవి మీకు కలుగునని చెప్పుచున్నాను' అని సెలవిచ్చిన ప్రభువా! మేము ప్రార్థించిన, ***ఆశించిన అంశములు నెరవేరనపుడు; నెరవేరినవని నమ్మగల కఠిన విశ్వాస పద్ధతిని, మాకు అలవరచిన నీకు వందనములు.*** మా స్థితిని, గతిని ఎరిగిన తండ్రీ! మేమెంత ప్రార్థించినా నెరవేరనపుడు మా ప్రార్థనాంశము నీ దివ్య చిత్తమునకు సంపూర్ణముగా సమర్పించి, నీ సహాయముకొరకు ***అబ్రాహామువలె*** నిరీక్షింపగల కృప దయచేయుదువని నమ్ముచూ నీకు స్తుతులు చెల్లించు చున్నాము. (ఆది 18:30–33).

పరిశుద్ధాత్మవైన తండ్రీ! నీ సంఘమునకు నీ శక్తులను దయచేసి రెండువేల సంవత్సరములనుండి అనేకులను నీ ప్రభావముచేత బాగుచేయుచున్న నీకు స్తోత్రములు. ఈ మా స్తుతులు, త్వరగా రానైయున్న యేసునామమున అంగీకరించుము. ఆమేన్.

# ఉపవాస ప్రార్థన స్తుతులు

నిర్గమ 24:18; 34:28; I రాజులు 19:8; నెహెమ్యా 1:4; ఎస్తేరు 4:16; యెషయా 58:3-12; యోవేలు 1:14; కీర్తన 109:24; యిర్మియా 36:6; దాని 6:18; 9:3; మత్తయి 4:2; 6::16-18; అపో.కార్య. 13:2; 14:23; II కొరి. 6:5.

1. ప్రభువా! మేము ఉపవాసము చేయునప్పుడు ఇతరులకు కనబడునట్లుకాక; రహస్యమందుండి చూచుచు, ప్రతిఫలమిచ్చు నీకు కనబడునట్లు చేయుమని చెప్పిన నీ ఘననామమునకు స్తుతులు. మా కోర్కెలు మా అంశములు నెరవేరనప్పుడు, ఉపవాస ప్రార్థనవలన వాటిని నెరవేర్చుకొనగలమను విశ్వాసము మాకు దయచేసిన తండ్రీ! నీకు నమస్కారములు.

మోషే నలుబది దినములు ఉపవాసమున్నపుడు, నీ నిబంధన వాక్యములను పలకపైవ్రాసి, వాటిని నీ ఏర్పాటుజనాంగమైన ఇశ్రాయేలీయులకును, వారి తరువాత చాలా కాలమునకు వచ్చిన మాకును, అందజేసిన ప్రభువా! నీకు వందనములు. ప్రవక్తయైన ఏలీయా నలుబది దినములు ఉపవాసము చేసినప్పుడు, అతనిని ప్రాణభయము నుండి తప్పించి, నీవు మాట్లాడి, ధైర్యపరచి చేయవలసిన పనులు చేయించి, చివరికి మరణము లేకుండచేసి, మోక్షమునకు కొనిపోయిన తండ్రీ! నీకు వేలాది నుతులు. మా ప్రభువా! నీవు నరరూపిగా వచ్చి సేవలో ప్రకాశింపకముందు, నలుబది దినములు ఉపవాసముచేసి సాతానును జయించి, సేవకు ఆయత్తపడినందుకు నీకు మా హృదయపూర్వక వందనములు. ఓ మా తండ్రీ! నీ వాక్యములో నీ బిడ్డలైనవారు అనేకులు ఉపవాసముండి ప్రార్థనచేయగా, వారి ప్రార్థనలను విని, వారి కోర్కెలను నెరవేర్చిన విషయములను తలంచుకొని నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము.

# సుఖోపవాసము

మమ్మును మిక్కిలిగా ప్రేమించిన మా ప్రభువా! నీవు గాలిలో వ్రాయించి చూపిన బైబిలు మిషనువారమైన మాకు 'నలుబది దినములు సుఖోపవాసములు చేయుమని' నీ దాసునిద్వారా అందించిన వర్తమానమునుబట్టి నీకు నుతులు. ఇట్టి సుఖోపవాసముల ద్వారా, అనేకుల కోర్కెలు, కఠినమైన అంశములు, నీ ప్రేమనుబట్టి నెరవేర్చిన నీకు ఘన సంస్తుతులు. ఈ రీతిగా అనేకులను నీ రాకడకు ఆయత్తపరతువని నమ్మి నీకు కృతజ్ఞతాస్తుతులు అర్పించుచున్నాము. మా స్తుతులు, స్తోత్రములు నీ కుమారునిద్వారా అందుకొనుము. ఆమేన్.

# స్వాతంత్ర్యము

(దీ. 15 ఆగష్టు, 1947వ సంవత్సరము)

యోహాను 8:32,36; 1తిమోతి 2:1-3; 1పేతురు 2:14-17.

## స్తుతి ప్రార్థన

దేవా! మా సృష్టికర్తవును, తండ్రివియు, రక్షకుడవైన నీవు స్వతంత్రుడవు గనుక సర్వకార్యములను నీయంతటనీవే చక్కబరచుకొనగల స్వతంత్రుడవు. కనుక నీకు వందనములు. నీపావన లక్షణములైన ప్రేమ, జీవము, న్యాయము, పరిశుద్ధత, శక్తి మొదలగునవి మానవునికిచ్చి వాటితోపాటు స్వతంత్ర లక్షణమునుకూడ జన్మమునందే మాకిచ్చిన నీ దయకు మా నుతులు. దేవా! మేము స్వతంత్రులమైనను, దేవుడవైన నీమీద ఆధారపడవలసి యున్నాము. గనుక పరతంత్రులముగాకూడ మేము వర్ధిల్లుచున్నాము. ***అట్టి పరతంత్రము మాకిచ్చి, మా స్వతంత్రత దుస్థితిలోనికి పోకుండచేసి మమ్మును స్వతంత్రులనుగాను, పరతంత్రులనుగాను చేసిన నీకు నమస్కారములు.***

మాలోగల సద్బుద్ధి, దుర్బుద్ధియను రెండింటిని నడిపించుటకు అనగా సద్బుద్ధి చెప్పిన ప్రకారము చేయుటకును, దుర్బుద్ధిని అణచివేయుటకును, స్వాతంత్రమను లక్షణమును గొప్ప సాధనముగా ఇచ్చిన ప్రభువా! నీకు వందనములు. పరిశుద్ధ దేవదూతల లోకములోని ప్రధానదూతలోనికి దుర్బుద్ధి వచ్చినందున, తాను తన అనుచరులతో క్రిందికి వచ్చివేయవలసి వచ్చెను. ఆ సాతాను తన స్వతంత్ర లక్షణమును వాడి (ఉపయోగించి), దుర్బుద్ధి నణచివేసిన ముప్పు రాకపోయెడిది. ప్రభువా! మేమట్లు పడిపోకుండ నీవు మాకిచ్చిన స్వతంత్ర లక్షణమును సరిగా వాడుకొని నిలువబడగల శక్తి దయచేయుదువని నమ్మి నీకు నుతులర్పించుచున్నాము.

మొదట నరులను మోసపుచ్చుటకు సాతాను సర్పవేషముతో వచ్చి మాట్లాడినపుడు, **'మా తండ్రి తినవద్దన్నాడు, గనుక మేము తినము'** అని చెప్పి తమ స్వతంత్రతను వాడుకొన్నయెడల వారు పరిశుద్ధులుగానే ఉండియుందురు. మేమును మా స్వతంత్రతను వాడుకొని, సాతానుకు చోటియ్యకుండు కృపనిత్తువని నమ్ముచు ప్రణుతులర్పించుచున్నాము. మొదటి మానవులు ఒక పాపమే చేసిరి కాని తరువాత వచ్చినవారు అనేక పాపములు చేయుటవలన, వారికి దేవుడిచ్చిన స్వతంత్రతను సరిగా వాడుకొని, పాపముచేయకుండ కాపాడుదువని నీకు స్తోత్రములు చెల్లించుచున్నాము. దేవా! మా దేశమునకిచ్చిన స్వతంత్రతను కాపాడుకొనగలుగునట్లు పరిపాలకులను, ప్రజలను దీవించుము. మరియు మా శత్రువగు సాతాను బారినుండి మమ్మును కాపాడి, రక్షించినట్లే, మాదేశ విరోధుల చేతిలో పడకుండ వారి బారినుండి మా దేశమును, దేశ స్వాతంత్ర్యమును కాపాడి రక్షింతువని నమ్మి నిన్ను వందించుచున్నాము. ప్రభువా! మా దేశమందున ప్రభుత్వము వారిచ్చిన మత స్వాతంత్ర్యమును, నీకు మహిమకరముగా వాడుకొనునట్లు సహాయపడుదువు గనుక నీకు నిత్య మంగళ స్తోత్రములర్పించు చున్నాము. ఆమేన్.

# పుష్పావతి అయినప్పుడు

# చేయవలసిన స్తుతి ప్రార్థనలు

1. త్రియేకుడవైన తండ్రీ! తల్లి గర్భములో పడినది మొదలుకొని ఈ నీ కుమార్తెను కాపాడి, భద్రపరచి, ఎదిగించి ఈ యవ్వన ప్రాయములోనికి తోడుకొని వచ్చిన తండ్రీ నీకు స్తుతులు.

2. సృష్టికర్తవైన తండ్రీ! మీరు మాకొరకై కలుగజేసిన భూమిలోనుండి పుట్టించిన గింజను చూడగా, ఆ గింజ నుండి మొక్కను ఎదిగించిన క్రమమును పరిశీలించగా ఆ ఎదిగిన మొక్కను కొమ్మలతో విస్తరింపజేసిన క్రమమును పరికింపగా ఆ విస్తరించిన మొక్కను పుష్పించు క్రమములోనికి నడిపించుట పరీక్షింపగా ఆ పుష్పించిన మొక్కయొక్క ఫలింపు క్రమము కనుగొనగా ఈ నీ కుమార్తెయొక్క జీవిత క్రమమును ఆ నీ యొక్క ఆదికాల సృష్టి క్రమములోని మర్మములలో ఒక మర్మముగా ఇమిడ్చినావు గనుక నీకు అనేక స్తోత్రములు.

3. పరలోకపు తండ్రీ! సృష్టిలోని గింజను భూగర్భములోనికి పంపిన రీతిగా ఈ కుమార్తెనుకూడ తన తల్లి గర్భములో పిండముగా వేసినావు గనుక నీకు వందనములు. పిండముగా రూపింపబడక పూర్వమే నేను నిన్ను ఎరిగియున్నాను (యిర్మియా 1:4) అని యిర్మియా ప్రవక్తతో సెలవిచ్చిన రీతిగా ఈ నీ కుమార్తెను అనాది కాలములోనే నీవు ఎరిగియున్నావు గనుక నీకు ఆద్యంత రహిత ప్రణుతులు.

4. పునరుత్థానుడవైన దేవా! భూమి లోపలి గింజలోనుండి మొక్క బయటకు వచ్చు రీతిగా తల్లి గర్భములో ఈ పిండమును ఎదిగించి సమయము రాగా నీ నిత్య జీవముతో బయటకు తెచ్చుటద్వారా ఈ నీకుమార్తెను లోకములో నూతన సృష్టిగా జన్మింపజేసినావు గనుక నీకు అనేక ఆనంద వినుతులు.

5. జీవాధిపతివైన దేవా! మొక్క బయటకు వచ్చిన తరువాత ఎలాగున గింజ మట్టిలో కలిసిపోవునో, అలాగుననే తల్లి గర్భమునకు ఈ నీ కుమార్తెకు సంబంధము లేకుండా చేసినావు గనుక నీకు స్తోత్రములు. మొక్కలోని వేరులు ఎలాగున భూమిలో దిగి విస్తరించునో, అలాగుననే నీ కుమార్తెకును ఈ లోకములో ఒక ప్రత్యేకమైన జీవితాభివృద్ధి క్రమమును ఏర్పాటు చేసినావు గనుక నీకు మంగళహారతులు. మొక్క ఎలాగున భూసారము తీసుకొని పెద్ద వృక్షముగా రూపాంతరము చెందునో అలాగుననే ఈ నీ కుమార్తెనుకూడా నీవు నీ స్వతంత్ర జీవనముతో, నీ శరీరాత్మీయ సారములతో ఈ పరిపక్వ స్థితికి ఎదిగించినావు గనుక నీకు  నా మనసునకు తోచినన్ని మహిమానంద సంస్తుతులు.

6. అనంతజ్ఞానియైన దేవా! ఎదిగిన మొక్క ఏలాగున తన కొమ్మలను విస్తరింపచేయునో, ఆలాగుననే ఈ నీ కుమార్తెకూడా అన్ని విషయములను తన జ్ఞానముద్వారా తెలుసుకొనుటకును, మంచిని తన మనస్సాక్షితో అనుభవించుటకును జ్ఞానాభివృద్ధిని, జ్ఞానాత్మను దయచేయుదువు అని నమ్మి నిన్ను మనసారా కొనియాడుచున్నాము.

7. వాక్యమైయున్న దేవా! ఈ నీ కుమార్తె నీ దివ్యగ్రంథము చదువుటయందును, నేర్చుకొనుటయందును ఆసక్తిని పెంపొందించుము. నీ దయయందును, మనుష్యుల దయయందును వర్ధిల్లి మంచిపేరు సంపాదించుకొనుటలో విస్తరింపచేయుము. విస్తరించిన మొక్క ఏలాగున పుష్పించునో, ఆ రీతిగనే నీ సమయమునకు ఈ నీ కుమార్తెను పుష్పింపజేసినావు గనుక ఈ నీ బిడ్డను నీతిఫలములతో అలంకరించుమని నిన్ను వేడుకొనుచున్నాము.

8. మా కేడెమైయున్న దేవా! పుష్పించిన మొక్కయొక్క పూతనుబట్టి తోటమాలి ఏలాగున చుట్టును కంచెవేసి రాత్రింబగళ్లు కావలికాసి భద్రపరచునో,

ఆలాగుననే నీ కుమార్తె చుట్టును నీ ఆత్మ కంచెనువేసి నీ రాకడవరకు నీ కావలిలో భద్రపరచుము. ఈ నీ కుమార్తెయొక్క యవ్వన ప్రాయమున కలిగి యుండవలసిన కట్టుబాట్లను నీవే స్వయముగా నేర్పించుము.

9. ప్రాణనాధుడవైన ప్రభువా! బాల్యకాలము అనగా ఆడిపాడిన ప్రాయము గతించిపోగా ఈ నూతన యవ్వన కాలములో ప్రవేశించిన ఈ నీ కుమార్తె నీ యందు కలిగి ఉండవలసిన భయభక్తులు, కట్టుబాట్లు, తల్లిదండ్రులకు కనుబరచవలసిన విధేయత కలిగి యుండి, దైవభక్తిచేత తన నడతను శుద్ధిచేసికొను కృప దయచేయుదువు, గనుక నీకు అనేక కృతజ్ఞతా స్తోత్రములు.

10. అతికాంక్షణీయుడవైన తండ్రీ! పుష్పించిన చెట్టును చూచిన వారికందరికిని ఇష్టముగానుండును. ఆలాగుననే ఈ నీ కుమార్తె నీ వాక్యాను సారముగా నడుచుకొనుచూ, అందరియెడల మంచిని సంపాదించుకొను శుద్ధిని, ప్రవర్తనాకర్షణను అనుగ్రహించుము.

11. అతిమనోహరుడవైన తండ్రీ! పుష్పించిన చెట్టు 'రేపో, ఎల్లుండో ఇక కాయలు కాయును' అని పెంచువారికి ఆశను పుట్టించునట్లు నీ కుమార్తెకూడ తన నడవడిలో, తన మాటలో, తన వినికిలో, తన ఆలోచనలో మంచి తలంపులు కలిగి జీవించుచూ నీకు ముచ్చట కలిగించు స్థితిలోనికి, నీకు ఆశను పుట్టించు స్థితిలోనికి నడిపించి, ఫలింపజేయుము నీకు స్తుతులు.

12. సర్వశక్తిమంతుడవైన దేవా! ఇంతవరకు ఈ నీ బిడ్డను నీ కౌగిటిలోనుంచి కాపాడిన తండ్రీ! ఈ ప్రత్యేక స్థితిలోనికి తోడుకొని వచ్చిన తండ్రీ! నీ కుమార్తెయొక్క ఈ యవ్వన ప్రాయము మొదలుకొని తన జీవితకాల పర్యంతము వరకును నీ పరిశుద్ధతను తోడుగానుంచి నీ రాకడ వధువుగా, సిద్ధపరచుమని త్వరగా వచ్చుచున్న ప్రభువునుబట్టి వేడుకొనుచున్నాము తండ్రీ! ఆమేన్.

# ఉపకారముల స్తుతి

కీర్తన 103:2; నెహెమ్యా 9:21; కీర్తన 26:7.

ఓ దేవా! తండ్రీ! నీ నామమహిమను అనుభవించుటకై మమ్మును కలుగజేసిన నీకు అనేక స్తోత్రములు. అన్ని అనుగ్రహదానములగు భూమి యాకాశముల నిమిత్తమై వందనములు. నిత్యము నిన్ను స్తుతించుచు, మాకు కావలిబంటులుగా నున్న దేవదూతల నిమిత్తమై నీకు స్తుతులు.

మా కొరకు అన్నిచేసిపెట్టి, ***ఆయనతో సమానులుగా ప్రేమించిన నీ ప్రియకుమారుడైన క్రీస్తుప్రభువు నిమిత్తమై నీకు నుతులు.*** మాలోను, మాతోను ఉండి మమ్మును మహిమరాకకు ఆయత్తపరచుచున్న పావనాత్మ నిమిత్తమై స్తోత్రములు. నీ దివ్యలక్షణ రూపమును, అనాదినుండి అనంతమువరకు మా కొరకై చేయుచున్న రక్షణ కార్యక్రమమును, అన్ని లోకములలో మాకొరకు ఉంచిన భాగ్యమును; పాపమును; పరిశుద్ధతను మా కన్నులకు కనబరచు రాజగ్రంథమైన బైబిలు గ్రంథము నిమిత్తమును నీకు ప్రణుతులు. మేము నిత్యము నీతో జీవించుటకై, మాకొరకు సిద్ధపరచిన మహిమ మోక్షము నిమిత్తమై స్తోత్రములు. నిన్ను, నీవు మాకై ఇచ్చిన సమస్త దానములను లోకమునకు చూపుచు, తెలియజేయుచున్న క్రైస్తవ సంఘము నిమిత్తము వందనములు. పైనున్న సమస్తదానములను మేము అందుకొనుటకును, అనుభవించుటకును, ఆనందించుటకును, మాకు అనుగ్రహించిన భూలోక దైవసన్నిధి సహవాసము నిమిత్తమై నీకు వందనములు.

## అపకారముల నివారణ స్తుతి

కీర్తన 34:7; 107:19-21; 43:1; 76:10; 103:2; 33:1; 119:164; 26:7; నెహెమ్యా 9:31-32; ప్రకటన 14:6-7; 5:12-14; 15:3-4.

మహోపకారివైన తండ్రీ! రాత్రికాలమున కలుగు కీడులన్నిటినుండి మమ్మును తప్పించుటకు, కావలిదూతను మావద్ద ఉంచినందున నీకు స్తుతులు.

తండ్రీ! మంచు, ఎండ, గాడ్పు, అగ్ని, వాన, కలహము, వ్యాధి, భూకంపము, దుర్వార్తలు వినుటవలన కలుగు కీడులన్నిటినుండి తప్పించుచున్న నీ ఉపకార లక్షణమునకై స్తోత్రములు.

సర్వశక్తిగల దేవా! దురాత్మలు, మృగములు, జలచరములు, పక్షులు, పాపనైజము, శాపము, సాతాను, పాపఫలితము, అపాయము, అంటువ్యాధులు, అపనమ్మిక, మరణములు, శత్రువులు, విషపురుగులు, జంతువులు, కపట సహోదరులు, చోరులు, అజాగ్రత్త, అజ్ఞానము, అనాగరికత, ప్రయాణ సాధనములు; వీటివలన కలుగు సమస్త విధములైన హానిని నిర్మూలము చేయుచున్న నీకు వందనములు. మా స్తుతులు త్వరగా రానైయున్న క్రీస్తుప్రభువుద్వారా చెల్లించుచున్నాము. ఆమేన్.

## అనుదిన ప్రార్థన

**1. పాపపు ఒప్పుదల:-** ఓ దేవా! నేను నిన్ను తలంచుటకైనను, నీపేరెత్తుటకైనను, నిన్ను ప్రకటించుటకైనను యోగ్యుడనుకాను. జన్మము, తలంపు, మాట, చూపు, వినికి, ప్రయత్నము, క్రియ, నైజము- వీటినిబట్టి నేను పాపినైయున్నాను. ***నీ ఉచితార్థమైన కృపగల ఉపకారములకు లేశమైనను పాత్రుడనుకాను.*** ఇది ప్రభువును బట్టి అంగీకరించుము. ఆమేన్.

**2. విశ్వాస ప్రమాణము:-** ఓ దేవా! మహా ప్రభావముగల తండ్రీ! నీ అధికమైన ప్రేమనుబట్టి నన్ను అంగీకరించుచున్నావని నమ్ముచున్నాను. నా నిమిత్తమే భూమి ఆకాశములను, మోక్షమును, అనుదినము నేను అనుభవించువాటిని కలుగజేసి యున్నావని నమ్ముచున్నాను. మరియు నాకు అన్ని విషయములలోను సహాయము చేయగల పరిశుద్ధులైన దేవదూతలనుకూడ నా నిమిత్తమే కలుగజేసినావని నమ్ముచున్నాను. నీ ప్రియకుమారుని ద్వారా అనుగ్రహించు రక్షణ భాగ్యము నా నిమిత్తమే అని నమ్ముచున్నాను. ప్రేమ, శక్తి, జ్ఞానము, న్యాయము, విశ్వాస్యత, పరిశుద్ధత, సర్వ వ్యాపకత్వము, నిరాకారము, జీవము, అనంతము, అనాది, నిర్వికారము మొదలగు పరిశుద్ధ

లక్షణములతో నీవు ప్రకాశించుచున్నావని నమ్ముచున్నాను. ఇట్టి గొప్పవాడవైన నీవు నా దేవుడవు, నా రక్షకుడవు, నా తండ్రివి, నా సహకారివి, నా వైద్యుడవు, నా దాతవు, నా హృదయవాసివి, నా సర్వము అని హృదయ పూర్వకముగా నమ్ముచున్నాను. నీవు నా పాపములను ఎప్పటికప్పుడే క్షమించియున్నావనియు, **నా మీదికి కష్టములు వచ్చుటవల్ల, నాకు వివిధములైన ఉపకారములను వాటివలన చేయుచున్నావనియు,** నన్ను నాశనమునకు అప్పగించవనియు నమ్ముచున్నాను. నీవు పరలోకములోను, ఇతర స్థలములలోను మాత్రముకాక నాలో నిత్యము ఉన్నావనియు పరిపూర్ణముగా నమ్ముచున్నాను.

నా ఆత్మీయ జీవనాభివృద్ధికై సంఘమును ఏర్పాటు చేసినావనియు నమ్ముచున్నాను. తుదకు నన్నుబట్టి కాదుగాని నీ కుమారుని బట్టి నా ప్రార్థనలన్నియు ఆలకింతువనియు, నిత్య మోక్షములోనికి నన్ను చేర్చుకొందు-వనియు నమ్ముచున్నాను. ఈ నా పూర్ణ విశ్వాసమును యేసుప్రభువుద్వారా ఆలకించుము. ఆమేన్.

**3. ప్రార్థన:–** ఓ దయగల తండ్రీ! నీవు ప్రార్థనలు వినువాడవగుటవలన నీ సన్నిధికి వచ్చి ఏదైనా చెప్పుకొన వచ్చుననియు, అడుగుకొనవచ్చుననియు తెలిసి, నిన్ను స్తుతించుచున్నాను. నాకు కావలసినవి నీకు ముందుగానే తెలిసినను, అడుగుడి మీ కియ్యబడునని చెప్పినావు. గాన నా మనవులన్నియు నీ యెదుట సమర్పించుకొను చున్నాను. ఓ తండ్రీ! నాకు ఏమి ఇయ్యవలెనని నీకు ఉన్నదో అదే దయచేయుము. నేను ఎల్లప్పుడు నీ సన్నిధిలో స్వేచ్ఛగా సంచరింపగల బిడ్డనుగా నన్ను స్థిరపరచు చుండుము. కష్టకాలములోను, సంగతులు అర్థముకాని కాలములోను, నేను నీ పక్షముగా నిలువబడగల ధైర్యము దయచేయుము. నిన్ను గూర్చి నాకు గల మంచి అభిప్రాయమును మారనీయకుము. **పాపమునుండియు, పాప ఫలితమునుండియు నన్ను కాపాడు చుండుము.** ప్రతి పర్యాయము నీ వాక్యము నాకు బోధపరచుచుండుము. నా ఆత్మతో సదా మాట్లాడుచుండుము. మరియు నీ విషయమై కృతజ్ఞతతో కష్టపడి పనిచేయగల సేవకునిగా నన్ను

స్థిరపరచుచుండుము. నన్ను పెండ్లికుమార్తె వంశమునుండి విడిపోనీయకుము. నీ కిష్టములేనిదే నేను అడుగ తలంచునప్పుడు, అవి ప్రార్థన వాలులోనికి రాకుండ తప్పింపుము. మరియు ఒక అంశమును గురించి ప్రార్థించవలసిన గడియ దాటిపోనీయకుము. నాకు ప్రార్థన వాలు దయచేయుము. సర్వజనులకు నీ వాక్య వార్త అందింపగల బోధకులను పంపుము. వాక్యముపదేశించు ఏర్పాటులన్నిటిని వృద్ధిచేయుము. పాపులకు, బాధితులకు, బీదలకు అన్యాయము పొందుచున్నవారికి తోడైయుండి, వారి పక్షమున జరుగవలసిన సత్య కార్యములను వృద్ధిచేయుము. ఈ ప్రార్థన నీ కుమారుని ముఖము చూచి ఆలకించుము. ఆమేన్.

**4. సమర్పణ: –** ఓ దేవా! నీవు నాకు ఇచ్చినవన్నియు నీకు సమర్పించు చున్నాను. మరియు నా శరీరమును, నా ఆత్మను, నాకు కలిగియున్న సమస్తమును, నా జీవితకాలములోని గత కాలమును, నేటి కాలమును, రాబోవుచున్న కాలమును నీకు అర్పించుచున్నాను. నీ చిత్తము ఏదో అదే నా చిత్తమైయున్నది. నీ చిత్తము అనేకమారులు నాకు ఇష్టముగా నుండకపోయినను, నేనది ఇష్టపడునట్లు సహాయపడగోరుచున్నాను. ఏది నేను చేయలేక పోవుచున్నానో ఆ మంచి కార్యమును; నాకుగాని, నీకుగాని ఇష్టములేనిది ఏది చేయుచున్నానో ఆ కార్యమును నీకు అప్పగించుచున్నాను. మా బంధువులను, స్నేహితులను, అధికారులను, నేనంటే ఇష్టములేనివారిని, మాకు ఇష్టములేని వారిని, శత్రువులను నీకప్పగించుచున్నాను. మమ్మును బాధపెట్టు పురుగులు, జంతువులు, పక్షులు మొదలైన వాటిని నీకు సమర్పించుచున్నాను. అలాగే మాకు బాధకరముగానున్న దయ్యములను, సైతానును తత్ సంబంధమైన వాటినన్నిటిని నీ వశము చేసికొనుచున్నాను. మేము బాధ తెచ్చుకొను వృక్షాదులు, శిలలు నీకు అర్పించుచున్నాను. మాకు హానికరము కలుగునట్టి పంచ భూతములను నీకు అర్పించుచున్నాను. ఈ అర్పణ నీ కుమారుని పరిముఖము చూచి అంగీకరించుము. ఆమేన్.

**5. రాకడ ప్రార్థన:-** ఒక గ్రామములో అందరు కలహములతో నుండిరి. ఒక దినమున తన జ్వరముగానున్న కుమార్తెను చూడవచ్చిన తండ్రి, భయంకరమైన కలహముల సంగతి విని తన కుమార్తెను తన ఇంటికి తీసికొనిపోయెను. ఈ లోకము గత్తరలోకము, పాప లోకము, పాపఫలితములగు అవస్థల లోకము, కరువుల లోకము, వ్యాధుల లోకము, విషపురుగుల లోకము, నిరీక్షణలేని లోకము, మరణలోకము, దయ్యాల లోకము, దయ్యాలకు లోబడిన మనుష్యులున్న లోకము. ***కాబట్టి మన తండ్రియైన దేవుడు మనలను ఇచ్చట నుండకుండ మోక్షమందిరమునకు తీసికొని వెళ్ళును.*** ఆయన శీఘ్రముగా వచ్చును. ఇదే రెండవరాకడ. తండ్రి కుమార్తెను తీసికొని వెళ్ళునప్పుడు 'రాను' అని చెప్పదు. మనముకూడ మేఘములోనికి రాము అని చెప్పకూడదు. ప్రభువా! తండ్రీ! సిద్ధముగా నున్నాను అని చెప్పవలెను. ఓ ప్రభువా! మేమట్లు చెప్పగల కృపదయచేయుము. ఆమేన్.

**6. స్తుతి:-** సర్వ సద్గుణ నామధారివైన ఓ ప్రభువా! నా సృష్టికర్తా! నీ స్థితినిబట్టి నీకు వందనములు. నేను ఏ నిమిషములో నిన్ను స్తుతించుట మానగలను! ***నా మనసులోనికి తెచ్చుకొనగల సర్వాంశములును నీ స్తుతియైయున్నది.*** నేనుకూడ నీ స్తుతియై యుండగోరుచున్నాను. నా బ్రతుకంతయు నిన్ను స్తుతించునుగాక! దేవదూతలు పరిశుద్ధులగుటచేత పాపినైన నేను వారివలె స్తుతించలేక పోవుచున్నాను. గాని వారివలె స్తుతించవలెనని నాకు ఉన్నది. ***నా హృదయములోని నా స్తుతి, రాత్రంతయు వెలిగే కాగడావలె ఉండవలెనని కోరుచున్నాను.*** నేను పొందుచున్న ఉపకారము వలనను, నా సేవ వలనను నీకు కీర్తి కలుగునుగాక! ***ప్రార్థనవాలు దయచేయుమని అడిగిన నేను స్తుతిగానము కూడ దయచేయుమని వేడుకొనుచున్నాను.*** ఈ నా బలహీనమైన స్తుతి ప్రభువైన యేసునుబట్టి అందుకొనుము. ఆమేన్, ఆమేన్, ఆమేన్, ఆమేన్, ఆమేన్, ఆమేన్, ఆమేన్.

# విజ్ఞాపనాంశములు

చదువరీ! మిత్రుడా! నీవు నిన్ను గురించి దేవుని ప్రార్థించుకొనుట చాలదు. ఇతరులను గురించికూడ ప్రార్థింపవలెను. నీకు తీరిక ఉన్నప్పుడు దేవునియెదుట ఈ అంశములెత్తి ప్రార్థించుము. లేదా చదివివేయుము. ఈ దిగువనున్న మాటలను గురించి **'అని'**, గాని, **'కొరకు'** అని గాని చేర్చి చదువుము. దీనికి నీ జాబితా చేర్చుకొనవచ్చును.

**ప్రార్థనాంశములు:–** దేవుడు కలడని నమ్మినవారు, కలడని నమ్మియు ఆయన తలంపేలేనివారు, దుష్టబుద్ధిగలవారు, మాంత్రికులు, మెస్మరిజమువలన హాని చేయువారు, భూతపీడితులు, దుష్ట స్వప్నములుగలవారు, తప్పుడు దర్శనములు గలవారు, శక్తిపూజ చేయువారు, అజ్ఞానులు, నరహంతకులు, నరమాంస భక్షకులు, స్వహత్య చేసికొనువారు, అబద్ధికులు, వ్యభిచారులు, త్రాగుబోతులు, కుటుంబ కలహములు గలవారు, గవర్నమెంటువారు మరియు తక్కిన అధికారులందరు, వారి విరోధులు, కలహనివారణలు, యుద్ధనివారణలు, దొంగతనము చేయువారు, జీవ హింసకులు, మతధూషకులు, అసూయ, పగ, ద్వేషము, కోపముగలవారు, చింతాక్రాంతులు, సోమరులు, నేరములు కల్పించువారు, మనస్పర్థలు గలవారు, కృతజ్ఞతలేనివారు, అన్యాయము పొందువారు, పెట్టు మందుకారకులు, బాకీలు తీర్చనివారు, వడ్డీలు ఎక్కువ కట్టువారు, ఎక్కువ లాభమునకు సరుకు అమ్మువారు, అన్నివిధములైన వృత్తులుగలవారు, పిరికివారు, ఊరకనే అనుమానపడువారు, **తెలియని పాపములు చేయువారు,** అశుభ్రత, అజాగ్రత్త, అనాగరికత, అనాచారము, దురాచారము గలవారు; ఆయా వ్యాధులు గలవారు, వైద్య శాలలలోనివారు, చేతిపనుల శాలలలోనివారు, గ్రుడ్డివాండ్ర పాఠశాలలలోనివారు, బీదవారు,

భిక్షకులు, పనులు దొరకనివారు, ఊరూరు తిరుగు దొమ్మరులు మొదలగువారు; అనాథశాలలు, పాఠశాలలు, నీటిమీదను, మెరకమీదను, అడవులలోను, బండ్లమీదను, విమానములమీదను, ఎండలోను, వానలోను, చీకటిలోను ప్రయాణము చేయువారు, మరలయొద్దను, గనులలోను, నీటిలోను పనిచేయువారు, అన్ని మతములవారు, అన్ని దేశములవారు, సత్ప్రవర్తనగలవారు, ఉపకారులు; సరియైన వివాహములు, ప్రసవ వేదనలు, సంతాన విహీనత, పంటలు, కరవులు, ఇతరుల భూములను ఆవరించుకొనువారు, పక్షులు, పశ్వాదులు, మృగాదులు, వృక్షాదులు; పురుగులవలన, తక్కిన జీవులవలన, మనుష్యులవలన, ముండ్లవలన, రాళ్ళవలన, శీతోష్ణాది భేదము వలన కలుగుహాని, ఆకస్మిక అపాయము, పిడుగు, భూకంపము, వరద, వానలేమి, అన్నదాన సమాజములు మొదలగు పరోపకార సమాజములు, మత సంబంధమైన సమాజములు, మత సంబంధమైన సభలు; నూతన విషయములు కనిపెట్టువారు, **ఈ జీవాంతమందు కలుగనైయున్న జీవితమును గూర్చిన తలంపులేనివారు,** పాపఫలితము అనుభవించుచున్నవారు, మనస్సాక్షియొక్క మాట నిర్లక్ష్యపెట్టువారు, ఆపత్కాలమందు ఏమిచేయవలెనో తోచనివారు మొదలగు వారిని గురించి ప్రార్థించవలెను.

# ప్రార్థనాధికము

1) దేవా! సృష్టికర్తా! తండ్రీ! మాకందరకును కనబడి మాతో మాటలాడుము. గాలిని, వెలుగును, వానను ఉచితముగా ఇచ్చుచున్న నీకు అనేక నమస్కారములు. 2) ప్రయాణీకులను రాకపోకలయందు, బసయందు ఏ చిక్కు రాకుండా కాపాడుము. 3) జన సమర్ధముచేత కలుగు రాపిడివలన కష్టము కలుగనీయకుము. 4) ప్రజలకు జాగరూకత, మెళకువ నేర్పించుము. 5) అన్నపానాదుల వలనగాని, కొనబడిన వస్తువుల వలనగాని, స్నానమువలనగాని, గాలివలనగాని, వర్షమువలనగాని, ఎండవలనగాని, హాని రాకుండ కాపాడుము. 6) ఏ వ్యాధియైన ప్రవేశింపకుండ ప్రతివారిని కాపాడుము. 7) కక్షలుగల వారివలనగాని, ***భేధాభిప్రాయములుగల వారివలనగాని, మనస్పర్ధలుగల వారివలనగాని*** మత సంబంధమైన వివాదములవలన గాని ***కీడు కలుగనీయకుము.*** 8) అందరిలోను స్నేహ భావమును కలిగించుము. 9) రక్షక భటులతోపాటు నీ దేవదూతలనుకూడ కావలి వారినిగా నియమించుము. 10) ఆట పాటలవలన ఎట్టి అపాయము కలుగనీయకుము. 11) దొంగతనము మొదలగు ఏ పాపమునకైనను సందు దొరకనీయకుము. 12) బీదలను, చిన్నపిల్లలను, వ్యాధిగ్రస్తులను కాపాడుము.

1. దేవా! ప్రజాసౌఖ్యార్ధమై సదుపాయములు ఏర్పరచుచున్న అధికారులను, వారి పరిచారకులను దీవించుము. 2. ఇక్కడకు వచ్చు ప్రతివారిని పేరు పేరు చొప్పున దీవించుము. 3. ప్రజలను కాపాడుటకై ఏర్పడిన పోలీసువారిని, తమ ఉద్యోగ ధర్మమును యుక్తముగా నెరవేర్చుకొనునట్లు దీవించుము. 4. స్థలమును పరిశుభ్రము చేయువారిని దీవించుము. 5. ప్రజలందరికొరకు ధనాదులను ఖర్చుపెట్టువారిని సంపదలతో దీవించుము.

6. భోజనాదులు సిద్ధపరచి, వడ్డించువారిని దీవించుము. 7) ఈ జనమును దీవించుమని ప్రార్ధించువారిని దీవించుము. 8. ఈ సందర్భమున మా హిందూ దేశమంతటిని దీవించుమని వేడుకొనుచున్నాము. ఆమేన్.

సలహా! చదువరులు, వినువారు ఇవిగాక ఏవైన క్రొత్త ప్రార్ధనలు, దీవెనలు చేర్చుకొనవచ్చును.

దేవా! నీవు భూమిని కలుగజేసినప్పుడు సమస్తమును దీవించినావు. అయినను మేము నేడు చూచుచున్నట్లు చాలవరకు కష్టస్థితియే కనబడుచున్నది. కనుక పశ్వాదులను, పక్షులను, వృక్షాదులను, నేలను **మరల మరల దీవించుచుండుము.** తథాస్తు.

# దీవెనలు

లూకా 2:14; I తిమోతి 1:17; ప్రకటన. 1:6; 4:8,11; 5:12-14; 19:1; II కొరి. 13:14; సంఖ్యా 6:26.

1. పాప ప్రేరేపణ గలవారలారా! దేవుడు మీకు పాప విసర్జన శక్తినిచ్చి మిమ్మును దీవించును గాక!
2. అనారోగ్యవంతులారా! దేవుడు మీకు ఆరోగ్యమిచ్చి మిమ్మును దీవించును గాక!
3. లేమిగల వారలారా! దేవుడు మీకు కలిమినిచ్చి మిమ్మును దీవించును గాక!
4. బిడ్డలులేని వారలారా! దేవుడు మీకు శిశుదానము చేసి మిమ్మును దీవించును గాక!
5. భూత పీడితులారా! దేవుడు మీకు విముక్తిని దయచేసి మిమ్మును దీవించును గాక!
6. మందమతులారా! దేవుడు మీకు నిర్మలమైన జ్ఞానమిచ్చి మిమ్మును దీవించును గాక!
7. శత్రుబాధగల వారలారా! దేవుడు మీకు శత్రు బాధలేకుండా జేసి మిమ్మును దీవించును గాక!
8. అన్యాయము పాలగుచున్న వారలారా! దేవుడు మీకు న్యాయమనుగ్రహించి మిమ్మును దీవించును గాక!

9. ఋణబాధగల వారలారా! దేవుడు మీకు ఋణబాధ తీర్చి మిమ్మును దీవించును గాక!

10. యుక్త సమయమున పెండ్లి సమకూడని వారలారా! దేవుడు మీకు మంచి జత నేర్పరచి మిమ్మును దీవించును *గాక!*

11. కుటుంబ కలహములుగల వారలారా! దేవుడు మీ కలహములను ఆపుజేసి, ఐకమత్యత కలిగించి మిమ్మును దీవించును గాక!

12. నానా విధములైన చిక్కులు గలవారలారా! దేవుడు మీ చిక్కులను విడదీసి, మిమ్మును దీవించును గాక!

13. ***దైవభక్తి కుదరని వారలారా! దేవుడు మీకు మనో నిదానమును, స్థిరభక్తావేశమును పుట్టించి మిమ్మును దీవించును గాక!***

14. చదువరులారా! దేవుని యెడల అపనమ్మిక, భీతి, విసుగుదల, తొందరపడు గుణము, అనాలోచన, చింత, నిరాశ, మొదలగునవి మీలోనికి చేరకుండునట్లు దేవుడు మిమ్మును దీవించును గాక!

15. *జీవాంతమందు మీకు మోక్షభాగ్యము లభించునట్లు దేవుడు మిమ్మును దీవించును గాక! ఆమేన్.*

| | | | | |
|---|---|---|---|---|
| మొదటి | ముద్రణ | 1969 | ప్రతులు | 1000 |
| రెండవ | ముద్రణ | 1975 | ప్రతులు | 1000 |
| మూడవ | ముద్రణ | 1985 | ప్రతులు | 1000 |
| నాల్గవ | ముద్రణ | 1991 | ప్రతులు | 1000 |
| ఐదవ | ముద్రణ | 1994 | ప్రతులు | 5000 |
| ఆరవ | ముద్రణ | 2005 | ప్రతులు | 1000 |
| ఏడవ | ముద్రణ | 2007 | ప్రతులు | 2000 |
| ఎనిమిదవ | ముద్రణ | 2010 | ప్రతులు | 2000 |
| తొమ్మిదవ | ముద్రణ | 2012 | ప్రతులు | 2500 |

ఇది దేవుడు, యం. దేవదాసు అయ్యగారికి బైలుపరచిన

**బైబిలు మిషను ప్రచురణ**

బైబిలు మిషను ప్రెస్, పెదకాకాని, గుంటూరు – 522 509.

ఫోన్ : (0863) 2223718, 9949121777.

Bible Mission HQ Guntur